thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 348 కరీంనగర్ ఆదివారం, 23 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## హిందీని వ్యతిరేకిస్తూ తమిళనాడు అంతటా పోస్టర్లు..

చెన్నై: జాతీయ విద్యావిధానం పేరుతో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రయత్నిస్తోందంటూ డీఎంకే నాయకులు విమర్శల వర్షం కురిపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రమంతటా గోడలపై ప్రత్యక్షమైన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రోజున పసుపురంగుతో ఉన్న ఓ రైల్వేస్టేషన్ గోడపై 'తమిళ్ వాళ్‌గ' (తమిళం వర్ధిల్లాలి) అనే నినాదం, దాని దిగువనే హిందీ భాషలో ఉన్న 'హిందీ' పదాన్ని కొట్టేసినట్లు తారుపూసినట్టు పోస్టరు రూపొందించారు.. ఈ పోస్టర్ 1970లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నాయకత్వంలో జరిగిన హిందీ వ్యతిరేకోద్యమంలో రైల్వేస్టేషన్లలో ఉన్న హిందీ పేర్లను తారుతో పూసిన సంఘటన తలపించేలా ఉండటం విశేషం. చెన్నై సహా పలు నగరాలలో ఈ పోస్టర్లు అతికించి ఉన్నాయి.

# పకడ్బందీగా కులగణన సర్వే

# చేసిన రాష్ట్రం మరొకటి ఉండదు

## మరో మారు బీసీ నేతలతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## వాళ్లు ముగ్గురు.. జనాభా లెక్కల్లోనే లేరు

హైదరాబాద్ : కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు రేవంత్.

ప్రతిపక్షాలు మొండిగా.. తొండిగా వాదిస్తున్నారని విమర్శించారు రేవంత్. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడక అని అందుకు సర్వే వివరాలు బయటపెట్టలేదన్నారు.

కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం బీసీలు తగ్గారు..ఓసీలు పెరిగారని చెప్పారు. కాకి లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు రేవంత్. కులగణన సర్వే తెలంగాణ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ నిలుస్తోందన్నారు . దేశమంతా కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ భయపడుతోందన్నారు.

**కులగణన నూటికి నూరు శాతం పక్కా** : బీసీ కులగణన సర్వే చేపట్టడం ద్వారా చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన విషయంలో భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాహుల్ గాంధీ దాదాపు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని.. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణను ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్రమైన కులగణన చేపట్టామన్నారు.

ఈ మేరకు బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ పూర్తి పారదర్శకంగా సర్వే చేపట్టాం. అధికారిక కార్యచరణకు అధికార బృందాన్ని వేశాం. బిహార్, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేశాం. కులగణనలో మూడు రోజుల పాటు ఇళ్ల వివరాలు సేకరించాం. ఇందుకోసం ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారులను నియమించాం. మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించాం. 36 వేల మంది డేటా ఆపరేటర్లను అదనంగా నియమించాం. ఎన్‌రోలర్‌గా సమాచారం సేకరించిన వారే డేటా ఎంట్రీ చేశారు. దాదాపు కోటి 12 లక్షలకుపైగా కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కులగణన ప్రయత్నమే చేయలేదు. న్యాయపరంగా, చట్టపరంగా నిబంధనలకు లోబడి చేశాం. 96.9 శాతం జరిగింది... 3.1 శాతం సర్వే రాలేదు. ఇంత పారదర్శకంగా కులగణన చేపడుతున్నా కొంత మంది నాయకులు ఇంకా చేయించుకోలేదు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 4 విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 5 కేటగిరీలున్నాయి. ముస్లింలలో ఓబీసీలను నాడు కేసీఆర్ ప్రభుత్వం విడిగా చెప్పలేదు. గుజరాత్‌లో కూడా ఓబీసీ ముస్లింలు ఉన్నారని ప్రధాని చెప్పారు. బీసీల లెక్క తేలితే మాకేంటి.. అని ఆ వర్గం అడుగుతారని భాజపా, భారాస భయపడుతోంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ ప్రధాని అయితే.. అన్ని రాష్ట్రాల్లో కులగణన జరిగితీరుతుంది. కులగణనను కాపాడుకోకపోతే.. బీసీలే నష్టపోతారు. ఇంత పకడ్బందీగా సర్వే చేసిన రాష్ట్రం ఇకపై కూడా మరొకటి ఉండదు" అని సీఎం అన్నారు. నివేదిక ఆధారంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సూచనలు ఇవ్వాలని బీసీ సంఘాల నేతలను కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యాచరణపై సూచనలివ్వాలని కోరారు. బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు.



## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష్ బిస్త్‌ను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఏపీలో చేరేందుకు వీలుగా వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. కరీంనగర్‌లో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఈసీని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. రహదారి భద్రత అథారిటీ ఛైర్మన్ అంజనీకుమార్(1990), తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్(1994), కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి(2011)లు ఏపీకి వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)... రెండు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించడం.. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు జరిగాయి. చివరకు 2024లో నియమించిన ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు ఇప్పుడు ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.



## రైతు భరోసాపై కీలక అప్‌డేట్.. రానివాళ్లు ఇలా అప్లైచేసుకోండి..!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా విషయంపై చాలా నెమ్మదిగా అడుగులు వేస్తూ వస్తుంది. ఈ నేపథ్యంలోనే రైతు సోదరులు అందరూ కూడా రైతు భరోసాపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే రైతు సోదరులకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా డబ్బుల విషయం పై కీలక ప్రకటన వచ్చింది. అదేంటంటే.. ఇప్పటి నుంచి ముందుగానే బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ కానున్నాయి. మరి ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయి అనే విషయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం...

నిజానికి రైతు భరోసా డబ్బులను మార్చి నెల చివరిలోనే అర్హులైన రైతులు అందరికి అందిస్తామని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలోనే తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ రైతు భరోసా విషయం పై కీలక ప్రకటన చేశారు. ఈ ,సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి కల్ల అర్హులైన రైతులందరికి రైతు భరోసా అందచేస్తామని తెలిపారు. అదేవిధంగా అర్హత కలిగి ఉండి రైతు భరోసా రాని రైతులకు కూడా ఒక గుడ్ న్యూస్ చెప్పారు. రైతు భరోసా డబ్బులు రాని రైతులు తమ బ్యాంక్ పాస్ బుక్ మరియు సర్వే నెంబర్ వంటి వివరాలను కార్యాలయంలో ఇవ్వాలని తెలియజేశారు. కావున అర్హులైన రైతులందరు కూడా వీలైనంత త్వరగా వివరాలని సమర్పించాలని తెలియజేసారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ అంశంపై కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడడం జరిగింది. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లను కల్పిస్తామని దీనిని చట్టం చేయబోతున్నట్లుగా ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు. ఇక ఈ విషయాన్ని అసెంబ్లీ తీర్మానం తరువాత పార్లమెంటుకు పంపిస్తామని తెలియజేశారు.




## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం

నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం ఆ పనుల్లో ప్రమాదం చోటుచేసుకుంది. టన్నెల్ పైభాగంలో మూడు మీటర్ల మేర పడిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి టన్నెల్ ద్వారా వెనుకబడిన నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఆ పనుల్లో మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. ఆకస్మాతుగా పైకప్పు కూలి మట్టిపెల్లలు విరిగి పడ్డాయి. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 43 మంది బయటకి రాగా.. ఏడుగురు కార్మికులు లోపల చిక్కుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలి వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

**స్పందించిన సీఎం రేవంత్..** టన్నెల్‌లో పైకప్పు కూలి కార్మికులు గాయపడిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, నీటిపారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విషయం తెలుసుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ్ వెంట నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, అధికారులు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం ఎలా జరిగిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోపల చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకురావాలని.. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.




## రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ ఫోన్..

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా తీశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.




## నడిరోడ్డుపై దారుణం.. అందరూ చూస్తుండగానే తండ్రిని చంపిన తనయుడు

హైదరాబాద్: మేడ్చల్ జిల్లా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలు నడిరోడ్డుపై దారుణం చోటు చేసుకుంది. కన్న కొడుకే తండ్రిని కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం..సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి(45) ని అతని కుమారుడు సాయి కుమార్ (25) ఇద్దరూ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నారు. మొగిలి నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తుండటంతో సాయికుమార్ విసిగిపోయాడు. శనివారం మధ్యాహ్నం లాలాపేట నుంచి మొగిలి బస్సులో బయలుదేరగా.. అతని కుమారుడు ద్విచక్రవాహనంపై అనుసరించాడు.

ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద బస్సు దిగిన తండ్రిని.. తన వెంట తెచ్చుకున్న చాకుతో విచక్షణారహితగా 10..15 సార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడిన మొగిలిని స్థానికులు సమీపంలో ఉన్న శ్రీకర ఆసుపత్రికి తరలించగా చికత్స పొందుతూ మృతి చెందాడు. కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల కారణంగానే తండ్రిపై సాయికుమార్ దాడి చేసినట్టు పోలీసులు తెలిపారు.



## ఫిబ్రవరి 24 న.. నిర్మల్ కు సీఎం రేవంత్ రెడ్డి రాక

నిర్మల్ : ఉమ్మడి మెదక్ ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి కోరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని హోటల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 24న సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం నిర్మల్‌కు రానున్నట్లు తెలిపారు. సీఎం పాల్గొనే ఆత్మీయ సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి గ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వల్లే అభివృద్ధి కావట్లే..** నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అడ్డుకుంటున్నారని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు. అమృత్ 2 పథకం కింద తాగు నీటి కోసం రూ. 62 కోట్లు మంజూరయ్యాయని దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగానే పనులు ఇప్పటివరకు మొదలు కాలేదన్నారు. శని వారం అమృత్ 2 పథకం కోసం కొనుగోలు చేసి వృథాగా పడి ఉన్న పైపులను పలుచోట్ల ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు.

# నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి

## మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొననున్న రేవంత్





హైదరాబాద్: యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి పయనం కానున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు అయింది. రేపు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి వెళతారు. స్వర్ణగోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఈ మేరకు కుటుంబంతో వెళ్లే అవకాశం ఉంది. ఇక అటు... యాదగిరిగుట్టకు కేసీఆర్ కూడా వెళ్లనున్నారని సమాచారం అందుతోంది.

**కేసీఆర్‌కు కూడా ఆహ్వానపత్రిక...**యాదగిరిగుట్ట మహాకుంభాభిషేకం కార్యక్రమానికి తెలంగాణ మొట్ట మొదటి కేసీఆర్‌కు ఆహ్వానం అందింది.. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు కూడా రావాల్సిందిగా కేసీఆర్‌ను కలిసి ఆహ్వానించారు యాదగిరిగుట్ట ఆలయ పూజారులు, అధికారులు. ఈ నెల 23న ఆలయ స్వర్ణవిమాన గోపురానికి మహా కుంభాభిషేకం ఉండనుంది.. మార్చి 1 నుంచి 11 వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ తరుణంలోనే... యాదగిరిగుట్ట మహాకుంభాభిషేకం కార్యక్రమానికి తెలంగాణ మొట్ట మొదటి కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. అయితే కేసీఆర్ కట్టిన గుడికి ప్రతిపక్ష హోదాలో ఆయన వస్తారా లేదా అనేది చూడాలి. కాగా, సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు శుక్రవారం ఆలయ కార్యనిర్వాహక అధికారులతో కలిసి పూజారులు వెళ్లారు. కేసీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు కూడా రావాలని ఆయన్ను ఆహ్వానించారు. కాగా ఆదివారం యాదగిరిగుట్టలో ప్రత్యేక కార్యక్రమం దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంటల వరకు దర్శనాలను రద్దు చేశారు.



## త్వరలో సీఎం రేవంత్ ఎమ్మెల్సీ ప్రచారం

# 24న రెండు సభలకు పీసీసీ ప్లాన్

హైదరాబాద్ : కాంగ్రెస్ సిట్టింగ్ సీటైన కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీని తిరిగి తమ ఖాతాలో వేసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికను చాలెంజ్‌గా తీసుకున్నారు.

మూడు రోజులుగా నియోజకవర్గ పరిధిలోని 4 ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఇన్?చార్జ్ మంత్రు లు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ ముఖ్య నేతలతో జూమ్ మీటింగ్ నిర్వ హిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి.. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డితో పాటు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నుంచి గట్టిపోటీ ఎదురవుతున్నది. రెండు జాతీయ పార్టీలు రెడ్డిలకు టికెట్లు ఇవ్వడంతో.. బీఎస్పీ తరఫున బరిలో నిలిచిన హరికృష్ణకు బడుగు, బలహీన వర్గాల మద్దతు లభిస్తున్నట్లు సీఎం రేవంత్‌కు ఇంటెలిజెన్స్ రిపోర్టులు అందడంతో ఆయన ఈ ఎన్నికపై అప్రమత్తం అయ్యారు. అందుకే నేరుగా తానే ప్రచారంలో దిగాలనే నిర్ణయానికి సీఎం రేవంత్ వచ్చారు. ఈ నేపథ్యంలో 24 న రెండు సభలు నిర్వహించేలా పీసీసీ ప్లాన్ చేసింది. ఒకటి కరీంనగర్ లో ఏర్పాటు చేయనుండగా, రెండో సభ మెదక్ లేదా నిజామాబాద్ లో నిర్వహించే ఆలోచనలో పీసీసీ ఉన్నది. అయితే దీనిపై శనివారం సీఎం ఆఫీసు నుంచి క్లారిటీ రానున్నట్లు సమాచారం.

## టన్నెల్‌లో చిక్కుకున్న 8మందిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం: మంత్రి ఉత్తమ్



నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రమాద స్థలిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. "ఉదయం 8గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లారు. 8.30గంటలకు బోరింగ్ మిషన్ ఆన్ చేశారు. టన్నెల్‌లో ఒకవైపు నుంచి నీరు లీకై మట్టి కుంగి పెద్ద శబ్దం వచ్చింది. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారు. వెంటనే అప్రమత్తమై 42 మంది కార్మికులు బయటకు తీసుకొచ్చారు. బోరింగ్ మిషన్ ముందున్న 8మంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. 8మంది ప్రాణాలు కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగితే టన్నెల్‌లో వారిని రెస్క్యూ చేసిన ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడాం. టన్నెల్‌లో చిక్కుపోయిన వారు ఉత్తర్‌ప్రదేశ్, ఝార?ండ్ వాసులు. వారిలో ఒక ప్రాజెక్టు ఇంజినీరు, ఫీల్డ్ ఇంజినీరు, నలుగురు కార్మికులు, జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారికి వెంటిలేషన్ ఇబ్బంది లేదు. 14 కిలోమీటర్ల లోపల ఇరుక్కు పోవడంతో వారిని బయటకు తీసుకురావడం సవాల్‌గా మారింది. రెస్క్యూ బృందాలు ఈ రాత్రికి ఘటనా స్థలికి చేరుకుంటాయి" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## అపార్ట్‌మెంట్ లిఫ్టులో ఇరుక్కున్న బాలుడు.. చికిత్స పొందుతూ మృతి



నాంపల్లి: ప్రమాదవశాత్తు అపార్ట్‌వెంట్ లిఫ్టులో ఇరుక్కుపోయిన బాలుడు మృతి చెందాడు. శుక్రవారం అపార్ట్‌మెంట్ లిఫ్టుకి, గోడకి మధ్య ఇరుక్కుపోయి.. రెండున్నర గంటలపాటు నరకయాతన అనుభవించిన ఆరేళ్ల బాలుడిని బయటకు తీసి నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు కోల్పోయాడు. ఆగాపుర గోడేకిఖబర్ ప్రాంతానికి చెందిన అజయ్‌కుమార్ కుమారుడు అర్ణవ్(6).. శుక్రవారం మధ్యాహ్నం తాతతో కలిసి రెడ్‌హిల్స్ శాంతినగర్ పార్కు ఎదురుగా ఉన్న మఫర్ కంఫర్ట్ అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులో నివసిస్తున్న మేనత్త వద్దకు వెళ్లాడు. తాత చేతిలో లగేజీ ఉండటంతో బాలుడు చొరవ తీసుకుని లిఫ్ట్ గ్రిల్స్ తెరిచి ముందుగా లోపలికి వెళ్లాడు. తాత లగేజీ పెట్టేలోపే లిఫ్ట్ ఒక్కసారిగా పైకి వెళుతుండటంతో భయంతో బయటికి వచ్చేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఈ క్రమంలో లిఫ్టుకు, గోడకు మధ్యలో బాలుడు ఇరుక్కుపోగా..కదిలే వీల్లేని పరిస్థితుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌కు, మొదటి అంతస్తుకు మధ్య లిఫ్ట్ ఆగిపోయింది. అర్ణవ్ హాహాకారాలు, మనవడిని రక్షించండంటూ తాత వేసిన కేకలతో అపార్ట్‌మెంట్‌వాసులు అప్రమత్తమయ్యారు.

విద్యుత్ సరఫరాను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ హుటాహుటిన అక్కడికి చేరుకోవడంతోపాటు డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలను, 108 అంబులెన్స్‌ను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. తొలుత గ్యాస్‌కటర్‌తో లిఫ్ట్ గ్రిల్స్‌ను తొలగించే ప్రయత్నం చేసినా.. బాలుడి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చివరికి లిఫ్ట్ గోడలను బద్దలుకొట్టారు. దాదాపు 90 నిమిషాలు శ్రమించి అతికష్టమ్మీద బాలుడిని బయటికి తీశారు. నడుము, కడుపు భాగానికి తీవ్ర గాయాలై.. అపస్మారకస్థితికి చేరిన బాలుడికి 108 వైద్య బృందం ఆక్సిజన్ అందించి..అనంతరం నిలోఫర్ ఆసుపత్రికి తరలించింది. ఐసీయూలో చికిత్స పొందుతూ బాలుడు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బాలుడిని బతికించేందుకు తీవ్రంగా శ్రమించినట్లు వైద్య బృందం తెలిపింది. ఇవాళ మధ్యాహ్నం 12.30 గంటలకు బాలుడు మృతి చెందినట్లు వెల్లడించింది.

## ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం.. సీఎం రేవంత్‌రెడ్డిదే పూర్తి బాధ్యత: కేటీఆర్



హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గుత్తేదార్లతో కుమ్మక్కై, కమీషన్ల వేటలో పర్యవేక్షణ గాలికి వదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు.. వారి హయాంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై ఏమంటారని ప్రశ్నించారు. సుంకిశాల ప్రమాదంలో గుత్తేదారును కాపాడేందుకు వాస్తవాలు దాచి పెట్టిన ప్రభుత్వం.. కనీసం ఎస్ఎల్‌బీసీ ఘటనలో పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్





శ్రీ శైలం ఎడమ కాలువ గట్టు కెనాల్ టెన్నెల్ ప్రమాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన ట్వీట్ చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే స్పందించాలని..పనులు మొదలు పెట్టిన వెంటనే ప్రమాదం ఎలా జరిగిందో తేల్చాలని కవిత 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పై కప్పు కూలిన ఘటనలో కూలీలు గాయపడటం అత్యంత దురదృష్టకరమన్నారు. కేసీఆర్ హయాంలో 10 కి.మీ. మేర టన్నెల్ తవ్వారని..ఏనాడూ ఇటువంటి ప్రమాదం జరగలేదని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం 4 రోజుల కిందనే పనులు మొదలు పెట్టిందని..అంతలోనే ఈ పెను ప్రమాదం ఎలా జరిగిందని ప్రశ్నించారు. దీనికి ఎవరు బాధ్యులని? కవిత అడిగారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఈ ఘటనపై స్పందించాల్సిన అవసరముందని డిమాండ్ చేశారు. ఇంకా 9 కి.మీ.లకు పైగా టన్నెల్ తవ్వాల్సి ఉందని.. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు.

# రేవంత్ యాక్సిడెంటల్ సీఎం.. కేటీఆర్ షాకింగ్ కామెంట్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్.. అచ్చోసిన ఆంబోతు మాదిరి రంకెలు వేయటం మానుకోవాలన్నారు. తెలంగాణ ఆర్థిక స్థితిపై అసెంబ్లీలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. సభ సాక్షిగా నాలుగు కోట్ల ప్రజల ముందు సీఎం రేవంత్ బట్టలు విప్పుతామని హెచ్చరించారు. పాలన చేతకాని సన్యాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విరుచుకుపడ్డారు. సొంత రాష్ట్రాన్ని క్యాన్సర్‌తో పోల్చిన భావదారిద్ర్యపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటీశ్వరులైన మహిళలను మాత్రమే రేవంత్ ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ దివాలా తీసిందని.. గత 15 నెలలుగా కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి తెలంగాణ పరువును గంగలో కలుపుతున్నారన్నారు. కాళేశ్వరంపై కొంతమంది సన్యాసులు చెత్తవాగుడు బంద్ చేయాలని అన్నారు. తెలంగాణ ఆర్థికస్థితిపై ఫిబ్రవరి 17న డిప్యూటీ సీఎం భట్టి విడుదల చేసిన సమగ్రమైన నివేదికను రేవంత్ చదువుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలు చెప్పిన ఉప ముఖ్యమంత్రి భట్టికి ధన్యవాదాలు తెలియజేశారు. సంపద సృష్టించటంలో కేసీఆర్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందన్నారు. రేవంత్ రెడ్డి యాక్సిడెంటల్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేశారు. సిగ్గు.. మానం లేని మూర?పు ముఖ్యమంత్రి అని విమర్శించారు. కేసీఆర్‌ను దూషించటం మానుకోకుంటే రేవంత్ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. పాపం భట్టి విక్రమార్క అమాయకంగా ఇరుక్కున్నారని.. ఆయన ఉద్యోగం ఉంటదో.. పోతుందో? అని అనుమానం వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీ.. రేవంత్ 6వేల 500 కోట్లు అంటున్నారని.. భట్టి 2 వేల 200 కోట్లు అంటున్నారని తెలిపారు. ఢిల్లీ పార్టీలకు తెలంగాణను పరిపాలించుట చేదకాదని తేలిందన్నారు. కేంద్రం ఇచ్చే దానికంటే.. కేంద్రానికి పన్నుల రూపంలో తెలంగాణ ఇచ్చేది ఎక్కువ అని చెప్పుకొచ్చారు.

ఒక్క హామీ కూడా అమలు చేయకుండా.. అప్పులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రాతో రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. నీళ్ళు ఇచ్చుడు చేతకాకుంటే క్రాప్ హాలిడే ప్రకటించాలని మాజీమంత్రి డిమాండ్ చేశారు.

**బండిపై ఫైర్..** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కూడా కేటీఆర్ ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలబడుతున్నారన్నారు. రేవంత్, సంజయ్‌లు.. ఆర్ఎస్ బ్రదర్స్ అని మార్కెట్‌లో చెప్పుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్ అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బిల్డర్స్ దగ్గర స్క్వేర్ ఫీట్‌కు రేవంత్ రెడ్డి.. 150 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. రాహుల్, మోదీ కులంతో ప్రజలకు ఏంటి లాభం అని ప్రశ్నించారు. అమృత్ టెండర్లు, పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

సుంకిశాల ప్రాజెక్టు కుంగితే.. మేఘా కృష్ణారెడ్డిని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. కృష్ణజాలల దోపిడీ విషయంలో అసెంబ్లీలో ఎండగడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.




## గోల్డెన్ ప్యాలెస్, రూ.3వేల కోట్ల విలువైన నౌక.. కళ్లు చెదిరేలా ఖతర్ పాలకుడి సంపద

అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఖతర్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీకి విమానాశ్రయంలో ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికిన సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని ఉరుకులు పెట్టించేందుకు, వ్యూహాత్మక భాగస్వాములుగా ఎదిగే దిశగా మోదీ, తమీమ్‌ల మధ్య చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తూ సుమారు రూ. 2.43 లక్షల కోట్ల (28 బిలియన్ డాలర్ల)కు తీసుకువెళ్లాలని ఈసందర్భంగా రెండు దేశాలు లక్ష్యాన్ని విధించుకున్నాయి. సంపన్నదేశాల్లో ఒకటైన ఖతర్ పాలకుడికి కళ్లు చెదిరే ఆస్తిపాస్తులు ఉన్నాయని తెలుసా..? ఖతర్ దేశం ఏర్పడిన దగ్గరినుంచి అల్‌థానీ కుటుంబమే పాలిస్తోంది. ప్రస్తుతం వారి వంశంలో 11 మందికి అమీర్ (రూలర్)హోదా ఉంది. సహజవాయువు, చమురు నిల్వలతో విరాజిల్లుతోన్న ఈ పశ్చిమాసియా దేశం 2013 నుంచి షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీ పాలనలో ఉంది. ఇలాంటి దేశాన్ని పాలిస్తోన్న అల్‌థానీ వంశం ఆస్తుల విలువ 335 బిలియన్ డాలర్లు అని బ్లూమ్‌బర్గ్ లెక్కగట్టింది. షేక్ తమీమ్ వద్దే రెండు బిలియన్ డాలర్ల ఆస్తిపాస్తులున్నాయి. దేశ సహజవనరులే గాకుండా, విదేశాల్లో పెట్టుబడులు.. వీరిని ప్రపంచంలోనే సంపన్న కుటుంబాల్లో ఒకటిగా నిలిపాయి. ఒక బిలియన్ డాలర్ల విలువైన దోహా రాయల్ ప్యాలెస్‌లో ఈ కుటుంబం నివసిస్తోంది. పసిడి తాపడంతో కూడిన ఇంటీరియర్ ఉండటంతో దానిని గోల్డెన్ ప్యాలెస్ అని కూడా పిలుస్తారు. అందులో మొత్తం 15 భవంతులున్నాయి. 500 కార్లను నిలిపేంత పార్కింగ్ స్థలం ఉంది. ఒమన్‌లో వీరికి వైట్ ప్యాలెస్ ఉంది. ఈ కుటుంబానికి లండన్‌లో 17 బెడ్రూంలతో కూడిన విలాసవంతమైన భవనం ఉంది. పారిస్, న్యూయార్క్‌లోనూ మ్యాన్షన్‌లు ఉన్నాయి. ఇక 400 మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన ఓ నౌక ఉంది. ఈ కుటుంబం ఖతర్ అమీరి ఫ్లైట్ పేరిట విమానయాన సంస్థను నడుపుతోంది. దానిని 1977లో నెలకొల్పారు. అందులో రాయల్ ఫ్యామిలీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు మాత్రమే ప్రయాణిస్తుంటారు. మూడు బోయింగ్ విమానాలతో కలిపి మొత్తం 14 ఫ్లైట్స్ ఆ సంస్థ సొంతం. ఇక లగ్జరీ కార్లు బోలెడు. ఆ జాబితాలో బుగాటి, చిరాన్, లంబోర్గిని, రోల్స్ రాయిస్ తదితర సంస్థల కార్లు ఉన్నాయి. ఈ కుటుంబానికి కళలపై మక్కువ ఎక్కువే. అందుకే పెయింటిగ్స్ మీదే కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటుంది. ప్రముఖ పెయింటర్లు పాల్ సెజాన్, మార్క్ రొత్కో వేసిన కళాఖండాలను వందల మిలియన్ డాలర్లు వెచ్చించి సొంతం చేసుకున్నారు. ఖతర్ స్పోర్ట్స్ ఇన్వెస్ట్‌మెంట్ ను స్థాపించి, దాని ద్వారా పలు దేశాల్లో క్రీడా రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. పలు ఫ్రాంచైజీలను కొనుగోలు చేసుకున్నారు. అవి ముఖ్యంగా ఫుట్‌బాల్‌వే ఉన్నాయి. 2022లో ఫిఫా వరల్డ్ కప్‌కు ఈ దేశం ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ద్వారా వివిధ దేశాల్లోని సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ఇవన్నీ అమీర్ షేక్ తమీమ్ ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి.



## ఆ ఇద్దరు అడుగు పెట్టారంటే అక్కడ గెలవాల్సిందే

ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి మంచి ఊపు మీద ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఇతర ప్రాంతాల ఎన్నికల్లో కూడా తమ ప్రభావాన్ని చూపిస్తూ హవా కొనసాగిస్తున్నారు. బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను తమ భుజస్కందాలపై వేసుకొని వారిని విజయం వైపుగా నడిపించారు. దీంతో అటు సీఎం చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్‌లు గెలుపునకు మారు పేరుగా మారడంతో పాటుగా దేశ వ్యాప్త రాజకీయాలలో తమదైన శైలిలో పాగా వేశారు. విజయ ద్వయంగా హిస్టరీ క్రియేట్ చేశారు. సీఎం చంద్రబాబుకు దేశ రాజకీయాల్లో పవర్ సెంటర్‌గా మారడం కొత్తేమి కాకపోయినా.. పవన్ కల్యాణ్‌కు మాత్రం అరుదైన గుర్తింపే అని చెప్పొచ్చు. దీంతో ఏపీ కూటమి ప్రభుత్వ సారధుల పేర్లు దేశ వ్యాప్తంగా మారు మోగుతున్నాయి. తాజాగా శనివారం వెల్లడైన ఢిల్లీ ఎన్నికల ఫలితాలలో అత్యధిక స్థానాలను సాధించి బీజేపీ చరిత్రను సృష్టించింది. మొత్తం 70 స్థానాలు ఉన్న ఢిల్లీ అసెంబ్లీ నియోజక వర్గాల్లో 48 స్థానాలను సాధించి ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. అయితే ఈ విజయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి పాత్ర కూడా ఉంది. బాబు ప్రచారం చేసింది చాలా తక్కువ సమయమే అయినా తనదైన శైలిలో ప్రచారం సాగించారు. టెక్నాలజీ, ప్రపంచ దేశాల్లో భారత్ నాయకత్వం, మోదీ అనుసరిస్తున్న పాలనా మోడల్స్, కెజ్రీవాల్ ప్రభుత్వం స్కామ్‌లు, ఢిల్లీ పొల్యుషన్, డ్రైనేజీ, తాగు నీరు, లిక్కర్ స్కాం వంటి పలు అంశాలపైన ఆయన ప్రచారం చేశారు. తెలుగు ఓటర్లు అధికంగా ఉన్న షహదరా వంటి చోట్ల తెలుగు ప్రజలతో మమేకమయ్యారు. సమస్యలు తీరుస్తామని హామీలిచ్చారు. అక్కడ ప్రజలు చంద్రబాబును బాగానే రిసీవ్ చేసుకున్నారు. ప్రచారం ఫలించింది. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందారు.ఇక్కడ బీజేపీకి అంత ప్రాధాన్యత లేదు. కెజ్రీవాల్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు చంద్రబాబు ప్రచారం తోడు కావడంతో బీజేపీకి పట్టం కట్టారు. 32 ఏళ్ల తర్వాత ఇక్కడ బీజేపీ గెలిచింది. చంద్రబాబు ప్రచారం ఢిల్లీలోని 70 అసెంబీ నియోజక వర్గాల్లోని తెలుగు ప్రజలను ప్రభావితం చేసింది. ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకునేందుకు ఇది కూడా ఉపయోగపడింది.గతంలో దేశ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగి.. కేంద్ర ప్రభుత్వాలను నిలబెట్టడంతో కీలక పాత్ర పోషించిన చంద్రబాబుకు ఈ సారి అదే స్థాయిలో మరో సారి ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం నడవడానికి చంద్రబాబే కీలకంగా మారడంతో మరో సారి దేశ వ్యాప్తంగా చంద్రబాబు ఫేమస్ అయ్యారు.సీట్ల సర్దుబాట్లలో తన స్థాయిని తగ్గించుకొని, ఏపీలో కూటమి అధికారంలోకి రావడానికి కీ రోల్ పోషించిన జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక్క సారిగా దేశ రాజకీయాల్లో కీలకంగా మారి పోయారు. తనకు కేటాయించిన 21 సీట్లల్లో గెలిచి 100 శాతం స్ట్రైక్ రేటును సాధించి దేశ రాజకీయాలను తన వైపునకు తిప్పుకున్నారు.ఉప ముఖ్యమంత్రి అయ్యాక సనాతన ధర్మం, తిరుపతి తిరుమల లడ్డూ అంశాల్లో ఆయన తీసుకున్న స్టాండ్ ఒక్క సారిగా దేశ రాజకీయాల్లో హీరోగా నిలబెట్టాయి. పవన్ కల్యాణ్ శక్తి, సామర్థ్యాలను గుర్తించిన మోదీ, అమిత్‌షాలు ఆయనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. మరో సారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి వెన్నెముకగా నిలిచిన చంద్రబాబును, ఏపీలో కూటమి నిలబడటానికి విశేష కృషి చేసిన పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారం కోసం మహారాష్ట్రకు వెళ్లినా.. సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతి చెందడంతో అర్థాంతరంగా చంద్రబాబు వెనక్కి వచ్చేశారు. దీంతో మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం బాధ్యతంతా పవన్ కల్యాణ్ భుజస్కందాలపై పడింది.ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం బాధ్యతను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పవన్ కల్యాణ్ మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఏపీలో తన పార్టీకి కేటాయించిన 21 సీట్లను కైవసం చేసుకున్న విధంగానే మహారాష్ట్రలో కూడా సీన్ రిపీట్ చేశారు. బల్లాపూర్, చంద్రాపూర్, పూణెకంటోన్మెంట్, హడ్సర్‌పూర్, కస్బాపేట్, డెగ్లూర్, లాతూర్, షోలాపూర్ వంటి నియోజక వర్గాల్లో ప్రచారం చేసి మహాయుతి అభ్యర్థులను గెలిపించి, మహారాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ఏర్పాటు కావడంలో కీలక భూమిక పోషించారు. ఇది అప్పట్లో ఓ సంచలనంగా మారింది.దీంతో ఏపీ కూటమి ప్రభుత్వ రథ సారథులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ద్వయం దేశ రాజకీయాల్లో స్టార్ క్యాంపెయినర్‌లుగా మారారు. విజయానికి కేరాఫ్‌గా మారి సెంటర్ ఆఫ్ ద అట్రాక్షన్‌గా నిలిచారు. విజయవాల పరంపర కొనసాగిస్తూ వీరద్దరి ద్వయం దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారనే టాక్ ఆ పార్టీ వర్గాల్లో సాగుతోంది.

## భారత్ - పాక్... ఆదివారం మ్యాచ్ కు ముందు తెరపైకి ఆసక్తికర విషయం!




భారత్ %-% పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే ఆ సందడి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు! మైదానంలో ఆ 22 మంది మధ్య జరిగే పోరు ఒకెత్తు అయితే.. మైదానం వెలుపల, టీవీల ముంగిట కోట్ల మంది ప్రేక్షకుల మధ్య ఉత్కంఠ మరొకెత్తు అని అంటారు. ఈ సమయంలో ఆదివారం (ఫిబ్రవరి 23) న మరోసారి భారత్ %-% పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ సమయంలో ఓ ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. 1992 వరల్డ్ కప్ నుంచి 2010 వరకూ ఈ ఇరు దేశాల మధ్య జరిగిన ఫేమస్ వివాదాలపై చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో... నాడు జావెద్ మియాందాద్ - కిరణ్ మోరె మధ్య మొదలైన వివాదం నుంచి ఇటీవల అక్తర్ కు హర్భజన్ సింగ్ కు మధ్య జరిగిన రచ్చ వరకూ జరిగిన విషయాలు ఒకసారి గుర్తుచేసుకుందాం..! అవును... భారత్ %-% పాక్ మధ్య మ్యాచ్ అంటే ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య కంటికి కనిపించని ఫైర్ ఒకటి రగులుతూ ఉంటుందని చెబుతుంటారు. ఈ క్రమంలో దాన్ని కొంతమంది బయటకు చూపిస్తే.. మరికొంతమంది లోలోపల ఉంచుతుంటారు. ఈ సమయంలో బయటకు చూపించేవారి అగ్రెసివ్‌నెస్ నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారుతుంటుంది. ఆ జాబితాలో కొన్ని ఇప్పుడు చూద్దాం..! 1992లో భారత్ %-% పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ లో వికెట్ల వెనుక టీమిండియా కీపర్ కిరణ్ మోరె మాట్లాడుతుంటే.. అందుకు జావెద్ మియాందాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కిరణ్ తో జావెద్ ఏదో వ్యాఖ్యలు చేశాడు. ఆ తర్వాత కిరణ్ ను అనుసరిస్తూ జావెద్ కంగారుల మాదిరి ప్రవర్తించాడు. ఈ తీరు నాటి భారత కెప్టెన్ అజారుద్దీన్ కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది.

**1996 వన్డే వరల్డ్ కప్.. వెంకటేష్ ప్రసాద్ రివేంజ్!:** వన్డే వరల్డ్ కప్ - 1996లో భారత్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ బౌలింగ్ లో పాకిస్థాన్ బ్యాట్స్ మెన్ అమీర్ సోహైల్ బౌండరీ కొట్టాడు. అనంతరం తాను కొట్టిన బంతి వెళ్లిన ప్రదేశం వైపు చూపిస్తూ బౌలర్ ను ఎగతాళి చేశాడు. దీంతో.. మాటలతో వద్దు చేతలతోనే అనుకున్నాడో ఏమో.. వెంకటేష్ ప్రసాద్ తన నెక్స్ట్ బంతికే అమీర్ సోహైల్ ను ఔట్ చేశాడు. ఈ అద్భుతమైన సెండ్ ఆఫ్ తో ఆటతీరు భారత్ వైపు మార్చబడింది.

**1997లో ఓ మ్యాచ్... ఇంజమామ్ పై "ఆలూ" కామెంట్స్!..** 1997లో జరిగిన ఓ మ్యాచ్ లో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తుండగా ఓ క్రికెట్ ఫ్యాన్ "ఆలూ" (బంగాళాదుంప) అని గట్టిగా అరిచాడు. ఇంజమామ్ లావుగా ఉండటం వల్ల అతడు వెటకారం ఆడినట్లున్నాడు. దీంతో వెంటనే డ్రెస్సింగ్ రూమ్ వైపు చూసి, బ్యాట్ ను తెప్పించిన ఇంజమామ్.. ప్రేక్షకుల దిశగా చూసి 'ఇప్పుడు అనండి' అంటూ బ్యాట్ చూపించాడు. దీంతో.. స్టేడియంలో ఒక్కసారిగా గోల గోలగా మారిపోయింది. ఈ సమయంలో ఎంట్రీ ఇచ్చిన సెక్యూరిటీ సిబ్బంది.. పరిస్థితిని చక్కదిద్దారు. మరోపక్క ప్రవర్తనపైనా ఇంజిమామ్ ను ఐసీసీ మందలించింది.

**2007 మ్యాచ్... గంభీర్ వర్సెస్ అఫ్రిదీ.. వేరే లెవెల్!...** అఫ్రిద్ బౌలింగ్ లో 2007లో జరిగిన మ్యాచ్ లో గంభీర్ బౌండరీ కొట్టాడు. దీంతో.. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఉద్దేశ్యపూర్వకంగానే అన్నట్లుగా వికెట్ల మధ్య పరుగెడుతున్నప్పుడు వారు ఢీకొనడం పరిస్థితిని మరింత వేడెక్కించింది. ఇద్దరూ వెనక్కి తగ్గడం లేదు.. గంభీర్ అస్సలు తగ్గడం లేదు! దీంతో.. ఫీల్డ్ అంపైర్ కలగజేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు. ప్రస్తుతం వీరిద్దరూ ఆటకు వీడ్కోలు పలికినప్పటికీ.. ఇప్పటికీ సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వీడియోలు, చర్చలు వైరల్ గా మారుతుంటాయి.

**2010 ఆసియా కప్... హర్భజన్ వర్సెస్ అక్తర్.. ఇది పీక్స్!...** ఇండియా - పాకిస్థాన్ మధ్య మైదానంలో జరిగిన వివాదాల్లో గంభీర్ - అఫ్రీది మధ్య వివాదం ఒకెత్తు అయితే... హర్భజన్ సింగ్ - షోయబ్ అక్తర్ మధ్య వివాదం పీక్స్ అనే చెప్పాలి. 2010 ఆసియాకప్ లో భజ్జీ బ్యాటింగ్ చేస్తుండగా.. అక్తర్ డాట్ బాల్స్ వేసి కట్టడి చేస్తూ.. స్లెడ్జింగ్ చేయడం మొదలుపెట్టాడు. ఓ పక్క బంతులు పూర్తైపోతున్నాయి.. టీమిండియా వైపు టెన్షన్ పెరిగిపోతుంది. ఈ సమయంలో అక్తర్ పై ముందు నోటితో ఆగ్రహం వ్యక్తం చేసిన హర్భజన్ సింగ్... చివరి ఓవర్ లో ఆమిర్ వేసిన బంతిని సిక్స్ గా మలిచి భారత్ ను గెలిపించాడు. అనంతరం అక్తర్ వద్దకు వెళ్లి సంబరాలు చేసుకోవడం మొదలుపెట్టాడు. అది ఇప్పటికీ దాయాదీ క్రికెట్ చరిత్రలో ఆసక్తికర ఎపిసోడ్ గా నిలబడింది!

**2025 ఛాంపియన్స్ ట్రోఫీ!:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ లో భారత్ విజయంతో బోణీ కొట్టగా.. పాకిస్థాన్ పరాజయంతో ప్రారంభించింది. ఇందులో భాగంగా... బంగ్లాదేశ్ పై భారత్ సునాయాస విజయాన్ని నమోదు చేయగా.. డిఫెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగిన పాక్ కు కివీస్ చేతిలో పరాభవం ఎదురైంది. ఈ రెండు జట్లు ఆదివారం తలపడనున్నాయి. దీంతో.. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ ప్రపంచం మొత్తం అత్యంత ఆసక్తితో ఎదురుచూస్తోంది. మరి ఈ మ్యాచ్ వీలైనంత సాఫీగానే సాగిపోతుందా.. లేక, ఏవైనా రసవత్తరమైన ఘట్టాలు చోటు చేసుకుంటాయా అనేది వేచి చూడాలి!

## మమతా దీదీ మీదకు పవనాస్త్రం ?

పశ్చ బెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి అయిన మమతా బెనర్జీ ని మాజీ సీఎం చేయాలన్నది బీజేపీ పట్టుదల. ఆమె వరసగా మూడుసార్లు పశ్చిమ బెంగాల్ నుంచి సీఎం అయ్యారు. 2011లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన ఆమె ఆ తర్వాత 2016లో రెండోసారి గెలిచారు. 2021లో మరోసారి విజయఢంకా మోగించారు. అయితే నాలుగవ సారి కూడా తానే సీఎం అని ఆమె ధీమాగా ఉన్నారు. కానీ ఈసారి బెంగాల్ గద్దె మీద బీజేపీ జెండా ఎగిరి తీరుతుందని కాషాయదళం గట్టి విశ్వాసంతో ఉంది. మమతా బెనర్జీ పట్ల జనాదరణ బాగా తగ్గిందని పదిహేనేళ్ళ పాలన తరువాత ఎటూ యాంటీ ఇంకెంబెన్సీ ఉంటుందని బీజేపీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నారు. మరో వైపు చూస్తే బీజేపీకి ఎన్డీయే మిత్రులు అన్ని విధాలుగా ఎన్నికల వేళ అంది వస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దూసుకునిపోయారు. ఫలితంగా గతంలో ఎన్నడూ గెలవని సీట్లలో బీజేపీ విజయ దుందుభి మోగించింది దాంతో పవన్ క్రేజ్ కి బీజేపీ పెద్దలు తెగ మోజు పెంచుకున్నారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో ప్రచారం చేసి పెట్టారు. బాబు సభలకు జనాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అంతే కాదు చంద్రబాబు ప్రచారం చేసిన చోటల్లా బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో నెగ్గారు ఆ విధంగా బాబుకు



ఎన్డీయేలో మరింత ప్రాధాన్యత పెరిగింది. ఇపుడు చూస్తే పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఉన్నాయి. 2026 మేలో జరిగే ఈ ఎన్నికలు బీజేపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని బీజేపీ పట్టు మీద ఉంది. దానితో జనసేన అధినేత పవన్ ని బెంగాల్ ఎన్నికల ప్రచారంలో పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటారు అన్న చర్చ నడుస్తోంది. దానికి కారణం ఏంటి అంటే తాజాగా పవన్ కళ్యాణ్ మహా కుంభ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మమతా బెనర్జీ మీద పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహా కుంభ మేళాను మృత్యు కుంభ్ గా ఆమె పేర్కొనడం పట్ల పవన్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఒక మతం మీదనే ఇలా విమర్శలు చేయగలుగుతారంటూ ఆయన చేసిన కామెంట్స్ దీదీ శిబిరంలో కొత్త చర్చను రేపాయి. దీంతో పవన్ నేరుగా మమతాను టార్గెట్ చేసినట్లు అయింది. ఈ కొత్త రాజకీయ పరిణాంతో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో పవన్ ఎన్నికల ప్రచారం చేస్తారని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. బీజేపీకి మద్దతుగా పవన్ ఇప్పటికే ప్రచారం చేసి ఉన్నారు. కాబట్టి బెంగాల్ విషయంలో కూడా ఆయన సిద్ధంగా ఉంటారని అంటున్నారు. ఇక వెండి తెర పవర్ స్టార్ గా అదే విధంగా ఇటీవల కాలంలో హిందూత్వ నినాదాన్ని బలంగా వినిపిస్తున్న నాయకుడిగా పవన్ ఇమేజ్ జాతీయ స్థాయిలో గట్టిగానే ఉంది. దాంతో పాటు బెంగాల్ లోనూ పవన్ పట్ల క్రేజ్ ఉంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని బీజేపీ మమత మీద పవనాస్త్రాన్ని ఉపయోగిస్తుందని అంటున్నారు. అదే కనుక జరిగితే మాతం బెంగాల్ ఎన్నికల ప్రచారం హోరెత్తడం ఖాయమని అంటున్నారు.

## ఎఫ్.బీ.ఐ చీఫ్ కు బాలీవుడ్ స్టైల్లో విషెస్...
## నెట్టింట మామూలు రచ్చ కాదు!

అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్.బీ.ఐ) డైరెక్టర్ గా భారతీయ అమెరికన్ కాష్ పటేల్ నియామకాన్ని సెనెట్ 51-49 ఓట్లతో ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. అధ్యక్షుడు ట్రంప్ సహాయకుడు, వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ స్కావినో.. కాష్ పటేల్ కు బాలీవుడ్ స్టైల్ లో పలికిన స్వాగతం ఇప్పుడు వైరల్ గా మారింది. అవును... ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చీఫ్ గా ఎంపికైన కశ్యప్ పటేల్ కు వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ప్రెసిడెంట్ ట్రంప్ అసిస్టెంట్ అయిన డాన్ స్కావినో బాలీవుడ్ స్టైల్లో విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా... "ఎఫ్.బి.ఐ. కొత్త డైరెక్టర్ కాష్ పటేల్ కు అభినందనలు" అని పేర్కొంటూ.. 'బాజీరావ్ మస్తానీ' సినిమాలోని మల్హారీ సాంగ్ ను పోస్ట్ చేశారు. ఈ సాంగ్ లోని రణవీర్ సింగ్ ముఖాన్ని కాష్ పటేల్ తో మాషప్ చేయడంతో నెట్టింట వైరల్ గా మారింది. 47 సెకన్ల



నిడివి గల ఈ వీడియోను ఇప్పటివరకూ సుమారు 5.3 మిలియన్స్ వ్యూస్ రాగా... 134కే లైక్స్ వచ్చాయి. కామెంట్ సెక్షన్ లో నెటిజన్లు గరిష్టంగా కాష్ పటేల్ ను అభినందిస్తూ.. ఈ వీడియో ఆలోచనపైనా ప్రశంసలు కురిపిస్తున్నారు. మరోపక్క ఎఫ్.బీ.ఐ. తొమ్మిదో డైరెక్టర్ గా తనను నియమించడంపై కాష్ పటేల్ స్పందించారు. ఈ నియామకం తనకెంతో గౌరవంగా ఉందని చెబుతూ.. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా.. ఎంతో ఘన చరిత్ర ఉన్న బ్యూరో.. దేశ ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీగా ఉండేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ఇదే సమయంలో... అమెరికన్లకు ఎవరైనా హాని చేయాలని చూస్తే.. వారి అంతు చూస్తానని రాసుకొచ్చారు. మరోపక్క.. ఎఫ్.బీ.ఐ. డైరెక్టర్ గా కాష్ పటేల్ ఎంపిక కావడంతో.. ఈ పదవిని చేపట్టిన తొలి హిందూ, భారతీయ అమెరికన్ గా ఆయన రికార్డ్ సృష్టించారు!

# చురకలు

## సంపాదకీయం

### ఢిల్లీ బీజేపీలో అధికార 'పర్వేషాన్'..? మరో ఏక్ నాథ్ శిందే అవుతారా?

లేక లేక 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ అధికార పీఠం దక్కినా.. దాదాపు రెండు వారాల తర్వాత కాని సీఎం ఎవరో తేల్చేలేకపోయింది బీజేపీ. వరుసగా మూడోసారి దేశాన్ని ఏలుతున్న పార్టీ.. మోదీ వంటి నాయకుడు ఉన్న పార్టీ.. దేశ రాజధానిలో గెలిచి కూడా ఇలాంటి పరిస్థితి ఎదుర్కొనడం కొంత ఆశ్చర్యమే.. ఢిల్లీలో ఉన్నది 70 నియోజకవర్గాలే అయినా, సీఎం పదవి కోసం పోటీ తక్కువేం లేదని తెలుస్తోంది. అందుకే ఎవరికీ కాకుండా అనూహ్యంగా కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది బీజేపీ నాయకత్వం. పర్వేష్ వర్మ.. ఢిల్లీ మాజీ సీఎం సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు. సాహెబ్ సింగ్.. ఢిల్లీలో బీజేపీని పటిష్ఠం చేసిన నాయకుల్లో ఒకరు. ఇక పర్వేష్ మాజీ సీఎం కేజ్రీవాల్ ను ఓడించిన నాయకుడు. ఫలితాలు వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి పదవి ఈయనకే దక్కుతుందని మీడియాలో ఒకటే హడావుడి. కానీ, చివరికి రేఖా గుప్తా సీఎం అయ్యారు. దీంతో పర్వేష్ వర్మ, ఆయన మద్దతుదారులు చాలా అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన.. మరో ఏక్‌నాథ్ శిందే కావొచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ అసెంబ్లీలో బీజేపీకి 48, ఆప్ నకు 22 స్థానాలు దక్కాయి. కనీస మెజారిటీ 36. దీంతో పర్వేష్ వర్గం ఆప్ తో కలిస్తే ప్రభుత్వం పడిపోతుందనే ఊహాగానాలు వస్తున్నాయి. మహారాష్ట్రలో 2022లో ఏక్ నాథ్ శిందే శివసేనను చీల్చి బీజేపీ మద్దతుతో సీఎం అయిన సంగతి తెలిసిందే. ఇటీవలి ఎన్నికల్లో మాత్రం బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించింది. ఎంతో తర్జనభర్జన తర్వాత దేవేంద్ర ఫడణవీస్ కు ముఖ్యమంత్రి పదవి దక్కింది. మొదట్లో మొండికేసాని శిందే మెత్తబడి డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. ఢిల్లీలో పర్వేష్ వర్మ కూడా ఇలానే సీఎం పదవి కోసం తీవ్రంగా ప్రయత్నించి వెనక్కుతగ్గారు. ఆయనకు మేనిఫెస్టో హామీలు నెరవేర్చే మంత్రిత్వ శాఖను అప్పగించారు. బీజేపీ వర్గాలు మాత్రం పర్వేష్ వర్మ.. శిందేలా చేయరని అంటున్నాయి. ఆయన క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అని.. అధిష్ఠానం చెప్పినట్లుగానే నడుచుకుంటారని చెబుతున్నాయి. రేఖా గుప్తా కంటే 47 ఏళ్ల పర్వేష్ చిన్నవారేనని.. ఆయనకు మంచి భవిష్యత్ ఉందని పేర్కొంటున్నాయి.

## భారత మాయాజాల ప్రపంచపు అగ్రశిఖరం...ప్రోతుల్ చంద్ర సర్కార్ - ఫిబ్రవరి 23.. పి.సి. సర్కార్ జయంతి




పి.సి. సర్కార్ భారత దేశపు అత్యంత ప్రఖ్యాత ఇంద్రజాలికుడు. 20వ శతాబ్దంలో "ఇండియన్ హౌడిని" గా పేరుగాంచిన ఆయన, భారతీయ ఇంద్రజాల కళను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కళాకారుడు. అతని వినూత్నమైన ప్రదర్శనలు, అత్యద్భుతమైన మాయా కౌశల్యాలు, భారతీయ సంప్రదాయాన్ని ఇంద్రజాలలో కలిపిన విధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ప్రోతుల్ చంద్ర సర్కార్ 23 ఫిబ్రవరి 1913న ఆసిక్‌పూర్, తాంగాయిల్ జిల్లా, బ్రిటీష్ ఇండియా (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో జన్మించారు. ఆయన తండ్రి కూడా ఒక ఇంద్రజాల కళాకారుడు. చిన్నతనం లోనే ఇంద్రజాల కళపై ఆసక్తిని పెంపొందించుకున్నాడు. పి.సి. సర్కార్ తన మాయా ప్రదర్శనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నాడు. ఆయన భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి, హైప్‌నోటిక్ మంత్రాలతో ప్రేక్షకులను ఆశ్చర్య పరిచేవాడు. ఆయన "సా-రే-గా-మా" మాయా ట్రిక్ %-% ప్రపంచ ప్రసిద్ధమైన మాయాజాల ప్రదర్శనలలో ఒకటి."ఎగిరే కత్తి" ప్రదర్శన గాల్లో తేలే కత్తి విన్యాసం."ఇంద్రజాల దర్పణం" ఆయనే ఓ సజీవ కడగండ్లుగా మారినట్టు ప్రదర్శించేవాడు."జిగ్‌సా మానవుడు" శరీరాన్ని ముక్కలుగా విభజించినట్టు చూపించే మాయాజాలం."గోల్డెన్ ఫిష్ ట్రిక్" ఖాళీ పాత్రలో నీటిని బంగారు చేపలుగా మారుస్తాడు. ఆయన యూరోప్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వంటి అనేక దేశాలలో ప్రదర్శనలు ఇచ్చాడు.1950లలో లండన్ మరియు టోక్యోలో అతని ప్రదర్శనలు విశేష ప్రజాదరణ పొందాయి.1956లో "ది గ్రేట్ ఇండియన్ ఇల్యూజనిస్ట్" అనే బిరుదును పొందాడు. 1964లో పద్మశ్రీ పురస్కారం %-% భారత ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందజేసింది. ఇంద్రజాలంపై అనేక పుస్తకాలను రచించాడు. ఆయన కుమారుడు కూడా ప్రఖ్యాత ఇంద్రజాలికుడు. భారతీయ ఇంద్రజాల కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత సాధించాడు. భారతీయ సంప్రదాయాలను మాయాజాలంతో మిళితం చేసి "ఇండియన్ స్టైల్ ఇల్యూజన్" అనే ప్రత్యేక శైలిని అందించాడు. భారతదేశంలో ఇంద్రజాల కళ ప్రాచుర్యం పొందేలా చేశాడు. 6 జనవరి 1971, హొక్కైడో, జపాన్ లో మరణించాడు. ఆయన కుమారుడు పి.సి. సర్కార్ (జూనియర్) తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆధునిక ఇంద్రజాల కళకు కొత్త పుంతలు తొక్కుతున్నాడు. భారతదేశంలో ఇప్పటికీ పి.సి. సర్కార్ పేరు గౌరవప్రదంగా చెప్పబడుతోంది. పి.సి. సర్కార్ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప మాయాజాల కళాకారుడు. ఆయన మాయాజాలం కేవలం వినోదం మాత్రమే కాదుబీ అది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసిన గొప్ప సాధనం. ఆయన ప్రదర్శనలు, ట్రిక్స్, పుస్తకాలు ఇంద్రజాల కళను ప్రేమించే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. "ఇంద్రజాలం ఒక కళ మాత్రమే కాదు అది మానసిక మేధస్సును విప్పి చూపే అద్భుత ప్రపంచం!" పి.సి. సర్కార్

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

## పద కవితా పితామహుడు అన్నమాచార్యుడు - ఫిబ్రవరి 23... అన్నమాచార్య వర్ధంతి




దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు, తెలుగు సాహితీ చరిత్రలో ప్రథమ వాగ్గేయ కారుడు అన్నమాచార్యుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెద, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆకుకలిగా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతనే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదికులుగా అయినందున, నంద వైదికులుగా ప్రచారం పొందినారు, అన్నమయ్య అదే కోవకు చెందిన వార్తై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉండగా, నారాయణ సూరి - లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సరం వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి.

శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు.

సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిప్లుతం. తెలుగు లోనే రాసిన పాడిన ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగార సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వాఙ్మయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు. **రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


## ఇంద్రజాలం కేవలం మాయా వినోదం మాత్రమే కాదు, ఒక విజ్ఞానపూరిత కళ - ఫిబ్రవరి 23...ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం అనేది ఇంద్రజాల కళను, ఇంద్రజాలికులను గౌరవించే ఒక ప్రత్యేకమైన రోజు. ప్రొతుల్ చంద్ర సర్కార్ గొప్ప భారతీయ ఇంద్రజాలికుడు. ఆయన పుట్టిన దినమైన ఫిబ్రవరి 23ను ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ రోజున, ప్రపంచవ్యాప్తంగా ఇంద్రజాలికులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రజలను ఆశ్చర్య పరచడంతో పాటు, ఈ కళకు మరింత ప్రజాదరణ పెంచేలా చేస్తారు. ఇంద్రజాలం అనేది కేవలం మాయా వినోదం మాత్రమే కాకుండా, ఒక విజ్ఞానపూరిత కళ. ఇది ప్రేక్షకుల్లో ఉత్సాహం, ఊహాశక్తి, విచిత్రమైన అనుభూతిని కలిగించే గొప్ప కళారూపం. ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం యొక్క ఖచ్చితమైన మూలాలు స్పష్టంగా తెలియకపోయినా, ఈ వేడుక 20వ శతాబ్దం మధ్యలో ప్రారంభమైనట్లు భావిస్తున్నారు. ఇంద్రజాల కళ యొక్క ప్రాముఖ్యత ఇంద్రజాల కళను ప్రోత్సహించడం. ఇంద్రజాలం అనేది అనాదిగా కొనసాగుతున్న ఒక పురాతన కళ. ఇది ప్రపంచ వ్యాప్తంగా అన్ని సంస్కృతులలో ప్రాచుర్యం పొందింది. ఈ దినోత్సవం ద్వారా ఈ కళను భవిష్యత్ తరాలకు అందించేందుకు అవకాశాలు కలుగుతాయి. ఇంద్రజాలికులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి అనేక సంవత్సరాలు శ్రమిస్తారు. వారు ప్రజలకు వినోదాన్ని అందించడానికి, ఆశ్చర్యపరిచే ప్రదర్శనలను రూపొందించడానికి నిరంతరం కృషి చేస్తారు. ఈ దినోత్సవం వారి కృషికి గౌరవం అర్పించే



ఒక గొప్ప అవకాశం. ఇంద్రజాల ప్రదర్శనలు ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని, మేజిక్‌పై మక్కువను పెంచుతాయి. ప్రత్యేకించి, పిల్లలకు ఇంద్రజాల ప్రదర్శనలు ఒక అద్భుత అనుభూతిని కలిగిస్తాయి. ఈ దినోత్సవం ఇంద్రజాల ప్రపంచాన్ని అనుభవించేందుకు ప్రజలకు ఒక అద్భుతమైన అవకాశం. ఇంద్రజాల కళ వేద కాలం నుండి మనకు తెలిసిన ఒక పురాతన కళ. ఇది ఈజిప్ట్, గ్రీకు, రోమన్, భారతీయ సంస్కృతులలో అనాదిగా ప్రాచుర్యంలో ఉంది. పురాతన గ్రంథాల్లోనూ ఇంద్రజాల ప్రదర్శనల గురించి వివరణలు ఉన్నాయి. యూరప్‌లో ఇంద్రజాలాన్ని కొంతకాలం మాంత్రిక విద్యగా భావించి నిషేధించగా, కొంతకాలానికి దీనిని వినోద కళగా గుర్తించారు. 19వ శతాబ్దంలో ఇంద్రజాల కళకు కొత్త ఊపొచ్చింది. హ్యారీ హుడిని, జీన్ యూజీన్ రాబర్ట్ హౌడిన్, హొఫ్మాన్, డేవిడ్ కాపర్‌ఫీల్డ్, పెన్ %ఽ% టెలర్ వంటి ప్రముఖ ఇంద్రజాలికులు ఈ కళను ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందేలా చేశారు. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇంద్రజాలికులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రత్యేకమైన ప్రదర్శనలు నిర్వహిస్తారు. విభిన్న దేశాల్లో ప్రముఖ ఇంద్రజాలికులు పాల్గొని ఇంద్రజాల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు. ఇంద్రజాల కళను నేర్చుకోవాలనుకునే వారికి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇంద్రజాలికులు ఒకచోట చేరి తమ అనుభవాలను పంచుకుంటారు. కొత్త కొత్త ట్రిక్స్ పై చర్చలు జరుపుతారు. ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం అనేది ఈ అద్భుత కళను గౌరవించేందుకు, ఇంద్రజాలికుల కృషిని గుర్తించేందుకు, ప్రజలను మంత్రముగ్ధులను చేసేందుకు జరుపుకునే ఒక విశేషమైన రోజు. మాయా కళలో నిజమైన విజ్ఞానాన్ని, వినోదాన్ని కలిపి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే ఇంద్రజాలికులకు ఈ రోజు ఒక గొప్ప గౌరవ సూచకం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాల మిస్ట్...9440595494**

## ప్రాణాంతకం జలభీతి వ్యాధి




ర్యాబీస్ అనేది ఒక వైరస్ వల్ల సంభవించే ఒక వ్యాధి, ఇది వ్యాధి సోకిన జంతువు యొక్క లాలాజలం ద్వారా వ్యాపి స్తుంది. ర్యాబీస్ వ్యాధిని వ్యాపింపజేయు అనేక వాహకాలు ఉన్నాయి - ఎక్కువగా కుక్కలు మరియు గబ్బిలా లు. వైరస్ ఒక కాటు ద్వారా లేదా వ్యాధి సోకిన జంతువు యొక్క లాలాజలం ఒక గాయం కలిగిన చోట తాకినా సంక్రమించ వచ్చు. ఒకసారి సంక్రమించి నప్పుడు, వైరస్ శరీరంలో ప్రవేశిస్తుంది మరియు నాడీ వ్యవస్థపై దాడి చేసి కోమాకు దారి తీస్తుంది మరియు సరియైన చికిత్స చేయకపోతే చివరకు మరణానికి దారి తీస్తుంది. ర్యాబీస్‌ులో రెండు రకాల ఉన్నాయి %-% అధిక కోపం మరియు పక్షవాతం. ర్యాబీస్ యొక్క ప్రధాన లక్షణాలు కాంతి కి తట్టుకోలేక పోవడం, నొప్పి, కండరాల స్పందనలు, చొంగ కార్చడం (అధిక - లాలాజలం, నీటిని చూసి భయపడటం. వ్యాధి యొక్క తదుపరి దశలలో, పక్షవాతం, కోమా సాధారణంగా సంభవిస్తాయి. ప్రపంచంలోని అనేక దేశాలలో రాబిస్ ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మిగిలి పోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 18 నిర్లక్ష్యం చేసిన ఉష్ణమండల వ్యాధులలో ఇది ఒకటిగా జాబితా చేయబడింది. రాబిస్ దాదాపు ఎల్లప్పుడూ ప్రాణాంత కం. ఇది ఏదైనా వ్యాధి యొక్క అత్యధిక మరణాల రేటులో ఒకటి. ఏదేమైనా, రాబిస్ 100% నివారించ దగినది. క్రూరమైన కుక్క కాటు వలన సంభవించే మానవ మరణాల లో 99% పైగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగు తున్నాయి. 59,000 మంది ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా వ్యాధి వల్ల మరణిస్తున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ , యునై టెడ్ స్టేట్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (యుఎస్డిఎ)తో సహా ప్రధాన ఆరోగ్య సంస్థలు, ప్రపం చ ఆరోగ్య సంస్థ, వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ యాని మల్ హెల్త్ , ఐక్యరాజ్య సమితి యొక్క ఆహార మరియు వ్యవసాయ సంస్థ, 2030 నాటికి కుక్కల ద్వారా వ్యాపించే రాబిస్ నుండి మానవ మరణాలను తొలగిస్తా మని ప్రతిజ్ఞ చేశారు. రేబీస్ ను పిచ్చికుక్క వ్యాధి, జలభీతి వ్యాధి అని కూడా అంటారు. ఇది క్షీరదాలకు చెందిన జంతువుల నుండి జంతువులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. ఉదాహర ణకు కుక్కలు, నక్కలు, తోడేళు ,, పిల్లులు, ఎలుగు బంట్లు, కోతులు, తదితర కార్నివరస్ తదితర జబ్బుతో ఉన్న జంతువు మనిషికి కరిచినచో ఈ వ్యాధి మనుషులలో వ్యాప్తి చెందును. జంతువులలో నైనా, మనుషులలో నైనా ఈ వ్యాధి కనిపిస్తే చని పోవడము తప్ప మందులేదు. పిచ్చికుక్క కరిచిన వెంటనే టీకాలు (వ్యాక్సిన్) వేసుకుంటే ప్రమాదమేమీ ఉండదు. నూటికి నూరుపాళ్లు సురక్షితము. రేబిస్ నరాలకు, మెదడుకు సంబంధించిన వ్యాధి. మెదడులో 'ఎన్-సెఫలైటిస్' అనే ఇన్ఫ్లమేషన్ లక్షణాలను కలుగజే యును. మిగతా ఏ వైరస్ వ్యాధి వలనైనా ఈ ఎన్-సెఫలైటిస్ లక్షణాలు కనిపించ వచ్చును. హెర్పీస్ వైరస్, ఎంటిరో వైరస్, ఆర్బో వైరస్, ముఖ్యముగా హెర్పెస్ సింప్లెక్స్ టైప్ 1, వేరిసెల్లా జోస్టర్, మొదలగునవి. కొన్ని లేబొరేటరీ పరీక్షల వలన తేడాను కనిపెట్టాలి. ఏ క్షీరదమైనా, మానవులతో కలిపి ఈ వ్యాధికి గురి కావచ్చును. ఈ వైరస్ ఉన్న జంతువు ఇతర జంతువులను, మనుషులను కరడం వలన ఒకరి నుండి ఇంకొకరికి ఈ వ్యాధి వ్యాపిం చును. కొన్ని సమయాలలో గాలిలో ఈ వైరస్ ఎగిరి వ్యాపించే అవకాశమూ ఉంది. గబ్బిలాలు కరడం ద్వారానే ఈ జబ్బు సోకే అవకాశము చాలా ఎక్కువ. మనుషుల నుండి మనుషులకు కరుచుట వలన, కొంతమేరకు చర్మం లేదా కార్నియా ట్రాన్స్ - ప్లాంటేషన్, ముద్దుల వలన వ్యాపించే అవకాశమూ ఉంది. జబ్బుతో బాధ పడుతున్న ఏ జంతువైనా మనుషులకు కరిస్తే రేబీస్-వైరస్ బాహ్యా నాడీ మండలము ద్వారా కేంద్రనాడీ మండలం చేరి వ్యాధి లక్షణాలు కలుగ జేయును. ఇలా జరుగ డానికి పట్టే కాలము 9 రోజుల నుండి 90 రోజులలో జరుగును, దీనినే ఇంకుబేషన్ కాలము అంటాము. మన శరీరము పై మెదడుకు ఎంత దగ్గరగా కరిస్తే అంత తొందరగా వ్యాధి మెదడుకు చేరే అవకాశ ముంది. గాభరాగా ఉండడం, తికమక పడడం మితిమీరిన భయము, భయంకర మైన చూపు, తనదైన లోకములో విహరించడం, నోటి వెంబడి లాలాజలం కారడం, గొంతు నొప్పి, ఏమీ మింగలేక పోవడం, నీటిని, ద్రావకాలను చూస్తే భయ పడడం. ఈ లక్షణాలు ముదిరి, గొంతు కండరాలు పెరాలసిస్ కి గురియై మనిషి ఏమీ తినలేక కోమాలోకి పోయి చని పోవును. జబ్బు లక్షణాలు కనిపించిన 2 నుండి 10 రోజులలో చని పోవును. ఒక వేళ అరుదుగా బ్రతికినా మెదడు దెబ్బతిని పిచ్చి వాడుగా బ్రతుకును. మనుషుల లోను, జంతువుల లోను ఈ వ్యాధి రాకుండా టీకా మందు వేసుకొని కాపాడు కోవచ్చు. 1885 లో లూయిస్ పాశ్చర్, ఇమిలె రౌక్స్ ఈ వాక్షిన్ ని కనుగొన్నారు. దీనిని %ూా=ఎ% అంటాము. దీనిని మొదట 9 సంవత్సరాల బాలుని (జోసెఫ్ మైస్టర్) పై 1885 జూలై 06 లో ఉపయోగించారు. రేబిస్ వైరస్ క్రిములను జంతువుల (గొర్రె) మెదడు కణాలలో ప్రయోగ శాలలో పెంచి వాటిని నిర్జీవము చేసి శుద్ధిచేసి తగినటువంటి ద్రావకములో నిలువచేసి సుబ్కుటేనియస్ గా ఇంజక్షన్ చేస్తారు. ఈ పాత వాక్షిన్ వల్ల పోస్టు వాక్షినేషన్ ఎన్కెఫలైటిస్ అనే సీడు ఎఫక్ట్ ఊన్నందున రాను రాను హూమన్ డిప్లోయిడ్ సెల్ వాక్షిన్ 1967 లో తయారవడం మొదలైనది. తరువాత చిక్ ఎంబ్రియో, డక్ ఎంబ్రియో, ఆ తరువాత వెరో సెల్ కల్చర్ ద్వారా కోతి మూత్రపిండాల కణాల కల్చర్ ద్వార, పూరిఫైడ్ వెరోసెల్ రేబిస్ - వాక్షిన్ తయారవు తుంది. ఎక్కువగా పెంపుడు జంతువులతో గడిపే వారు, పశు వైద్యులకు, పశువైద్య సిబ్బందికి, జంతు ప్రదర్శన శాలలో పనిచేసే వారికి రేబిస్ ఎక్కువగా వున్న ప్రదేశాలలో తిరిగేవారికి ఇవ్వాలి. వీరోసెల్ కల్చర్ వాక్షిన్ 1వ,7వ,14వ రోజులలో 3 వాక్షిన్లు తీసుకొని, ప్రతి సంవత్సరము 1 డోసు బూస్టర్ డొసుగా తీసుకోవాలి. ఇలా చేయడం వలన ఎటు వంటి ప్రమాదము ఉండదు. ఈ కుక్క కాటు (ఏ జంతువైనా సరే) మూడు రకాలు మైల్డ్, మోడరేట్, సివియర్. ఏది ఏమైనా కరిచిన చోట సబ్బుతో బాగా కడగాలి, యాంటిసెప్టిక్ లోషన్ రాయాలి. గాయము బాగా ఎక్కువైనా కుట్లు వేయ కూడదు, వేసితే వైరస్ క్రిములు కుట్లు లోపల ఉండిపోయి జబ్బు ఎక్కువ అవడానికి ఆస్కార ముంటుంది. రోజూ క్లీనింగ్ చేసుకోవడం మంచిది. సివియర్ కాటు అయితే గాయము చుట్టూ పాసివ్ వాక్షిన్ ఇంజక్షన్ చేయాలి. నొప్పి తగ్గడానికి డాక్టర్ సలహా మేరకు నొప్పిని తగ్గించే మాత్రలు వాడాలి. గాయము చీము పట్టకుండా యాంటి బయోటిక్సు వాడాలి. వాక్షిన్ ఇచ్చే ముందు ఆయా జంతువులు 10 రోజులు నిజముగా రేబిస్ అయినదో కాదో పరిశీలనలో వుంచాలి. ప్రస్తుతం మార్కెట్ లో 5 నుండి 6 రకాల వాక్షిన్లు దొరుకు తున్నాయి. కుక్క పిచ్చి ప్రవర్తన చూడాలి. సొంగ కార్చు చున్నదేమో చూడాలి. గజ్జి వగైరా వున్నాయేమో చూడాలి. పెంచిన కుక్కా, పూర కుక్కా అడిగి తెలుసుకోవాలి. తెలిసి ప్రతి పిచ్చి కుక్క కాటుకి పూర్తి కోర్సు ఇంజక్షన్లు వేసుకోవాలి. వాక్షిన్ తీసికోని కేసులలో రేబీస్ వ్యాధి పూర్తిస్థాయిలో వచ్చి మనిషి చనిపోవును. ఈ వ్యాధికి చికిత్స లేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# తలసరి ఆదాయంలో పోటాపోటీ

ఖమ్మం: తలసరి ఆదాయం రూ.2 లక్షల మార్కును ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు దాటేశాయని రాష్ట్ర గణాంకాల నివేదిక (2024) స్పష్టం చేసింది. తలసరి ఆదాయంలో రూ.9.54 లక్షలతో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండగా.. 9, 10 స్థానాల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు నిలిచాయి. భద్రాద్రి జిల్లాలో రూ.2.58 లక్షలు, ఖమ్మం జిల్లాలో రూ.2.43 లక్షలుగా తలసరి ఆదాయం నమోదైంది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3.56 లక్షలు అని నివేదిక వెల్లడించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇప్పటికీ అధిక (7,04,729) మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడుతున్నారని స్పష్టం చేసింది. వీరిలో 58.80 శాతం మంది వ్యవసాయ కూలీలు ఉన్నారని తెలిపింది. 92,404 ఎకరాల విస్తీర్ణంతో మిరప సాగులో ఖమ్మం జిల్లా తొలి స్థానంలో ఉండగా.. 29,778 ఎకరాల విస్తీర్ణంతో నాలుగో స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం నిలిచింది. పత్తి సాగులో వరుసగా ఏడు, ఎనిమిది స్థానాలను ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు కైవసం చేసుకున్నాయి.

**'ఉపాధి'లో..** ఉపాధి హామీ కూలీలు నమోదైన జిల్లాల్లో ఖమ్మం జిల్లా రెండో స్థానంలో ఉంది. 6,42,495 మంది నమోదు చేసుకోగా.. వీరిలో 2,30,576 మంది ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో 4,58,842 మంది నమోదు చేసుకోగా 1,59,637 మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు.

**పారిశ్రామిక రంగంలో..**



రాష్ట్రంలో 10,368 పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. 758 పరిశ్రమలతో ఖమ్మం జిల్లా నాలుగో స్థానంలో ఉండగా 120 పరిశ్రమలతో భద్రాద్రి జిల్లా 19వ స్థానంలో నిలిచింది.

**రహదారుల వ్యవస్థలో ఖమ్మం భేష్**

రహదారుల వ్యవస్థలో హైదరాబాద్, నల్గొండ జిల్లాల తర్వాత మూడోస్థానంలో ఖమ్మం జిల్లా నిలిచింది. ఖమ్మం జిల్లాలో 5,308.47 కి.మీ. మేర రహదారులు విస్తరించి ఉన్నాయి. జాతీయ రహదారులు- 210.73 కి.మీ., ఆర్‌అండ్‌బీ రోడ్లు- 3,684.78 కి.మీ, పంచాయతీ రాజ్ రహదారులు- 1,383.96 కి.మీ. పొడవు కలిగి ఉన్నాయి. 4,280.20కి.మీ. రహదారి కనెక్టివిటీతో భద్రాద్రి కొత్తగూడెం ఆరోస్థానంలో నిలిచింది. జాతీయ రహదారులు- 163.30 కి.మీ., ఆర్‌అండ్‌బీ రోడ్లు- 2,492.72 కి.మీ, పంచాయతీరాజ్ రహదారులు- 1,624.18 కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి.

**అక్షరాస్యతలో భద్రాద్రి ముందంజ**

రాష్ట్ర అక్షరాస్యత శాతం 66.50 ఉందని నివేదిక స్పష్టం చేసింది. భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. భద్రాద్రి కొత్తగూడెంలో ఆరేళ్లలోపు వారు 9,61,632 మందికి 6,38,699 (66.41%) మంది, ఖమ్మం జిల్లాలో ఆరేళ్లలోపు వారు 12,62,025 మందికి 8,32,320(65.96%) మంది అక్షరాస్యులు ఉన్నారు. బడి బాటలోనూ రెండు జిల్లాలు భేష్ అనిపించాయి. ఉన్నత పాఠశాల స్థాయిలో రాష్ట్రంలోనే అత్యధికంగా డ్రాపవుట్స్ కలిగిన జిల్లాలో భద్రాద్రి కొత్తగూడెం (16.96 శాతంతో) 14వ స్థానాన్ని, ఖమ్మం (-0.05 శాతంతో) మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి.

# తప్పులు గుర్తించు.. తిప్పలు తప్పించు

కామారెడ్డి : జిల్లాకేంద్రానికి చెందిన నవీన్ 9వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థికి అపార్ గుర్తింపు సంఖ్య నమోదు కోసం ప్రయత్నించగా ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రంతో తహసీల్దార్ కార్యాలయంలో పుట్టినతేదీ ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షలు, ఉపకార వేతనాలకు వివిధ ధ్రువపత్రాలు అవసరమవుతాయి. వీటిల్లో పొందుపరిచే వివరాలు సరిగా లేకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. కొందరు తల్లిదండ్రులు వారి పిల్లల పేర్లు, ఇంటిపేరు, పుట్టిన తేదీ వివరాలను సరిగా నమోదు చేయించడం లేదు. ఆధార్‌కార్డుల్లోనూ ఇష్టానుసారంగా పొందుపరుస్తున్నారు. చిన్నారులను పాఠశాలల్లో చేర్పించినప్పుడు కూడా వారి వివరాలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. చిన్నారులు జన్మించినప్పుడే వివరాలను స్పష్టంగా నమోదు చేయించాలి.

**ఇలా చేస్తే**

పుట్టినప్పుడు: చిన్నారులు జన్మించినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆసుపత్రిలో జన్మిస్తే సదరు ఆసుపత్రి వారు తమ బిడ్డ వివరాలను నమోదు చేసుకుంది లేనిది ఆరా తీయాలి. నామకరణం రోజున ఏం పేరు పెట్టాలో తల్లిదండ్రులు ముందే నిర్ణయించుకుంటారు. అయితే బిడ్డ పేరు, తల్లిదండ్రులు, ఇంటి పేర్లు తప్పులు లేకుండా రాసుకోవాలి.

**ఆధార్ నమోదుకు:** చిన్నారి ఆధార్ నమోదు కోసం వెళ్లినప్పుడు ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాల నమోదులో తప్పు చేసే అవకాశం ఉంది. వివరాలు పూర్తిగా చెప్పిన తర్వాత సబ్మిట్ చేసేముందు సరిగా ఉంది లేనిది తల్లిదండ్రులు చూసుకోవాలి. ఆ తర్వాతే సబ్మిట్ చేయాలి. **పాఠశాలలో ప్రవేశం వేళ:** చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేటప్పుడు ఆధార్ కార్డ్, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వివరాలు సరిచూసుకోవాలి. పాఠశాల వారు దరఖాస్తు ఫారం ఇచ్చినప్పటికీ మనం పూరించిన వివరాలు పాఠశాల రికార్డులో సరిగా ఉన్నాయా లేదా గమనించి తప్పుగా ఉంటే వెంటనే మార్పించుకోవాలి. చిన్నారులు పాఠశాలకు వెళ్లడం ప్రారంభించగానే స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని తీసుకోవాలి. ఇందుకోసం మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

# అడుగడుగునా నిఘా. అక్రమాలకు అడ్డుకట్ట




పెద్దపల్లి : జిల్లాలో ఇసుక రవాణాపై ప్రభుత్వం నిఘా పెంచింది. అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయడానికి పోలీసు, గనుల శాఖ అధికారులను భాగస్వాములను చేసింది. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతోంది. అధిక లోడు నియంత్రణకు రీచ్‌లలోని కాంటాల్లో తూకం వేసిన తర్వాతే అనుమతినిస్తున్నారు. రామగిరి మండలం కల్వచెర్లలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అనుమానం ఉన్న వాహనాలను తూకం వేసి అధిక లోడ్ ఉంటే జరిమానా విధిస్తున్నారు.

**ఇతర ప్రాంత అధికారులకు బాధ్యతలు**

ముత్తారం మండలం జిల్లెల్లపల్లి(తాడిచెర్ల రీచ్-1), ఖమ్మంపల్లి(తాడిచెర్ల రీచ్-2)లో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రీచ్‌ల పర్యవేక్షణ బాధ్యతలను ఇతర జిల్లాలకు చెందిన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీఎస్ఎండీసీ) అధికారులతో పాటు గనుల శాఖ అధికారులకు కేటాయించారు. మంథని మండలం గోపాల్‌పూర్ రీచ్ ఇసుక నిల్వ కేంద్రంలో జనగామ జిల్లాకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ విజయ, జిల్లెల్లపల్లిలో పెద్దపల్లి గనుల శాఖ ఆర్ఐ వెంకటగిరి, ఖమ్మంపల్లిలో ఆర్ఐ రేణుకలకు బాధ్యతలు అప్పగించారు. ఇసుక తవ్వకాలు, నిల్వ కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించారు. హైదరాబాద్ నుంచి టీఎస్ఎండీసీ, గనుల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ఆధారంగా రవాణా చేస్తుండటంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది.

**పరిమితి మించితే జరిమానా**

లారీల్లో నిర్ణీత పరిమాణం కంటే 50 కిలోలు ఎక్కువ నింపినా జరిమానా విధిస్తున్నారు. ఇసుక నిల్వ కేంద్రంలో సీసీ కెమెరాలు పరిశీలించి మరోసారి తూకం చేస్తున్నారు. గతంలో ఒక్కో లారీలో దాదాపు రూ.3 వేల విలువను ఇసుకను అదనంగా తరలించేవారు. ప్రస్తుతం కిలో ఎక్కువగా ఉన్నా ఉపేక్షించడం లేదు. లారీల్లో అదనంగా తరలించేందుకు బిగించిన ఎత్తు రేకులను తొలగించుకోవాలని నిర్వాహకులు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆన్‌లైన్ రసీదు లేకుండా రవాణా జరిగేది. నిఘా పటిష్ఠం చేయడంతో బోగస్ దందాకు అడ్డుకట్ట పడింది.

**నిరంతర పర్యవేక్షణ**

ఇసుక రీచ్‌లలో తవ్వకాలు, రవాణాపై వారం రోజులుగా రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా పర్యవేక్షిస్తున్నారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్ఎండీసీ వైస్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్లు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. రోజుకు ఎంత తవ్వకాలు జరిపారు? ఎన్ని లారీల్లో ఎన్ని టన్నులు తరలించారు? అన్న విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. త్వరలో రీచ్‌లలోని సీసీ కెమెరాలను కలెక్టరేట్‌తో, అనంతరం హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించనున్నారు.

**గతంలో దందా సాగిందిలా..**

గతంలో ఇసుక గుత్తేదారులు ఆడిందే ఆటగా ఎలాంటి వే బిల్లులు లేకుండా జీరో దందా సాగించారు. 16 టైర్ల వాహనాల్లో 35 టన్నులు, 14 టైర్ల వాహనాల్లో 32 టన్నులు, 12 టైర్ల వాహనాల్లో 26 టన్నుల ఇసుక నింపాల్సి ఉండగా అదనంగా నింపి తరలించేవారు. అక్రమాలు గుర్తించినప్పటికీ నామమాత్రంగా కేసులు నమోదు చేసి, జరిమానా విధించేవారు. ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నా అడ్డూ అదుపూ లేకుండా అక్రమ రవాణా సాగింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఒక్కో రీచ్‌లో రూ.కోట్ల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైంది.

# కొత్త కోర్సులతోనే భవిత



సిరిసిల్ల : ఇటీవల దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా జరిగిన ఒప్పందాల్లో రాష్ట్రంలో ద్వితీయశ్రేణి పట్టణాల్లోనూ డేటా కేంద్రాల ఏర్పాటుకు సిఫీ టెక్నాలజీస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు జేఎన్‌టీయూ, ఏడు ప్రైవేటు కళాశాలలుండగా సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటే రాబోయే రోజుల్లో వీటిలో ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కలిసివస్తాయి.

ఉమ్మడి జిల్లాలో కొండగట్టు, మంథని, సిరిసిల్ల జేఎన్‌టీయూల్లోని 16 విభాగాల్లో ఏటా 1034 మంది విద్యార్థులు చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతుండగా వీరిలో 70శాతం మంది ఉత్తీర్ణులవుతున్నారు. ప్రాంగణ నియామకాల్లో మాత్రం వెనకబడిపోతున్నారు. ఈ నేపథ్యంలో బీటెక్ తృతీయ సంవత్సరంలో అదనపు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలంటున్నారు నిపుణులు.

కంప్యూటర్స్ విభాగంలో సీ, సీప్లస్‌ప్లస్, జావా, పైథాన్ వంటి కోర్సులు పాతబడిపోయాయి. ప్రస్తుతం ఎమర్జింగ్ టెక్నాలజీస్, సర్వీస్ నౌ, పెగా, ఏడబ్ల్యూఎస్, క్లౌడ్ వంటి సర్టిఫికెట్ కోర్సులతో పాటు ఆంగ్లంలో పట్టు సాధించి, విదేశీ భాషలు చేర్చుకోవాలి. అప్పుడే ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యే అవకాశముంది.

మంథని, కొండగట్టు కళాశాలల్లో సీఎస్ఈ, సీఎస్ఎం (ఏఐ మిషన్‌లర్నింగ్), ఐటీలో సైబర్ సెక్యూరిటీ కోర్సులు ప్రత్యేకంగా ఉన్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్. డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలను అన్ని రంగాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. వీటికి టూల్స్ వాడతారు. టూల్స్ తెలియాలంటే ఎమర్జింగ్ టెక్నాలజీ కోర్సులు నేర్చుకోవాలి. అలాగే ఆయా రంగాల్లో వస్తున్న మార్పులు గమనిస్తూ ఉండాలి.

మూడు కళాశాలల్లో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ సెల్ లేదు. దీనికోసం కళాశాలలోనే సీనియర్ ఫ్యాకల్టీ ఒకరికి బాధ్యతలు అప్పగించారు. వీరు హైదరాబాద్ జేఎన్‌టీయూలో నిర్వహించే ప్రాంగణ నియామకాలకు విద్యార్థులను పంపుతున్నారు. అక్కడి వారు ఇతర ప్రాంతాల విద్యార్థుల పట్ల విముఖత చూపడంతో ఇక్కడి విద్యార్థులు ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం -సంజయ్, మెకానికల్**

ప్రాంగణ నియామకాల కోసం హైదరాబాద్ వెళ్లి ముఖాముఖికి హాజరు కావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. మా కళాశాలకు అటానమస్ హోదా ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని మూడు జేఎన్‌టీయూ కళాశాలలకు కలిపి ఏటా ఒక కళాశాలలో ప్రాంగణ నియామకాలు జరిపించేలా చూడాలి. ఈ విషయమై ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టి సారించాలి.

**అవసరమైన నైపుణ్యాలతో మేలు-అయ్యప్ప, ఈసీఈ**

ప్రాంగణ నియామకాల సమయంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగరాల్లో చదివిన వారికి చాలా వ్యత్యాసం ఉంటోంది. అక్కడి వారు సబ్జెక్టులతో పాటు ప్రైవేటుగా శిక్షణ తీసుకుంటూ కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. ఇక్కడి కళాశాలల్లోనే ప్రత్యేక కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలి. **మార్కులు ప్రామాణికం కాదు- ప్రభాకర్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ, కొండగట్టు** ఇంజినీరింగ్ విద్యార్థులకు అకడమిక్ మార్కులు ప్రామాణికం కాదు. ఇవి ఉద్యోగాలు సాధించిపెట్టవు. ఆయా రంగాల్లో మార్పులను గమనిస్తూ తగిన సర్టిఫికెట్ కోర్సులు నేర్చుకోవాలి. కనీసం మూడు కోర్సులైనా చేసి నైపుణ్యం సాధించి ఉండాలి. జేఎన్‌టీయూలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

# అమ్మవారి చెంత.. వసూళ్ల దందా

వేములవాడ: ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా ముందుగా ఇక్కడి భక్తులు బద్ది పోచమ్మ మొక్కు ముట్టజెప్పడం ఆనవాయితీగా వస్తోంది. కాగా ఆలయంలోని కొంత మందికి ఇది వరంగా మారింది. మొక్కు చెల్లించుకోవాలని వెళ్లే భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్న భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. బోనం నైవేద్యం, బెల్లంసాక సమర్పించడంతో పాటు పట్నం వేయడం వంటి మొక్కులు చెల్లించుకుంటారు. వీటితో పాటు అమ్మవారికి ఒడి బియ్యం, తొట్టె కట్టుట, చీర సమర్పణ వంటి మొక్కులను భక్తులు ఉచితంగా చెల్లించుకునే అవకాశం ఉండగా కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మంగళ, ఆదివారాల్లో వేల సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఇదే అదనుగా ఆలయంలో విధులు నిర్వహించే కొందరు సిబ్బంది అక్రమ మార్గాల్లో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్నాల మొక్కులు చెల్లించుకునే చోట రూ.1500 నుంచి రూ.2 వేల వరకు దండుకుంటున్నారని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్టు ధర ఒకటి ఉంటే చెల్లింపులు అదనంగా చేయాలని కొందరు సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడిగినంత డబ్బులు ఇచ్చుకుంటేనే మొక్కు పూర్తవుతుందని.. లేదంటే మొక్కు వాయిదా వేసుకోవల్సిన పరిస్థితి నెలకొందని భక్తులు అంటున్నారు. ఆలయంలో అడుగడుగునా అక్రమంగా వసూళ్లు జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని చెబుతున్నారు. ఇప్పటికైనా అక్రమ దందాకు అడ్డుకట్టవేయాలని కోరుతున్నారు.డబ్బులు వసూలు చేస్తే చర్యలు-వినోద్‌రెడ్డి. ఈవో రాజన్న ఆలయం వేములవాడ మొక్కులు చెల్లించుకునే భక్తుల వద్ద సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు. బద్ది పోచమ్మ ఆలయంలో పట్నాలు వేసే వ్యక్తులు భక్తుల వద్ద ఎక్కువ డబ్బులు వసూలు చేసినట్లు ఇటీవలే మా దృష్టికి వచ్చింది. డబ్బులు తిరిగి భక్తులకు ఇప్పించాము. ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

# ఈవీ లీవీగా..!

ఖమ్మం : డీజిల్, పెట్రోల్ వాహనాలతో కాలుష్యం పెరిగిపోతోంది. అందుకే పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నేళ్లుగా ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) జోరు ఊపందుకుంది. ఖమ్మం జిల్లాలో 2022లో 322, 2023లో 863, 2024లో 1,641 ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు జరగటం గమనార్హం.

**ప్రోత్సాహకాలు.. రాయితీలు**

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేందుకు ప్రోత్సాహకాలు, రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గతంలో కేంద్ర ప్రభుత్వం సైతం రాయితీలు కల్పించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తోంది. రోడ్డు, జీవితకాల పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చింది. గతంలో 100సీసీ ఇంజిన్ సామర్థ్యం గల ద్విచక్రవాహనాలకు మాత్రమే ఈ సదుపాయం ఉండేది. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకూ రాయితీలను 2026 డిసెంబర్ 31 వరకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఓ వ్యక్తి రెండో వాహనం కొంటే 2% పన్ను విధించేది. రెండో వాహనం ఎలక్ట్రిక్ వాహనం(ఈవీ) అయితే అదనపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.



**ఛార్జింగ్ స్టేషన్లతో మరింత మెరుగు**

ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, కార్లకు ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకునేలా డిజైన్లను వాహన తయారీ సంస్థలు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. దూర ప్రాంతాలకు వెళితే ఛార్జింగ్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. గతంలో టీజీరెడ్‌కో(రెన్యూబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నిచోట్ల ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు రూపొందించారు. స్థలాలను అన్వేషించారు. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క ఛార్జింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టలేదు. టీజీఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేటగిరీ-9 కింద పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రిక్ వాహనాలకు ఛార్జింగ్ పెట్టుకునేలా కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ ఉభయ జిల్లాల్లో కొనసాగుతోంది. ఖమ్మంలోని బైపాస్ రోడ్డు, కొన్ని పెట్రోల్ బంకులు, సత్తుపల్లి మండలం కిష్టారంలో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లి, పెద్దగోపతి, వైరా పట్టణం, వైరా మండలం పినపాక, సత్తుపల్లిలో ఛార్జింగ్ స్టేషన్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోనూ కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయని విద్యుత్తు సంస్థ అధికారులు తెలిపారు. ఇదే పంథాను కొనసాగిస్తూ ఛార్జింగ్ స్టేషన్లను పెంచితే ఉభయ జిల్లాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మరింత పెరగనుంది.

2022 నుంచి 2024 వరకు.. ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు

ఖమ్మం: 2,826

భద్రాద్రి: 1,469

పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఖమ్మం జిల్లాలో మూడేళ్లుగా 'ఈవీ'ల రిజిస్ట్రేషన్లు క్రమేణా పెరిగాయి.

వి.వెంకటరమణ, జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖ అధికారి, ఖమ్మం

# కొంత ప్రగతి.. స్వల్ప వృద్ధి

కామారెడ్డి : రాష్ట్ర సగటుతో పోలిస్తే ఉమ్మడి జిల్లా విద్య, వైద్యం, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉంది. గేదెల కన్నా స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయంలో పెరుగుదల ఉంది. పలు రంగాల్లో కొంత మెరుగు..కొంత లేదనేలా ఫలితాలను చూపించింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2024- రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్(అట్లాస్) నివేదిక ప్రకారం ఉమ్మడి జిల్లా ప్రగతి ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

**తలసరి స్వల్పమే**

ఒక సంవత్సర కాలంలో ఒక వ్యక్తి ఆర్జించే ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని బట్టి తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. జిల్లా పరిధిలో ఏడాది మొత్తంలో జీఎస్‌డీపీని జనాభాతో భాగిస్తే వచ్చిన మొత్తాన్ని జిల్లా పౌరుడి తలసరి ఆదాయంగా గణిస్తారు. గతంతో పోలిస్తే కొంత మెరుగ్గా ఉన్నా ఇంకా మెరుగుపడాల్సి ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,56,564 ఉండగా నిజామాబాద్ రూ.1,96,185తో 26వ స్థానంలో, కామారెడ్డి రూ.1,89,588తో 30వ స్థానంలో ఉన్నాయి.

**ఉపాధి అంతంతే**

ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని లెక్కగట్టడానికి తలసరి ఆదాయం చక్కటి కొలమానం. 2020-21ఆర్థిక సంవత్సరం నుంచి ఉభయ జిల్లాల్లో తలసరి ఆదాయం క్రమేపి పెరుగుతూ వస్తోంది. మూడేళ్లుగా ఉభయ జిల్లాల స్థూల జిల్లా జాతీయోత్పత్తి ధరల పెరుగుదలకు అనుగుణంగా పెరిగిన పరిస్థితి. ప్రధానంగా రెండు జిల్లాల్లో పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాలు లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**స్థూల జిల్లా జాతీయోత్పత్తి**

ప్రాంత అభివృద్ధికి స్థూల జిల్లా జాతీయ ఉత్పత్తి(జీడీడీపీ)ని కొలమానం. ఏడాదిలో జిల్లాలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవలు, కొనుగోలు సేవలను జీడీడీపీగా పరిగణిస్తుంటారు. వినిమయం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయంతో పాటు ఎగుమతులు, దిగుమతుల మధ్య తేడా తదితర వాటిని లెక్కలోకి తీసుకుంటారు. భవిష్యత్తు ప్రణాళికలను నిర్ణయించడానికి జీడీడీపీని కొలమానంగా భావిస్తారు. రాష్ట్రంలో జీడీడీపీలో నిజామాబాద్ జిల్లా ఏడు, కామారెడ్డి 18వ స్థానంలో ఉన్నాయి. **లింగనిష్పత్తి అంతంతే**

ఉభయ జిల్లాల్లో లింగనిష్పత్తి ఆందోళనకరంగా ఉంది.ప్రతి వెయ్యి మంది బాలురకు కామారెడ్డిలో 941, నిజామాబాద్‌లో 963 మంది బాలికలున్నారు. లింగనిర్ధారణ పరీక్షలను అరికట్టకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

# ఒక్క'సారొస్తే' మళ్లీ పోరు

హైదరాబాద్: ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా రెండేళ్లు లేదా గరిష్ఠంగా మూడేళ్లు డిప్యుటేషన్‌కు అనుమతిస్తారు. తర్వాత ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లాల్సి ఉంటుంది. కానీ దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా కుర్చీని పట్టుకొని అక్కడే తిష్ఠ వేశారు. ఇలా పదుల సంఖ్యలో ఉన్న ఉద్యోగులు సింహభాగం రాజధాని పరిధిలోని వారే ఉన్నారు.



**పదోన్నతి వచ్చినా కదలరు..** మాతృసంస్థ నుంచి వేతనాలు తీసుకుంటూ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడ ఖాళీలు చూపకుండా, పదోన్నతులు వచ్చినా కదలకుండా ఏళ్లుగా కొనసాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఓ ఉద్యోగి రెండు దశాబ్దాలుగా ఒక చోటే పనిచేస్తున్నారు. ఈవోగా పదోన్నతి వచ్చినా కార్యాలయం విడిచి వెళ్లలేదు. రాజధాని పరిధిలోని ధర్మశాల, అమీర్‌పేట్ హనుమాన్ దేవాలయం, సికింద్రాబాద్ భోలక్‌పూర్ భవానీ శంకరాలయం, అడిక్‌మెట్ హనుమాన్ దేవాలయం నుంచి డిప్యుటేషనపై వచ్చిన ఉద్యోగులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కేంద్ర కార్యాలయంలో ఖాళీగా ఉన్న 111 పోస్టులలో 77 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 34 ఇంజినీరింగ్ ఉన్నాయి. నిబంధనల ప్రకారం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(అడ్మినిస్ట్రేషన్) విభాగంలో 209మంది ఉద్యోగులు ఉండాలి. కానీ 126 మంది మాత్రమే పని చేస్తున్నారు. దీంతో పలు దేవాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని డిప్యూటేషన్‌పై కమిషనర్ కార్యాలయానికి తీసుకొచ్చి పని చేయిస్తున్నారు. ఏడాది అనుమతితో వచ్చిన కొందరు ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. దీంతో అర్హులకు అవకాశం రావడం లేదని, సీనియార్టీ ప్రకారం పదోన్నతులకు నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

# అవసరం గుర్తించాలి.. అన్నదాతను ప్రోత్సహించాలి

వికారాబాద్ : వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు ఉద్యానశాఖ సమాయత్తమవుతోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో గమనించి వారికి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు విత్తనాలు, మొక్కలను సిద్ధం చేస్తోంది. భూగర్భ జలాలు పడిపోతున్న సమయంలో ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఆరుతడి పంటగా సాగును ప్రోత్సహించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తూ ఉన్న జలాలను పొదుపుగా వాడుకునేందుకు అవసరమైన రైతులు రాయితీపై బిందు, తుంపర పరికరాలను అందించనుంది. ఇందుకోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచిస్తోంది.

**వేసవిలో ధరలు ఆశాజనకం**

గత వర్షాకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు అనేక కారణాలతో కొంత నష్టపోవాల్సి వచ్చింది. దీంతో వేసవిలో అంతగా దృష్టి పెట్టరని కూరగాయల కొరత ఏర్పడుతుందని భావించిన అధికారులు రూ.14కోట్ల అంచనా వ్యయంతో ముందస్తు ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నారు. ఉల్లి, సొరకాయ వంటి ఆయా రకాల విత్తనాలు కొరత రాకుండా ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా ఏప్రిల్ -మే నెలల్లో కూరగాయల ధరలు పడిపోకుండా ఒక విధంగా నిలకడగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా పండిస్తున్న వాటితో జిల్లా అవసరాలతో పాటు జంటనగర వాసుల అవసరాలను కూడా తీరుస్తున్నారు. ఎకరా పెట్టుబడికి రూ.2వేలు వెచ్చించే కొత్త రకం



వంకాయ వంగడాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**కొరత లేకుండా చూస్తాం**

వేసవిలో కూరగాయల కొరత రాకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. నీటిని సద్వినియోగం చేసుకునేందుకు రైతులకు బిందు, తుంపర పరికరాలను అందజేస్తున్నాం. దరఖాస్తు చేసుకునే వారందరికీ విడతల వారీగా సరఫరా చేస్తాం. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. వివిధ రకాల పంటలు సాగు చేయడంతో రైతులకు తెలియకుండానే పంట మార్పిడి కూడా జరుగుతోంది. ఇవే కాకుండా తొలకరిలో అరటి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో వంటి మొక్కలను కూడా అందజేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఎం.ఎ.సత్తార్, జిల్లా ఉద్యానాధికారి ఏడాదిలో పండించే విస్తీర్ణం 27,000 ఎకరాలు
దిగుబడి అంచనా 2.56 లక్షల మెట్రిక్ టన్నులు

# రేషన్ బియ్యం.. ఇప్పుడెలా?



పూడూరు : పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పంపిణీ ఈ నెలకు సంబంధించి ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి నెల 1వ తేదీ నుంచి సమీపంలోని ఎమ్ఎల్ఎస్ పాయింట్ల నుంచి ఆయా గ్రామాల డీలర్‌లకు లారీల ద్వారా సరఫరా చేస్తారు. 5వ తేదీ నుంచి 16వ తేదీవరకు పంపిణీ పూర్తి కావాల్సి ఉంటుంది. కానీ ఈసారి రెండు వారాలు దాటినా అందరికీ రాలేదు. ఇటీవలే వచ్చాయి. కానీ గడువేమో నేటితో పూర్తవుతోంది. బియ్యం పొందడానికి లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు.

**నాలుగు రోజుల క్రితమే వచ్చాయి**

నాలుగు రోజుల క్రితం పూర్తి స్థాయి బియ్యం గ్రామాలకు చేరుకున్నాయి. పంపిణీకి సంబంధించి చివరితేదీ ఈనెల 20 వరకు పొడిగించినా అదికూడా నేటితో పూర్తవుతోంది. సమయం ఒకేరోజు ఉండటంతో కూలీలు ఇతర పనుల నిమిత్తం వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. ఈ– పోస్ విధానం కావటంతో ఆహార భద్రత కార్డుదారుల్లో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వచ్చి వేలిముద్ర వేయాల్సిందే.వీరంతా తీసుకోవాలంటే కష్టంగా మారుతోంది.

**కొత్త వారి సంగతేమిటి**

చాలాకాలంగా కొత్తరేషన్ కార్డులు లేకపోవటం, కొత్తగా పెళ్లయి వచ్చిన మహిళలు, పిల్లల పేర్లు రేషన్ కార్డులో నమోదు కాలేదు. దీంతో ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి అవకాశం కల్పించింది. కొత్తవారి పేర్లు ఇంకా నమోదు కాలేదు. ఐదేళ్ల క్రితం కొత్తగా రేషన్‌కార్డుల కోసం అర్జీలు పెట్టుకున్న వారిలో కొందరికి మాత్రమే అవకాశం కల్పించారు. వీరు మాత్రమే ఈనెల కోటాలో ఉచిత బియ్యం అందుకున్నారు.

మరికొంత సమయం అవసరం

జిల్లాలోని లబ్ధిదారులకు ఇచ్చేందుకు సమయం తక్కువగా ఉండటంతో కొంత మంది తీసుకునేందుకు ఆస్కారం లేదు. మరో నాలుగు రోజులు గడువు ఇస్తే బాగుంటుంది.
జూకారెడ్డి, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో మొత్తం ఆహార భద్రత కార్డులు.. 2.41 లక్షలు
రేషన్ దుకాణాలు.. 588
నెలకు వచ్చే బియ్యం.. 44 లక్షల మెట్రిక్ టన్నులు

# ప్రజా చైతన్యం.. సామాజిక సేవ



సిరిసిల్ల : శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ పోలీసుల ప్రధాన విధి. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు ప్రజలకు చేరువయ్యేందుకు చేపడుతున్న పలు కార్యక్రమాలు స్ఫూర్తి నింపుతున్నాయి. నిరుద్యోగ యువతకు తరచూ ఉద్యోగ మేళాలు నిర్వహించడం. క్రీడల్లో సత్తాచాటేలా యువతతో దోస్తీమీట్లో పోటీలు, విద్యార్థిదశలోనే సైబర్ నేరాలపై అవగాహన. పాఠశాల, కళాశాలల్లోని బాలికలు, గ్రామాల్లోని మహిళలకు పలు అంశాల్లో ఉపయోగకర కార్యక్రమాలు చేపడుతున్నారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్టవేసేందుకు పోలీసు అక్క పేరుతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికోసం పోలీస్‌స్టేషన్లలో నూతనంగా నియామకమైన మహిళా కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించారు. పాఠశాలలు, కళాశాలలు గ్రామాల్లో మహిళలకు ఉన్న ప్రత్యేక చట్టాలు, వాటి అమలుపై జిల్లా షీటీం బృందంతో అవగాహన కల్పిస్తారు. ఫిర్యాదులు సైతం అక్కడే స్వీకరిస్తున్నారు.

"వేములవాడ మండలం తిప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జనవరి నెలలో 'పోలీసు అక్క'పై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఇంటి ఎదురుగా ఉన్న యువకుడు వేధిస్తున్నాడని పదోతరగతి విద్యార్థిని షీటీం బృందానికి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపి అతనికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అతనిపై ఈ పెట్టీకేసు నమోదు చేశారు."

జిల్లాలో వాహనాలు తనిఖీల సమయంలో డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా చాలామంది పట్టుబడుతున్నారు. దీనికోసం ప్రతి పోలీస్టేషన్‌లో ఉచిత డ్రైవింగ్ లైసెన్సు డ్రైవ్ చేపట్టారు. దరఖాస్తులు చేసుకున్నవారికి రెండు విడతలుగా జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పరీక్షలు నిర్వహించి 500 మందికి ద్విచక్రవాహన, ఎల్ఎంవీ లైసెన్స్‌లు ఇప్పించారు.యువతను గంజాయి, డ్రగ్స్ మత్తు నుంచి దూరం చేస్తూ.. క్రీడల్లోరాణించేలా 'దోస్తీమీట్'ను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ అటల్లో ఆసక్తి ఉన్నవారిని గుర్తించి వారికి నిపుణులతో తర్ఫీదు ఇప్పించారు. మండలస్థాయిలో పోటీలు నిర్వహించారు. అక్కడ మంచి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఇలా వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రతిభచూపిన వారిని జిల్లా క్రీడల అసోసియేషన్ గుర్తించి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారు.

**ప్రతిభను గుర్తిస్తున్నారు- ఎండీ బఫత్‌ఖాజా, తడగొండ, బోయినపల్లి**

పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి ఉంది. డిప్లొమా పూర్తిచేసి గ్రామంలోనే ఆటోనడుపుతున్నా. పోలీసులు మండలస్థాయిలో నిర్వహించిన దోస్తీమీట్లో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. మాజట్టు జిల్లాకు ఎంపికైంది. అక్కడి పోటీలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నా ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ప్రతిభను గుర్తించడం ఎంతో ఆనందంగా ఉంది.

జాబ్‌మేళాలో దరఖాస్తు చేసుకున్నా– బైరి కళ్యాణి, అడవిపదిర, వీర్నపల్లి బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేశాక ఉద్యోగం కోసం సిరిసిల్ల, కరీంనగర్ పట్టణాల్లోని ఆసుపత్రుల్లో సంప్రదించాను. ఉద్యోగ అనుభవం లేదని తిరస్కరించారు. వీర్నపల్లిలో పోలీసులు నిర్వహించిన జాబ్‌మేళాలో దరఖాస్తు చేసుకున్నా. విద్యార్హత పత్రాలను పరిశీలించి హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రిలో ఉద్యోగం ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. అన్ని వర్గాలకు చేరువ– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల అన్నివర్గాల ప్రజలకు చేరువ కావడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువతకు అనేక అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో నేరాల నియంత్రణ సులభతరమవుతోంది. ఈ మధ్య సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల పెరుగుతున్నాయి. ఖాకీ కిడ్స్ పేరుతో స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆయా అంశాలను చిన్నారులు వారి తల్లిదండ్రులకు వివరించాలనేది లక్ష్యం.

# రంగనాయకసాగర్‌పైనే ఆశలు

సిరిసిల్ల: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. చెరువులు, వ్యవసాయ బోరుబావుల్లో నీటినిల్వలు అడుగంటుతున్నాయి. జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో చెరువుల్లో నీటినిల్వలు బాగా తగ్గాయి. ప్రధానంగా తంగళ్లపల్లి మండలంలోని చంద్రవంక ప్రాజెక్టు కింద 800 ఎకరాల ఆయకట్టు ఉండగా ఈ యాసంగిలో నీటిలభ్యత తక్కువగా ఉండటంతో కేవలం 150 ఎకరాల్లోనే పంటలు సాగుచేశారు. కాళేశ్వరం 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్ జలాశయం ద్వారా ఈ మూడు మండలాల్లోని చెరువులు నింపాలి. మార్చిలో వరి పొట్టదశకు వస్తుంది. ఈ సమయంలో నీటి వినియోగం పెరుగుతుంది. నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చక ముందే గొలుసుకట్టు చెరువులను నింపుతూ చంద్రవంక ప్రాజెక్టులోకి నీటిని తరలించాలని ఆయా మండలాల రైతులు వారం క్రితమే జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు మొరపెట్టుకున్నారు. 11వ ప్యాకేజీ డివిజన్ సిద్దిపేటలో ఉండటంతో నీటివిడుదల ప్రణాళిక మా పరిధిలోనిది కాదని చేతులెత్తేశారు. దీంతో రైతులు నాలుగు రోజులుగా సిద్దిపేట డివిజన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**అసంపూర్తి పనులతో అవస్థలు**

రంగనాయకసాగర్ జలాశయం నుంచి ఎల్–6 కాలువ ద్వారా జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు చేశారు. ఇల్లంతకుంట మండలం దాచారం, తంగళ్లపల్లి మండలం జిల్లెల, ముస్తాబాద్ మండలం మొర్రాపూర్ వద్ద భూసేకరణ నిలిచిపోయింది. దీంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. భూసేకరణ జరిగి పనులు పూర్తయితే.. నర్సింహులపల్లి, బాలమల్లుపల్లి, బస్వాపూర్, రామన్నపల్లి, అంకుసాపూర్, లక్ష్మిపూర్, తాడూరు వరకు నీరందుతుంది.

విడుదల చేస్తాం– సీతారాములు, ప్యాకేజీ–11 ఈఈ



కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నాం. కొన్ని పనులు అసంపూర్తిగా ఉండటంతో వాగులు, వంకల ద్వారా గొలుసుకట్టు చెరువులను నింపుతూ రావాలంటే సమయం పడుతోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు.

నీరొస్తే పంటచేతికొస్తుంది– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అంకుసాపూర్, తంగళ్లపల్లి మండలం

వరిపంట చేతికందాలంటే రాబోయే నెలరోజులు కీలకమైన సమయం. రంగనాయకసాగర్ నుంచి పదిరోజులు నీటిని విడుదల చేస్తే గ్రామాల రైతులమంతా కలిసి గొలుసుకట్టు చెరువుల నుంచి ప్రాజెక్టును నింపుతాం. తక్కువ నీరు వదలడంతో ఎగువన ఉన్నరైతులే మళ్లించుకుంటున్నారు. ఆయకట్టుకు నీరందించేలా అధికారులు సహకరించాలి.

# వంద దాటిన పీఎం 10

హైదరాబాద్: కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం ఘనపు మీటర్ గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళి కణాలు 60 మైక్రోగ్రాములు, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాల ప్రకారం 40 మైక్రోగ్రాములకు మించకూడదు. పీసీబీ తాజా నివేదిక ప్రకారం ఫిబ్రవరి మొదటి వారంలో జీడిమెట్ల, జూపార్కు, కోకాపేట్ ప్రాంతాల్లో 100 మైక్రోగ్రాములకు మించి నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

**దీర్ఘకాలంలో దుష్పరిణామాలు..**

పీఎం 10 సూక్ష్మ ధూళి కణాల పరిమితి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. రహదారులపై రేగే దుమ్ము, చెత్త దహనం, పరిశ్రమలు, వాహనాలతో ఇవి ఎక్కువ పరిమితికి మించి నమోదవుతాయి. ఈ కాలుష్య కారకాలు దీర్ఘకాలం నమోదైతే తీవ్ర అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మానవ వెంట్రుక (50 నుంచి 70 మైక్రోమీటర్లు) కంటే పీఎం 10 ధూళి కణాలు



తక్కువ మందంతో (10 మైక్రోమీటర్లు) ఉంటాయి. శ్వాస పీల్చిన సమయంలో శరీరంలోకి వెళ్లి ఫ్రీ రాడికల్స్, యాంటీ యాక్సిడెంట్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. దీర్ఘకాలం కొనసాగితే జీవక్రియ ప్రభావితమై కొన్నాళ్లకు ఎముకలు గుల్లబారి పెలుసైపోయి అస్టియోపోరోసిస్ బారినపడే అవకాశం ఉంది. వీటితో పాటు తాత్కాలికంగా అలెర్జీలు, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# రహదారికి పచ్చదనం.. హాయిగా ప్రయాణం

బొంరాస్‌పేట : హైదరాబాద్–బీజాపూర్ 163వ నెంబరు జాతీయ రహదారి పచ్చని చెట్లతో కళకళలాడనుంది. దీని మీదుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, ప్రయాణికులు మొక్కలు ఎదిగి వృక్షాలుగా మారి ఇచ్చే చల్లటి నీడ, వీచే చల్లటి గాలులతో సేదదీరనున్నారు.

**మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు..**

జిల్లాలోని మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం మీదుగా నేషనల్ హైవే ఉండడంతో మొక్కల పెంపకంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఏడాది నాటిన మొక్కలు ఇప్పటికే ఏపుగా పెరిగాయి.నెలల్లో ఇవి రహదారికి శోభను తేనున్నాయి.

**65 కిలో మీటర్లు, 43,000 మొక్కలు**

మన్నెగూడ నుంచి మన రాష్ట్ర సరిహద్దు వరకు 65 కిలోమీటర్ల దూరం మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. కిలో మీటరుకు 666 మొక్కల చొప్పున మొత్తం 43,290 మొక్కలను నాటారు. ఫెల్టోఫాం, గుల్‌మొహర్, నేరేడు, మామిడి వంటి నీడనిచ్చే మొక్కలను కూడా నాటారు. ఒక్కో వైపు మూడు వరుసల్లో వీటిని నాటగా వాటికి ముందు బిగ్నోనియా, బహూలియా వంటి రకరకాల పూల మొక్కలను కూడా పెంచుతున్నారు. వీటి సంరక్షణ బాధ్యతను హెచ్ఎండీఏకు అప్పగించారు. మొత్తం రహదారిని ఐదు భాగాలుగా విభజించి గుత్తేదార్లకు అప్పగించారు. ఎనిమిది నెలలపాటు వీరు అవెన్యూ ప్లాంటేషన్‌ను కాపాడే బాధ్యత తీసుకుంటారు. నిత్యం మొక్కలకు ట్యాంకర్లతో నీళ్లు పోయడం, పాదుల చుట్టూ కలుపు మొక్కలను తొలగించడం, చెట్లు ఏపుగా పెరగడం కోసం వాటి పక్కన పెరుగుతున్న కొమ్మలను కత్తిరించడం, చనిపోయిన వాటి స్థానంలో అంతే పొడవైన వాటిని నాటడం వంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇందుకోసం రూ.3 కోట్లను ఖర్చు చేస్తోంది.

**అవెన్యూ ప్లాంటేషన్‌ను కాపాడుతున్నాం**మన్నెగూడ నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా రూ.3 కోట్లతో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి సంరక్షణ బాధ్యతను హెచ్ఎండీఏకు అప్పగించాం. నీడనిచ్చే మొక్కలతోపాటు పాటు పూల మొక్కలను నాటాం. ఏడాదిలో నేషనల్ హైవే పచ్చని చెట్లతో కళకళలాడనుంది. సత్యనారాయణమ్మ, రేంజ్ అధికారిణి, హెచ్ఎండీఏ.

# వేసవికి ముందే ట్యాంకర్లకు గిరాకీ

హైదరాబాద్: వేసవికి ముందే మహానగరంలో జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లోనే గతేడాది కంటే 65 శాతం ట్యాంకర్లు బుకింగ్ పెరగడంతో జలమండలి అప్రమత్తమైంది. గతేడాది ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లో 38,500 జలమండలి ట్యాంకర్లు సరఫరా చేయగా ఈ ఏడాది అదే సమయానికి ఏకంగా 63,700 ట్యాంకర్లు బుక్



అయ్యాయి.ఎక్కడెక్కడ బుకింగ్ ఎక్కువగా ఉందో గుర్తించి ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. భూగర్భజలాలు వేగంగా తగ్గిన ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతుండటంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతున్నట్లు వెల్లడైంది. ప్రధానంగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, మాదాపూర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో బుకింగ్ పెరిగింది. ట్యాంకర్ డ్రైవర్లు అక్రమాలకు పాల్పడకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఇటీవల జలమండలి ఎండీ సమావేశమైనపుడు కూడా ట్యాంకర్ల అక్రమాలపై హెచ్చరించారు.

నిర్దేశిత గడువులోపు సరఫరా: ఎండీ ట్యాంకర్లను బుక్‌చేసుకుంటే నిర్దేశించిన గడువులోపు సరఫరా చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. గతేడాది ఫిబ్రవరి తొలి రెండు వారాల్లో నిర్దేశించిన గడువుకంటే 8వేల ట్యాంకర్లు ఆలస్యంగా సరఫరా అయినట్లు గుర్తించామన్నారు. ఈ సారి ట్యాంకర్లు 65 శాతం పెరిగినా నిర్దేశించి గడువుకంటే 240 ట్యాంకర్ల నీరు మాత్రం ఆలస్యంగా సరఫరా అయ్యాయన్నారు. ట్యాంకర్లు, ఫిల్లింగ్ పాయింట్లను పెంచినట్లు తెలిపారు.

చురకలు



## మెట్రో విస్తరణకు త'రుణం.. కేంద్రం అనుమతే కీలకం'

హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశకు నిధుల లభ్యత పెద్ద సమస్య కాదంటోంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్‌ఏఎంఎల్). ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి ఇస్తే అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలు నిధుల మంజూరుకు సుముఖంగా ఉన్నాయని మెట్రో వర్గాలు అంటున్నాయి. 2 కంటే తక్కువ శాతానికే రుణం మంజూరు చేయడంతోపాటు పదేళ్ల మారటోరియం, 30 ఏళ్లపాటు చెల్లింపులకు అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ ఆరంభమైన మొదటిరోజు నుంచే లాభాల్లో నడిచే ఆస్కారం ఉంటుందని హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

**పదేళ్లదాకా వెసులుబాటు**

జైకా వంటి సంస్థలు ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు ఇచ్చే రుణాలపై పదేళ్లపాటు మారటోరియం ఉంటుంది. అంటే రుణం పదేళ్ల వరకు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత 30 ఏళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. అప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నోరెట్లు పెరుగుతుంది. కాబట్టి తిరిగి



చెల్లింపులు పెద్ద భారం కావు అనేది మెట్రో వర్గాల మాట.

**రుణాలు ఎవరిస్తారంటే..**

మెట్రోరైలు రెండోదశలో 76.4 కి.మీ. మార్గానికి రూ.24,269 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు రూపొందించి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. ప్రాజెక్ట్ వ్యయంలో ఈక్విటీలో 30 శాతం రాష్ట్రం, 18 శాతం కేంద్రం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన దాంట్లో 48 శాతం అంటే రూ.11,693 కోట్లు రుణాల ద్వారా సమకూర్చుకోవాలనేది ప్రణాళిక. ఇంతపెద్ద మొత్తం రుణం తక్కువ వడ్డీకి తీసుకోవాలంటే అంతర్జాతీయ బ్యాంకులు జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటివైతేనే సాధ్యం. పలు అంతర్జాతీయ బ్యాంకులు నిధులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు హెచ్‌ఏఎంఎల్ అధికారులు తెలిపారు. కేంద్రం సావరిన్ గ్యారంటీ ఇవ్వాలి. ఏ బ్యాంకు నుంచి ఎంత రుణం తీసుకోవాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. మిగిలిన 2 శాతం ప్రాజెక్టు వ్యయాన్ని పీపీపీ ద్వారా సేకరిస్తారు.

## కూల్చేటివి.. కూల్చనివి

హైదరాబాద్ : చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కుల సంరక్షణ కోసం ఈ ఏడాది జులై 19న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ తేదీనే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల భవిష్యత్తును నిర్ణయిస్తోంది. జులై నెలకు ముందు కట్టిన వినియోగంలోని ఇళ్లను కూల్చబోమని, తర్వాత కట్టిన నిర్మాణాలను కూల్చుతామని కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై హైడ్రా తీసుకున్న విధానపర నిర్ణయాలను వివరిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

**వీటిని కూల్చుతాం..**రద్దయిన అనుమతులు చూపుతూ జులై తర్వాత నిర్మాణ పనులు కొనసాగిన ఇళ్లను కూల్చుతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించి పేదలకు విక్రయిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలుంటాయి. ఎలాంటి నిర్మాణమైనా, ఏ దశలో ఉన్నా.. కోర్టు నుంచి కూల్చివేత ఆదేశాలు వచ్చినప్పుడు ఆగేది లేదు.

హైడ్రా ఏర్పాటయ్యాక చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడంతో పాటు అనుమతి ఇచ్చిన అధికారిపై కేసు నమోదు చేస్తాం.

ఎలా గుర్తిస్తామంటే.. క్షేత్రస్థాయి పరిశీలన, గూగుల్ ఎర్త్ పటాలతో నిర్మాణం జులై నాటికి పూర్తయిందా, లేదో ప్రాథమికంగా గుర్తిస్తాం. లైడార్ సర్వే, రిమోట్ సెన్సింగ్ సర్వేలతో భూముల పటాలను పరిశీలిస్తూ సెన్సార్ల సాయంతో ఆక్రమణలను గుర్తించేందుకు జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రంతో ఒప్పందం చేసుకుంటున్నాం. పునరుజ్జీవానికి ప్రతిపాదనలు: ఇప్పటికే కూల్చివేతలు పూర్తయిన 12 చెరువులకు పునరుజ్జీవం కల్పించే ప్రతిపాదనలను పంపాం. 200 ఎకరాల భూమిని ఆక్రమణల విడిపించాం. 5వేల ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి.

## ఉదయమే గిర్రుమంటోంది



హైదరాబాద్: విద్యుత్తు డిమాండ్ సాధారణంగా లైటింగ్ లోడ్ అధికంగా ఉండే సాయంత్రం వేళల్లో నమోదవుతుంది. చలికాలంలో నగరంలో ఇందుకు భిన్నంగా ఉదయం పూట గరిష్ఠంగా ఉంటోంది. ఆ సమయంలో పిల్లలు పాఠశాలలకు, పెద్దలు కార్యాలయాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. ఉదయాన్నే మోటార్లు, హీటర్ల వాడకం అధికంగా ఉండటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. **15 నిమిషాలకోసారి నమోదు..**విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రతి 15 నిమిషాలకు కరెంట్ డిమాండ్ రీడింగ్స్‌ను నమోదు చేస్తుంది. జీహె చ్‌ఎంసీలో ఈ నెల 16న నమోదైన గణాంకాల ప్రకారం.. ఉదయం 7.30 నుంచి 7.45 గంటల మధ్య గరిష్ఠంగా 2,929 మెగావాట్లు, సాయంత్రం 6 నుంచి 6.15 గంటల నడమ 2,900, తెల్లవారుజా మున 2.30 నుంచి 2.45 గంటల మధ్య 1,593 మెగావాట్లకు దిగువన డిమాండ్ ఉంటోంది.

# పైన చుక్‌చుక్.. కింద రయ్‌రయ్



హైదరాబాద్: మొదటిసారి డబుల్ డెక్కర్ పైవంతెనల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుపై ఇవి నాలుగు రానున్నాయి. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా విమానాశ్రయం వెళ్లే 36.8కి.మీ పొడవైన మెట్రో రైలు మార్గంతో వీటిని అనుసంధానిస్తారు. కొత్తగా నిర్మించే పైవంతెనల వద్ద మాత్రం రెండో అంతస్తులో మెట్రో ఉంటుంది. ఇందుకోసం పిల్లర్లను ఎత్తుగా నిర్మించి మెట్రో మార్గానికి వదులుతారు. ఈ విధమైన అనుసంధానంతో.. మెట్రో కారిడార్ నిర్మాణ వ్యయం కొంత మేర తగ్గుతుంది. రహదారిపై స్థలం కలిసి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుందని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఈ నాలుగు నిర్మాణాల అంచనా వ్యయం రూ.955కోట్లు. అందుకు సంబంధించి మెట్రో రైలు సంస్థ, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించే పనిలో ఉన్నాయి.

**స్థలం.. నిధులు సద్వినియోగం..**ప్రస్తుతమున్న రోడ్డు మార్గంపై పైవంతెనలను నిర్మిస్తే వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. పైవంతెన నిర్మించాక.. అదే రోడ్డుపై మెట్రో రైలు మార్గాన్ని నిర్మిస్తే.. తొలగిపోయిన ట్రాఫిక్ సమస్య మళ్లీ పుట్టుకొస్తుంది. ఉదాహరణకు.. బేగంపేట విమానాశ్రయం కూడలి. గతంలో కూడలిలో పైవంతెన నిర్మించారు. కొన్నేళ్లకు పైవంతెన పక్కన మెట్రో మార్గం కోసం పిల్లర్లను నిర్మించారు. దీంతో బేగంపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రోడ్డు మార్గం కుంచించుకుపోయింది. భవిష్యత్తులో మెట్రో రైలు మార్గం అవసరమున్న రహదారులపై డబుల్ డెక్కర్ పైవంతెనలను నిర్మిస్తే ప్రజాధనం, స్థలం సద్వినియోగం అవుతాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

**రెండు మార్గాల్లో ప్రతిపాదించినా..**

నగరం నుంచి ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే రెండు జాతీయ రహదారులపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. ప్యారడైజ్ కూడలి నుంచి సుచిత్ర కూడలి మీదుగా కండ్లకోయ వరకు, జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, అల్వాల్, తూముకుంట వరకు ఆరు లైన్ల పైవంతెనలను నిర్మించాలన్నది ప్రణాళిక. ఆయా మార్గాల్లో ఓఆర్‌ఆర్ వెలుపలి వరకు భవిష్యత్తులో మెట్రో సేవలను పొడిగించాలన్న ఆలోచనతో.. ఎలివేటెడ్ కారిడార్లతో మెట్రో మార్గాన్ని అనుసంధానిస్తామని సర్కారు అప్పట్లో ప్రకటించింది. డబుల్ డెక్కర్ పైవంతెనల మార్గానికి సంబంధించి హెచ్‌ఎండీఏ, మెట్రో రైలు సంస్థలు డిజైన్లపై కసరత్తు చేస్తున్నాయి.

**ఎక్కడెక్కడంటే..**

1) టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రినగర్, మందమల్లమ్మ కూడళ్లు.

2) ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్‌హాల్ మీదుగా

3) బండ్లగూడ-ఎర్రకుంట క్రాసు రోడ్డు కూడలి మీదుగా

4) మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ కూడళ్ల మీదుగా

**ప్రణాళిక లోపంతో..**ఎల్బీనగర్ కూడలి, బైరామల్‌గూడ కూడలి, ఒవైసీ జంక్షన్, చాంద్రాయ ణగుట్ట జంక్షన్, హైటెక్‌సిటీలోని కొత్తగూడ జంక్షన్, గచ్చిబౌలి చౌరస్తా, జేఎన్‌టీయూ కూడళ్లలో పైవంతెనలు నిర్మించారు. ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు ఎక్స్‌ప్రెస్‌వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఆయా మార్గాలన్నింటిలో మెట్రో సేవలను విస్తరిస్తామని గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ.. డీపీఆర్‌ను రూపొందించలేదు. రోడ్డు అభివృద్ధి పనుల్లో మెట్రో ప్రాజెక్టుకు స్థలం వదలాలన్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సూచనలను పట్టించుకోకపోవడం.. ప్రణాళికా లోపాలకు అద్దం పడుతోంది.

## అందని ద్రాక్షగా రాయితీ పరికరాలు




కరీంనగర్ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంలా తయారైంది రైతుల పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 7898 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేస్తున్న అన్నదాతలకు.. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి వారికి అవసరమైన రాయితీ విత్తనాలు, పరికరాలు అందించాల్సి ఉంటుంది. అదేమి లేకపోవడంతో ఉద్యానశాఖ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. రాయితీ పరికరాలైన డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 361 హెక్టార్లకు లక్ష్యం విధించింది. అయితే ఇప్పటివరకు 198.47 హెక్టార్లకు మాత్రమే మంజూరు చేశారు.

**మంజూరు ఇలా..**

పరికరాలకు అవసరమైన రైతులు తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఉద్యానశాఖ సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించి ఎన్ని పైపులు పడుతాయనే వాటిపై ఆరా తీస్తారు. రాయితీ పోను మిగతా డబ్బు ఎంతో చెప్పి సంబంధిత డ్రిప్ పైపులు సరఫరా చేసే సంస్థకు డీడీ తీయించి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా జరగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కానరాని అవగాహన సదస్సులు**

ఉద్యానశాఖ అధికారులు కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి.. శాస్త్రవేత్తల ద్వారా వారికి అవసరమైన సలహాలు, సూచనలు, రాయితీ విత్తనాలు, ఎరువులు, పరికరాలు, పంటకు తెగుళ్లు సోకితే ఏ పురుగుమందు వేయాలనేది అవగాహన కల్పించాలి. అయితే సదస్సులు నిర్వహించినట్లు కాగితాలకే పరిమితమవుతోందని రైతులు వాపోతున్నారు.

**దరఖాస్తు విధానం**

రాయితీ పరికరాల కోసం %www.tgmip.com% వెబ్‌సైట్‌లో పట్టాదారు పాస్‌బుక్, రైతు ఫొటో, ఆధార్, తాజా 1బి పహణీతో దరఖాస్తు చేయాలి. ఒకసారి రాయితీ పొందిన రైతులు ఏడేళ్ల వరకు తిరిగి పొందటానికి అనర్హులు. ఉన్నత వర్గానికి చెందిన రైతులకు 80 శాతం, బీసీలకు 90శాతం రాయితీతో అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ కల్పిస్తారు.


**డీడీలు పెండింగ్‌లో లేవు** గతంలో డీడీలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం మా కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఏమి లేవు. రైతులకు వంద శాతం న్యాయం చేస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసరావు, డీడీ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ

**నేనే కొనుగోలు చేసుకున్నా..**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఎనిమిది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా ఏదో కారణం చెప్పి పంపించేవారు. విసిగిపోయి రూ.1.60 లక్షలతో డ్రిప్ కొనుగోలు చేసి కూరగాయల తోటకు ఏర్పాటు చేసుకున్నా. మంద తిరుపతి, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణం

## పాలన మారి.. వార్డులో అధికారి

నల్గొండ : తీసుకున్న నిర్ణయంతో ప్రజల వద్దకే పురపాలన రానుంది. వార్డుకో కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి పట్టణ ప్రజలకు అవసరమైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్‌కి ఓ అధికారిని నియమించి అన్ని రకాల సేవలు అక్కడి నుంచే అందించడం విజయవంతంగా కొనసాగుతోంది. వీఆర్ఏల సర్దుబాటులో భాగంగా నల్గొండ జిల్లాలోని 8 పురపాలికల్లో సుమారు 62 మందిని వార్డు అధికారులుగా నియమించింది. తాజాగా కొత్త పురపాలికల్లో సైతం వార్డు అధికారుల పోస్టులు మంజూరు చేసి, గ్రూప్-4 ద్వారా నియమితులైన 77 మందిని నల్గొండ జిల్లాకు కేటాయించడంతో వారిని జిల్లా కలెక్టర్ 8 పురపాలికలకు కేటాయించారు. 60 రోజుల్లోపు వారంతా తమకు కేటాయించిన పురపాలికల్లో నియామక ఉత్తర్వుల ప్రతులను అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వార్డు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. పారిశుద్ధ్య సేవలు, సిబ్బందిపై పర్యవేక్షణ, మంచినీటి సరఫరా, ఆస్తి పన్నులు



వసూళ్లు, అక్రమ నిర్మాణాల గుర్తింపు, వాటిపై చర్యలు, వార్డు పరిధిలో ఆసరా పింఛన్ల పంపిణీ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించనున్నారు. వార్డు కార్యాలయంలో ప్రజలు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యతలు నిర్వహించనున్నారు.

## అర్ధంతర పనులు.. రెట్టింపు కష్టాలు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 'మన ఊరు-మన బడి' పథకం కింద జిల్లాలోని 191 పాఠశాలల్లో సుమారు రూ.250 కోట్లతో పనులు ప్రారంభించినా నిధుల కొరతతో నిలిచిపోయాయి. ఇటీవల అమ్మ ఆదర్శ బడి కింద చేపట్టిన పనులదీ ఇదే పరిస్థితి. **12 రకాలు..** భారాస ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి పథకం కింద తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు గదులు, వంట గది, ప్రహరీ, భవనాలకు రంగులు వేయడం, విద్యుత్తు, ఫర్నిచర్, పచ్చదనం పెంపు, భోజన గది, డిజిటల్ ల్యాబ్.. ఇలా 12 రకాల పనులు ప్రారంభించారు. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సందిగ్ధం నెలకొంది. నిధులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 545 చోట్ల మౌలిక వసతుల కల్పనకు రూ.29.63 కోట్లతో చేపట్టిన పనులు కూడా వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తి పనులతో బోధనకు ఇబ్బంది ఏర్పడుతోంది. పలు పాఠశాలల్లో ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

సుల్తానాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు రూ.14.50 లక్షలు వెచ్చించి పలు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో ఆపేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో, వరండాలో, చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోంది. దుర్గంధంతో విద్యార్థులకు అసౌకర్యంధర్మారం ఆదర్శ పాఠశాలకు రూ.13.61 లక్షలు మంజూరు కాగా మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతు, కిటికీలు, వెంటిలేటర్లకు దోమల జాలీలు, కుళాయిలు ఏర్పాటు చేయించారు. వసతిగృహం ముందు సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టగా ప్లాస్టరింగ్ చేసి పైపులైనుతో అనుసంధానించాల్సి ఉంది. పక్కనున్న తరగతి గదుల్లోకి భరించలేదని దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు తెలిపారు.

మరమ్మతు మమఇద్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.4.40 లక్షలు మంజూరు కాగా పాత మరుగుదొడ్లకే మరమ్మతులు చేసి, ఎంబీ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తలుపులు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా, తూతూ మంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి.

**రికార్డు చేసినా పైసా రాలే!** వడ్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో ఏడాది కిందట పనులు అర్ధంతరంగా వదిలేశారు. రూ.15 లక్షలకు ఎంబీ రికార్డు చేసినా పైసా రాలేదని గుత్తేదారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులతో భోజన సమయంలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. కలెక్టర్ ఆదేశించినా అంతే! బేగంపేట ఉన్నత పాఠశాల భోజనశాలలో విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉన్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, మైదానం సరిచేయడం వంటి పనులు జరగాల్సి ఉంది. గతంలో కలెక్టర్ శ్రీహర్ష పాఠశాలను సందర్శించి పనుల పూర్తిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.16 లక్షలు మంజూరు చేసినా గుత్తేదారు సమస్యతో పనులు జరగడం లేదు.

పిల్లర్లతో వదిలేశారు! గోపాల్‌పూర్(పెద్ద ఓదాల) ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించారు. తిరిగి పిల్లర్ల వరకు నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. అడవిసోమన్‌పల్లి యూపీఎస్‌లో వంటగది, భవనం ప్లాస్టరింగ్, సింక్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అర్ధంతర పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

నోరు తెరిచిన సంపులుమండలంలోని 29 పాఠశాలల్లో పనులు చేపట్టగా కొన్ని చోట్ల పూర్తయినా చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. జిల్లెల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సంపు వద్ద పై కప్పు అసంపూర్తిగా వదిలేశారు. లక్కారం పంచాయతీ కాశిపల్లి బడిలో సంపుపై కప్పు వేయకపోవడంతో ఉపాధ్యాయుడు తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు కుక్కలగూడూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణం చేపట్టగా బిల్లులు రాక పనులు ఆగిపోయాయి. గోడల వరకు పనులు చేసి, పైకప్పు వేయకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద బోరు మోటారు నుంచి ట్యాంకు వరకు పైపులైను అనుసంధాన పనులు, వాష్‌బేసిన్‌కు నల్లాల కనెక్షన్‌తో పాటు టైల్స్ పనులు చేయాల్సి ఉంది.

## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సుమారు రూ. కోటి వ్యయంతో కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తేవడంతో పాటు నగరపాలక కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. నగరపాలక నిర్వహణపై సమీక్షించిన జిల్లా పాలనాధికారి ఈ మేరకు నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులకు మార్గదర్శనం చేశారు. సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులు నగరపాలక కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉన్నారు. వారిని తిరిగి యథావిధిగా పారిశుద్ధ్య విభాగంలోకి తీసుకొని పనులు చేయించాలని, నూతన వాహనాలను సైతం వాడుకలోకి తేవాలన్నారు. తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సంస్కరిస్తే ప్రయోజనకరం**

రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో మొత్తం 447 మంది ఒప్పంద కార్మికులు ఉండగా అందులో డ్రైవర్లు, డ్రెయిన్ క్లీనర్లు, స్వీపర్లు, చెత్త ఎత్తే కార్మికులు ఉన్నారు. వీరిలో కేవలం 192 మంది పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణలో వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలపై విధుల్లో ఉన్నారు. రామగుండం నగరపాలికలో ప్రస్తుతం 14 ట్రాక్టర్లు, 50 ఆటో ట్రాలీలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా ట్యాంకర్లు, బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు, బొలెరో వాహనాలున్నాయి. వీటిపై మొత్తం 100 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. చెత్త సేకరణ విభాగంలో కొందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు ఉన్నారు. అలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లయితే కార్మికుల సంఖ్య పెరగకుండానే నూతనంగా కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. నగరపాలక కార్యాలయంలో పనిచేస్తున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవడంలో కార్మికుల కొరత సైతం తీరే అవకాశం ఉంది. పాత ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు సైతం తరచూ మొరాయిస్తుండటంతో ఆయా డివిజన్లలో చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను వినియోగంలోకి తేవడంతో పాటు పాత వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తే చెత్త సేకరణ నిత్యం జరిగే అవకాశముంది.

# ఆక్రమణ చిక్కు.. అందుకోండి హక్కు!

అనకాపల్లి : ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం పథకాన్ని గత నెల 29న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జీవో నం.30 జారీ చేసింది. ఈ పథకం పేద, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. జిల్లావ్యాప్తంగా క్రమబద్ధీకరణ చేయాల్సిన గృహాలు వేల సంఖ్యలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో ఏళ్ల తరబడి పట్టాల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఇది సువర్ణ అవకాశమే!

క్రమబద్ధీకరణ పథకం 2019 అక్టోబరు 15 ముందు జరిగిన ఆక్రమణలకు సంబంధించి మాత్రమే వర్తిస్తుంది. ఆక్రమిత ప్రభుత్వ స్థలంలో పక్కా గృహం నిర్మించుకుంటే ఈ పథకంలో భాగంగా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. 150 గజాల పైన ఉంటే నిర్ణీత ఫీజు చెల్లించాలి. మహిళలు పేరున పట్టా మంజూరు చేస్తారు. ఖాళీ స్థలం, గడ్డితో ఏర్పాటు చేసుకున్న గుడిసెలకు పథకం వర్తించదు. ఇప్పటివరకు ప్రభుత్వ స్థలం, పక్కా ఇళ్లు తీసుకుని ఉండకూడదు. ఏడాదికి ఆదాయం గరిష్ఠంగా రూ. 1.2 లక్షలలోపు ఉండాలి. వ్యవసాయ భూమి పది ఎకరాలు లేదా మూడు ఎకరాల తడి భూమి కంటే ఎక్కువ ఉంటే ఈ పథకానికి అనర్హులు. ఆదాయపు పన్ను చెల్లించిన, నెలవారీ 300 యూనిట్లు విద్యుత్తు కంటే ఎక్కువ ఉన్నా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా పథకం వర్తించదు. క్రమబద్ధీకరణకు రుజువు పత్రాలు సమర్పించాలి. లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తరవాత యాజమాన్య హక్కులు జారీ చేస్తారు. లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన స్థలాలు క్రమబద్ధీకరణ ఉండదు.

ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15 కన్నా ముందు నిర్మించుకున్న ఇళ్లనే క్రమబద్ధీకరించనున్నారు. దీనికి గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**అప్పుడు 100- ఇప్పుడు 150**

తెదేపా అధికారంలో ఉండగా 2017-2019 మధ్య కాలంలో ఆక్రమణలు క్రమబద్ధీకరించారు. అప్పట్లో వంద గజాల్లోపు స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తే, ఇప్పుడు 150 గజాలకు పెంచారు. తాజాగా విడుదలైన ఉత్తర్వులతో జిల్లా వ్యాప్తంగా కనీసం పది వేల మంది వరకు లబ్ధి పొందే అవకాశం ఉంది.

**అర్హుల ఎంపిక...**

దరఖాస్తుల స్వీకరణకు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఉంది. డివిజన్ స్థాయిలో ఆర్డీఓ/సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ మండలాల వారీగా వచ్చే దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి క్రమబద్ధీకరిస్తారు. జిల్లా సంయుక్త కలెక్టర్, కలెక్టర్ ఆయా ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

**ఫీజులో రాయితీ**

151 గజాల నుంచి 300 గజాల వరకు ఆక్రమించుకున్న బీపీఎల్ (దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారు) కుటుంబాలు స్థల క్రమబద్ధీకరణకు మార్కెట్ విలువలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తారు. అదే ఏపీఎల్ కుటుంబాలు అయితే మార్కెట్ విలువలో 15 శాతం చెల్లించడంతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా చెల్లించాలి. 301 గజాల నుంచి 450 గజాల వరకు ఉన్న ఆక్రమణలకు సంబంధించి బీపీఎల్ కుటుంబాలు మార్కెట్ విలువ పూర్తిగా చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుంది. అదే ఏపీఎల్ కుటుంబాలు మార్కెట్, రిజిస్ట్రేషన్ రుసుములు పూర్తిగా చెల్లించాలి. 450 గజాలకు పైబడిన ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి మార్కెట్ విలువ కన్నా అయిదు రెట్లు అధికంగా చెల్లించాలి. ఒక వేళ ఆక్రమణలు క్రమబద్ధీకరించుకోకపోతే... వాటిని తొలగించాల్సి ఉంటుంది.

# విమ్స్‌లో..లోపం ఎక్కడుంది?

విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు మెరుగైన వైద్య సేవలకు విశాఖపైనే ఆధారపడుతున్నారు. దీంతో కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో నిత్యం రద్దీ నెలకొంటుంది. ఇలాంటి సమయంలో కేజీహెచ్‌కు ప్రత్యామ్నాయంగా విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్) మారాల్సిన అవసరముంది. ఆరిలోవ హెల్త్‌సిటీకి వెళ్లే మార్గంలో కీలక ప్రాంతంలో ఆసుపత్రిని నిర్మించారు. అత్యాధునిక వైద్య సామగ్రి అందుబాటులో ఉన్నా కొన్ని విభాగాల్లో లక్ష్యానికి తగ్గట్టుగా సేవలందట్లేదు. కేజీహెచ్, ఈఎన్టీ, నేత్ర, మానసిక ఆసుపత్రుల్లో సరిపడా స్టాఫ్‌నర్సులు లేక రోగుల సంరక్షణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విమ్స్‌లో సిబ్బంది కొరత లేకున్నా నిబద్ధతతో పనిచేయట్లేదనే విమర్శలున్నాయి.

ఒకేసారి చేరడంతో: విమ్స్‌లో 200 మందికి పైగా స్టాఫ్‌నర్సులు, మరో 180 మంది ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలున్నారు. జిల్లాలో అత్యధికంగా స్టాఫ్‌నర్సులు ఇక్కడే పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి 15




మందిని ఈఎన్టీ ఆసుపత్రికి కేటాయించారు. వారందరినీ ఒకేసారి విధుల్లోకి తీసుకున్నారు. దీంతో ఎవరికైనా ఫ్లోర్ ఇన్‌ఛార్జి, షిఫ్ట్ ఇంఛార్జి బాధ్యతలు అప్పగిస్తే కొందరు ముభావంగా పనిచేస్తున్నారు. ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తరచూఫిర్యాదులందుతున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు దాదాపు 50 వరకు ఓపీ వస్తుంది. ఆ సమయంలో నర్సింగ్ సిబ్బంది సరిగా స్పందించట్లేదనే ఆరోపణలున్నాయి.

**దృష్టి పెట్టిన ప్రభుత్వం:** విమ్స్‌లో వైద్య సేవల్లో లోపాలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు. విధుల్లో స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్, ఇతర విభాగాల సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపైనా వివరాలు సేకరించారు. పలు అంశాలపై ఆసుపత్రి అధికారుల నుంచి వివరణ కోరారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

**పనిచేయకుంటే చర్యలు..**వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది నిబద్ధతతో పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం. సేవల్లో మెరుగుకు రాత్రి సమయాల్లో పర్యవేక్షణ చేపడుతున్నాం. అవసరమైన రోగులకు ఓపీ చీటీ ఇచ్చిన తర్వాత 30 నిమిషాల్లో ఐపీగా మార్చాలని ఆదేశాలిచ్చాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ఈ అంశాలను ప్రభుత్వానికి నివేదించాం. డా.కె.రాంబాబు,డైరెక్టర్, విమ్స్

# జైకా పనులకు పచ్చజెండా



చిత్తూరు : వైకాపా హయాంలో జలవనరుల శాఖ నిర్లక్ష్యానికి గురైంది.. చెరువులు, జలాశయాల పునరుద్ధరణ పనులను నాటి పాలకులు నిర్లక్ష్యంగా అటకెక్కించారు.. తెదేపా ప్రభుత్వం చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోగా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సహకారంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేపట్టిన కృష్ణాపురం, అరణియార్ జలశయాల అభివృద్ధి పనులతో పాటు 76 చెరువుల అభివృద్ధి పనులు గాలికొదిలేశారు.. ఫలితంగా ఆయకట్టుకు నీరందని పరిస్థితి.. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జైకా పనులు పట్టాలెక్కించేందుకు దృష్టి సారించింది.. ఆగిపోయిన పనులు వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. ఈ ఏడాది మార్చి 30 లోగా పనులు పూర్తిచేయాలని గడువు ఉన్నా మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**చేపట్టిన పనులివే..** గతంలో తెదేపా పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 33 ప్యాకేజీల కింద 65 చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కార్వేటినగరం మండలంలో కృష్ణాపురం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, పిచ్చాటూరు మండలం అరణియార్ ప్రాజెక్టుకు రూ.35 కోట్లు తెచ్చారు. ఈ రెండింటితో పాటు.. చిత్తూరు జిల్లాలో 41 చెరువులు, తిరుపతి జిల్లాలో 24 చెరువుల అభివృద్ధికి నిధులు తెప్పించారు.

**జైకా లక్ష్యం గాలికి..** 2019లో రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి చెరువులు, జలాశయాలకు గ్రహణం పట్టింది. తెదేపా పాలనలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పాటు నీరు-చెట్టు బిల్లులు ఇవ్వలేదు. జైకా పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోవడంతో ఈ పథకం లక్ష్యాలను పూర్తిగా విస్మరించారు నాటి వైకాపా పాలకులు. ఐదేళ్లలో కొన్ని పూర్తిస్థాయిలో, మరికొన్ని అర్థాంతరంగా ఆగిపోయాయి.

**17 పనులు రద్దు..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జైకా పనులపై దృష్టి సారించి ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించని వాటి వివరాలు సేకరించింది. 17 పనులు రద్దు చేసింది. మరో ఐదింటికి గుత్తేదారును తప్పించింది. పురోగతిలో ఉన్న 48 పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది.

**పనులకు అనుమతి..-** వెంకటేశ్వరరాజు, ఎస్ఈ, జలవనరుల శాఖ

జైకా పథకంలో పెండింగ్‌లో ఉన్న పనులు మార్చి నెలాఖరు లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒకవేళ పనులు అవసరమైతే రెండేళ్లు గడువు పొడిగిస్తామని పేర్కొంది. దీనికి సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

జిల్లాల వారీగా జైకా పనులు

చిత్తూరు

చేపట్టిన పనులు: 41

విలువ (రూ.కోట్లలో): 38.18

తిరుపతిజి

చేపట్టిన పనులు 24

విలువ (రూ.కోట్లలో): 42.36

# పరిహారం.. పితలాటకం



తిరుపతి-చెన్నై హైవే పనుల్లో భాగంగా పుత్తూరు మండలం కనకంపాళ్యానికి చెందిన శ్రీకర్‌కు పది సెంట్ల భూమిని తీసుకున్న అధికారులు పరిహారాన్ని పక్కనున్న మరో రైతు ఖాతాలో జమ చేశారు. తనకు పరిహారం అందే వరకు ఈ స్థలంలో ఉన్న హెూటల్‌ను తొలగించేది లేదని రైతు చెబుతున్నారు. పొరపాటును ఎలా సరిదిద్దాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు.

ఇదే గ్రామానికి చెందిన ఓ విశ్రాంత డీటీకి చెందిన 30 సెంట్ల భూమికి ఇవ్వాల్సిన పరిహారాన్ని సైతం పక్కనున్న రైతు ఖాతాలో జమ చేశారు. తనకు న్యాయం చేయాలని ఆయన అధికారులకు విన్నవించినా ఇదే పరిస్థితి తిరుపతి-చెన్నై జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 2012లో చేపట్టిన భూసేకరణలో రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారుగా ఇవ్వడంతో పరిహారం వాస్తవ బాధితుల ఖాతాలకు కాకుండా ఇతరులకు జమైంది. న్యాయం కోసం బాధితులు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం పనులు జరుగుతుండటంతో రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పుత్తూరు మండలం మరాఠీగేటు నుంచి పరమేశ్వరమంగళం రెవెన్యూ పరిధిలోని కైలాసపురం వరకు 2012లో భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. రెవెన్యూ అధికారుల తప్పిదంతో 20 మందికి సంబంధించి నగదు పక్క పొలాల్లోని రైతుల ఖాతాల్లో జమైంది. వారు నగదు ఖర్చు చేయడంతో అధికారులు వెనక్కు తీసుకోలేకపోతున్నారు. వడ్డీతో సహా చెల్లించాలని.. 2012లో పరిహారం దక్కని రైతులు.. తమకు వడ్డీతో సహా చెల్లించాలని కోరుతున్నారు. అప్పట్లో భూమి ధర చాలా తక్కువ అని, ప్రస్తుతం అమాంతం పెరిగిందని, ఈ మేరకు తమకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ మొత్తం రెట్టింపు ఉండటంతో అధికారులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. **అందరికీ న్యాయం చేస్తాం..- జీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు**అన్ని విషయాలను జిల్లా అధికారులకు నివేదించాం. వారు తీసుకునే నిర్ణయం మేరకు రైతులందరికీ పరిహారం అందుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# ఆక్రమణలు విశ్వమంత

కర్నూలు : నగర శివారులో రాయలసీమ విశ్వవిద్యాలయానికి చెందిన రూ.30 కోట్ల విలువైన భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వర్సిటీకి సమీపంలో నంద్యాల రహదారి ఆనుకుని ఉన్న భూమి, పసుపల గ్రామ రహదారికి ఆనుకుని ఉన్న మరో స్థలం ఆక్రమణలకు గురయ్యాయి. నంద్యాల రహదారి ఆనుకుని బి.తాండ్రపాడు గ్రామ పరిధిలోని సర్వే నంబరు 15లో 1.82 ఎకరాల భూమిలో ఇటీవల ఓ షెడ్డు వెలిసినట్లు వర్సిటీ అధికారులు గుర్తించారు. ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో చాలా భాగం ఆక్రమణలకు గురైంది. అప్పట్లో ఏర్పాటుచేసిన హద్దు రాళ్లను కొందరు తొలగించారు. దీంతో తమ స్థలానికి హద్దులు ఎక్కడున్నాయో కూడా వర్సిటీ అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది.

**ఏళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేసి..**

నంద్యాల రహదారి ఆనుకుని ఉన్న స్థలంలో వీసీ బంగ్లా నిర్మించేందుకు పదేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. భూమి సేకరించినప్పుడు నష్ట పరిహారం చెల్లించడంలో అన్యాయం జరిగిందంటూ ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోకపోవడంతో భూమి ఆక్రమణలకు గురైంది. ఆక్రమణదారుల వెనుక వైకాపాకు చెందిన పెద్దల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వారికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో నాటి అధికారులు వివరాలను గోప్యంగా ఉంచారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఆ స్థలం విలువ రూ.20 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో వర్సిటీ భూమికి హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దారుకు



ఫిర్యాదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**లేఅవుట్ వేసి..**

నంద్యాల రహదారి నుంచి పసుపల వెళ్లే మార్గంలో వర్సిటీ గేటుకు ఎదురుగా సుమారు ఎకరా వరకు వర్సిటీకి స్థలం ఉంది. గతంలో బోధనేతర సిబ్బంది అవసరాల నిమిత్తం దీనిని వినియోగించుకోవాలని సూచించారు. వారు డబ్బులు సమకూర్చుకోకపోవడంతో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేకపోయారు. వర్సిటీ అధికారులు సైతం ఈ స్థలం కాపాడుకునే రక్షణ చర్యలు చేపట్టలేదు. సుమారు రూ.10 కోట్ల వరకు విలువైన ఆ స్థలంపై కొందరి కన్ను పడింది. ఇటీవలికాలంలో ఆ భూమిలో లేఅవుట్ కూడా వేశారు. అందులో ఓ తాత్కాలిక షెడ్డు నిర్మించారు. ఈ విషయమై ఆర్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.విజయ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ నంద్యాల రహదారికి ఆనుకుని ఉన్న వర్సిటీ స్థలంలో ఆక్రమణలున్న విషయం వాస్తవమేనని, దీనిపై గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వర్సిటీ స్థలానికి హద్దులు గుర్తించి అప్పగించాలని మరోసారి లేఖ రాయాలని నిర్ణయించామని చెప్పారు.

# కన్ను చూసిన చోట పాగా.. అక్రమార్కుల చేతిలో జాగా

పెందుర్తి : విశాఖలో భూములకున్న విలువ నేపథ్యంలో వాటిపై కన్నేసి కొందరు ఆధీనంలోకి తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటివి ఎక్కువగా జరిగాయి. మధురవాడ, కొమ్మాది, గాజువాక, పెందుర్తి, విశాఖ గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఉన్నాయి. 2004-07 మధ్య జరిగిన రికార్డుల తారుమారు వ్యవహారంలో ఏడుగురు అధికారులను ప్రభుత్వం విచారించనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో గత కొన్నేళ్లుగా ఆక్రమణల్లో ఉన్న భూముల స్వాధీనానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు. మాజీ మంత్రి ప్రమేయంతో...: ఓ మాజీ మంత్రి అండదండలతో విశాఖలోని విలువైన భూములను కొట్టేశారు. అతని అనుయాయులను రంగంలోకి దించి కబ్జాలకు పాల్పడ్డారు. కొమ్మాదిలో సర్వే నంబరు 28-2లో పదెకరాల స్థలం అలానే పరాధీనమైంది. దీనిపై యంత్రాంగం త్వరితగతిన విచారణ జరపాల్సి ఉన్నా అటువైపే చూడడం లేదు. పరదేశిపాలెం సర్వే నంబరు 187-1లోని అయిదెకరాల ప్రభుత్వ భూమిని కొట్టేశారు. గతంలో పత్రాలు తారుమారు చేసి ఏకంగా దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేశారు.

**చెలరేగిపోతున్న మాయగాళ్లు**

ఆనందపురం మండలం నీళ్లకుండీల కూడలిలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పెందుర్తి మండలం రాజు చెరువు పరిసరాలను కొందరు దర్జాగా ఆక్రమించేశారు. ఈ ఆక్రమణలపై అధికారులకు సమాచారమున్నా అటు వైపుగా దృష్టిసారించడం లేదు.

నగరంలో అనేక చోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఫిర్యాదులందిన వెంటనే చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం కాలయాపన చేస్తోంది. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడంలోనూ జాప్యం కనిపిస్తోంది.

**దొంగ పత్రాల ముఠా..**

దొంగ పత్రాలు సృష్టించే ముఠా విశాఖలో ఉంది. పాత డాక్యుమెంట్లను పోలిన దస్త్రాలను సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో అధిక సంఖ్యలో ఇలా పత్రాలను సృష్టించారన్న ఆరోపణలున్నాయి. వీటిని ఫోరెన్సిక్ విచారణలో తప్ప గుర్తించలేని విధంగా రూపొందిస్తున్నారు. గత అయిదేళ్లలో రిజిస్ట్రేషన్‌శాఖకు దొంగ రిజిస్ట్రేషన్లపై 500లకు పైగా ఫిర్యాదులొచ్చాయి. ఎండాడలో విలువైన అయిదెకరాల స్థలానికి ఇలానే తప్పుడు పత్రాలు సృష్టించారు. అలాగే కూర్మన్నపాలెంలో గతంలో ప్రభుత్వానికి ఇచ్చేసిన స్థలానికి వారసులమంటూ తప్పుడు పత్రాలతో దరఖాస్తు చేశారు.మధురవాడలో ఓ చోట మాజీ ఎమ్మెల్యే ఒకరు గతంలో కొనుగోలు చేసిన జిరాయితీ స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించారు. ఆ తరువాత రోడ్డు కూడా నిర్మించేశారు. అలాగే ఇక్కడ మరో సర్వే నంబర్‌లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలంలో మూడెకరాలు ఆక్రమణకు గురైంది. కొమ్మాది శివారున అటవీశాఖ స్థలం మీద కన్నేసిన ఓ వ్యక్తి తన గుప్పిట్లో పెట్టుకున్నారు. ఇదే ప్రాంతంలో మరో రెండెకరాల్లో ఆక్రమణలున్నాయి. మరో సర్వే నంబరులో ప్రభుత్వ స్థలంలో ఏకంగా నిర్మాణాలు చేపట్టేశారు.

# పేదల గూడు.. దక్కనుంది చూడు..!


ప్రభుత్వ భూముల్లో వెలసిన ఆక్రమణల క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అభ్యంతరం లేని 150 గజాల్లోపు స్థలాల్లోని ఆక్రమణలను ఉచితంగా, 150 గజాలకు పైబడిన స్థలాల్లో ఆక్రమణలను నిర్ణీత రుసుముతో క్రమబద్ధీకరించనుంది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ 30 అమల్లోకి వచ్చింది.

అప్పుడు 100... ఇప్పుడు 150: తెదేపా అధికారంలో ఉండగా 2017-2019 మధ్య కాలంలో ఆక్రమణలు క్రమబద్ధీకరించారు. అప్పట్లో వంద గజాల్లోపు స్థలాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తే, ఇప్పుడు 150 గజాలకు పెంచారు. తాజాగా విడుదలైన ఉత్తర్వులతో జిల్లా వ్యాప్తంగా కనీసం పది వేల మంది వరకు లబ్ధి పొందే అవకాశం ఉంది.

2019 అక్టోబరు 15 కన్నా ముందు వెలసిన ఆక్రమణలను మాత్రమే క్రమబద్ధీకరించనున్నారు. క్రమబద్ధీకరణకు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి.

**ఫీజులో రాయితీ**

151 గజాల నుంచి 300 గజాల వరకు ఆక్రమించుకున్న బీపీఎల్ (దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారు) కుటుంబాలు స్థల క్రమబద్ధీకరణకు మార్కెట్ విలువలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తారు. అదే ఏపీఎల్ కుటుంబాలు అయితే మార్కెట్ విలువలో 15 శాతం చెల్లించడంతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా చెల్లించాలి.



301 గజాల నుంచి 450 గజాల వరకు ఉన్న ఆక్రమణలకు సంబంధించి బీపీఎల్ కుటుంబాలు మార్కెట్ విలువ పూర్తిగా చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుంది. అదే ఏపీఎల్ కుటుంబాలు మార్కెట్, రిజిస్ట్రేషన్ రుసుములు పూర్తిగా చెల్లించాలి. 450 గజాలకు పైబడిన ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి మార్కెట్ విలువ కన్నా అయిదు రెట్లు అధికంగా చెల్లించాలి. ఒక వేళ ఆక్రమణలు క్రమబద్ధీకరించుకోకపోతే... వాటిని తొలగించాల్సి ఉంటుంది.అర్హుల ఎంపిక: దరఖాస్తుల స్వీకరణకు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు ఉంది. డివిజన్ స్థాయిలో ఆర్డీఓ/సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు మండలాల వారీగా వచ్చే దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి క్రమబద్ధీకరిస్తారు. జిల్లా సంయుక్త కలెక్టర్, కలెక్టర్ ఆయా ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

గతంలో ఇలా....296 జీఓ ప్రకారం గతంలో 83,891 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 46,520 మందికి పట్టాలు జారీ చేశారు. వారికి కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాల్సి ఉంది. 550 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. 36,821 దరఖాస్తులను అప్పట్లో తిరస్కరించారు. 388 జీఓ ప్రకారం 53,347 మంది దరఖాస్తు చేయగా... 8,687 మందిని అర్హులుగా గుర్తించారు. 7,030 మంది రుసుము చెల్లించడంతో పట్టాలు జారీ చేశారు.

# సూక్ష్మ సేద్యం.. సాగు ఫలం

కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం సూక్ష్మ సేద్యాన్ని చిన్నచూపు చూసింది. రాయితీ పథకాలను దూరం చేసింది. ఫలితంగా వేలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూక్ష్మ సేద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకంలో భాగంగా బిందు, తుంపర సేద్య పరికరాలను రాయితీపై అందించేందుకు చర్యలు చేపట్టింది. రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నూతన మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి.

**పథకాన్ని అటకెక్కించి..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 10 లక్షల హెక్టార్ల మేర సాగు భూములున్నాయి. ఇందులో కేవలం 2 లక్షల నుంచి 3 లక్షల హెక్టార్లకు మాత్రమే నీటి వసతి ఉంది. అరకొరగా నీటి సౌకర్యం ఉండటం.. వర్షాధారంపై ఎక్కువ భూములు ఆధారపడి ఉండటంతో చాలామంది రైతులు సూక్ష్మ సేద్యం పరికరాల కోసం ఎదురుచూసేవారు. గత వైకాపా ప్రభుత్వం సూక్ష్మ సేద్య పథకాన్ని మూడేళ్లపాటు అటకెక్కించింది. దీంతో అన్నదాతలు రూ.లక్షలు ఖర్చు చేసి సొంతంగా పరికరాలు అమర్చుకోవాల్సి వచ్చింది. 2022లో ఈ పథకాన్ని ప్రకటించి 2022-23, 2023-24 సంవత్సరాల్లో నామమాత్రంగా అమలు చేసింది.



మరోవైపు రూ.కోట్ల మేర బకాయిలు పెట్టింది.

**లక్ష్యాలు కుదించి..**

2024-25 ఆర్థిక సంవత్సరంలో భాగంగా గత సెప్టెంబరులో కర్నూలుకు 15 వేలు, నంద్యాల జిల్లాకు 15 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్య వసతి కల్పించేలా ఆదేశాలు జారీ అయ్యాయి. లక్ష్యాలను ఆలస్యంగా నిర్దేశించడంతోపాటు ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరిన నేపథ్యంలో దానిని కుదించింది. ప్రస్తుతం జిల్లాకు 7 వేల హెక్టార్ల చొప్పున లక్ష్యాలు నిర్దేశించింది. ఇప్పటివరకు పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 6,746 హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాలు అందించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 40 రోజుల వ్యవధి మాత్రమే ఉంది.. ఈ నేపథ్యంలో మరో 2 వేల హెక్టార్లకు పెరిగే అవకాశముందని ఏపీఎంఐపీ అధికారులు పేర్కొంటున్నారు.

**ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం**

2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీని వర్తింపజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం 90 శాతానికి పరిమితం చేసింది. దీంతో తమ వాటా చెల్లించే స్థోమత లేకపోవడంతో వేలాది మంది రైతులు ముందుకు రాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీరికి వంద శాతం రాయితీ వర్తింపజేసేందుకు నిర్ణయించింది. వ్యవసాయ భూమి అయిదెకరాల్లోపు ఉన్న రైతులకు గరిష్ఠంగా రూ.2.18 లక్షల మేర రాయితీ లబ్ధి కల్పించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 30 వేల మంది రైతులకుపైగా ప్రయోజనం చేకూరనుంది.

# ఉపాధి చూపరు.. వలసలు ఆపరు

నంద్యాల : ఉపాధిహామీ పథకం కింద ఉమ్మడి జిల్లాలో కూలీలకు పూర్తిస్థాయిలో పనులు చూపడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిర్దేశించిన పనుల లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కానరావడం లేదు. ఒకవైపు నేతలు, అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నప్పటికీ పనులు జోరందుకోవడం లేదు. నిబంధనల ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో పనుల్లేక వేలాది మంది ప్రజలు వలస వెళ్తున్నారు. నంద్యాల జిల్లాలోనూ పలువురు పనుల కోసం ఇతర ప్రాంతాల బాటపట్టారు. వారికి ఉపాధి చూపడంలో సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

**కూలి పెంచడంలో నిర్లక్ష్యం**

దినకూలి రూ.300గా నిర్ణయించినా ఉమ్మడి జిల్లాలో కూలీలకు సగటున రూ.253 మాత్రమే వస్తోంది. ఈ మొత్తాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

**అన్నిచోట్లా అదే పరిస్థితి**

ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద నిర్దేశించిన పనుల లక్ష్యంలో ఇంకా 38 లక్షల పనిదినాలు చూపాల్సి ఉంది. మార్చి 31వ తేదీలోగా వీటిని పూర్తి చేయాల్సి ఉంది. నంద్యాల జిల్లాలో 17 లక్షలు, కర్నూలు జిల్లాలో 21 లక్షల పనిదినాలు పెండింగ్‌లో ఉన్నాయి.

కర్నూలు జిల్లాలో 3.24 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. వీరిలో 2.56 లక్షల కుటుంబాల్లో 4.61 లక్షల వేతనదారులు పనికి వచ్చారు. నంద్యాల జిల్లాలో 4.21 లక్షల వేతనదారులు పనికి వచ్చారు. నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల, కొత్తపల్లి, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, బండిఆత్మకూరు తదితర మండలాల్లో పనులు చూపడంతో నిర్లక్ష్యం చేశారు. కర్నూలు జిల్లాలో పెద్దకడబూరు, ఆస్పరి, చిప్పగిరి, గోనెగండ్ల తదితర మండలాల్లోనూ చాలామందికి పనులు చూపలేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ వ్యయంలో గత ఐదేళ్లలో తేడాలున్నాయి. వీటిపై ఇప్పటికే విచారణ జరుగుతోంది.

# 'చెర'వులను పట్టి.. మట్టి కొల్లగొట్టి..!

కుప్పం : గతేడాది వర్షాభావంతో జలవనరుల్లో నీటి నిల్వలు లేకపోవడాన్ని అక్రమార్కులు ఆసరా చేసుకున్నారు. చెరువులు, కుంటల్లో మట్టి మాఫియా పాగా వేసి నిరంతరం తవ్వి వాటి రూపురేఖలు మార్చేశారు. శాంతిపురం మండలం మొరసనపల్లె చెరువు మట్టి వాణిజ్య స్థలాల చదునుకు యథేచ్ఛగా తరలిపోతోంది. మండల కేంద్రంతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న స్థిరాస్తి వ్యాపారుల భూములకు చెరువుల మట్టిని తోడేస్తున్నారు. గడిచిన రెండేళ్లలో మట్టి తవ్వకాలతో చెరువుల్లోని గుంతలు బావులను తలపిస్తున్నాయి. వర్షాలకు చెరువు నిండినా నిలబడే అవకాశం లేదని రైతులు పేర్కొంటున్నారు. **కొలమాసనపల్లెలో నిత్యకృత్యం..** పలమనేరు మండలం కొలమాసనపల్లె చెరువులో మట్టి తవ్వకాలు నిత్యకృత్యంగా మారాయి. పొక్లెయిన్లతో తవ్వడంతో చెరువు పాడైపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామాల్లో వాణిజ్య అవసరాలకు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. **రూపుకోల్పోతున్న రాయల చెరువు** పుంగనూరు పరిధిలోని రాయలచెరువు మట్టి మాఫియాకు అడ్డాగా మారింది. ప్రభుత్వం పెంచిన చెట్లను వేళ్లతో సహా పెకలించి మట్టిని తోడేస్తున్నారు.

# అసంపూర్తి వారధులు.. అనంత కష్టాలు



అనంతపురం: ఉమ్మడి అనంత జిల్లాలో గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో పలుచోట్ల వంతెనల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఏళ్ల తరబడి పనులు నిలిచిపోవడంతో అంచనా వ్యయం పెరిగి ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. పలుచోట్ల రైల్వే వంతెనల నిర్మాణం ఇదే పరిస్థితి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.వాగులు, నదులపై తలపెట్టిన వంతెనలు పూర్తికాకపోవడంతో వరదల సమయంలో అవతలికి దాటేందుకు వీలులేకుండా పోతోంది. వైకాపా ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వాటిని పూర్తిచేయడానికి కనీస చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. సర్కారు స్పందించి వంతెనలను పూర్తిచేస్తే ప్రయాణ వెతలు తప్పుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

**రెండు మండలాలను కలిపే మార్గం**

పామిడి మండలం పి.కొత్తపల్లి-కత్రిమల మధ్యలో పెన్నానదిపై వంతెన పనులు నిలిచిపోయాయి. 2013లో రూ.14 కోట్లతో మొదలైన హైలెవెల్ వంతెన పనులు 2016లో నిలిచిపోయాయి. అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.6.18 కోట్లు ఖర్చు పెట్టింది.తరువాత వైకాపా సర్కారు పనుల జోలికి వెళ్లలేదు.దీంతో అంచనా వ్యయం పెరిగిపోయింది. పామిడి, గార్లదిన్నె మండలాలను కలిపే ఈ మార్గం వరదల సమయంలో మూసుకుపోతుంది. వాహనదారులు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. **పామిడి**

**రాకపోకలకు అంతరాయం**

రాయదుర్గం-అనంతపురం రహదారిపై రాయదుర్గం పట్టణానికి ఆనుకుని రైల్వే ట్రాక్‌పై తలపెట్టిన వంతెన నిర్మాణం నాలుగేళ్లుగా నిలిచిపోయింది. రైల్వేశాఖ ట్రాక్‌పై వంతెనను పూర్తిచేసింది. ట్రాక్‌కు రెండువైపులా వంతెన, అప్రోచ్ రోడ్డు అర్అండ్‌బీ చేపట్టాల్సి ఉంది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంచనా వ్యయం అమాంతం పెరిగింది. ప్రస్తుతం దీన్ని పూర్తిచేయడానికి రూ.44 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. వంతెన పూర్తికాకపోవడంతో రైల్వే గేటు పడిన ప్రతిసారీ కనీసం పది నిమిషాలకుపైగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.రాయదుర్గం

**తెదేపా హయాంలో మొదలై..**తాడిపత్రి-యల్లనూరు ప్రధాన రహదారిలో తిమ్మంపల్లి వద్ద చిత్రావతి నదిపై మొదలుపెట్టిన వంతెన నిర్మాణం ముందుకు కదలడం లేదు. 2018లో తెదేపా ప్రభుత్వం రూ.31.72 కోట్ల అంచనాతో పనులు మొదలుపెట్టి సగం పూర్తి చేసింది. వైకాపా ఐదేళ్ల పాటు పట్టించుకో లేదు. ఎన్నికల ముందు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.7 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. పిల్లర్ల నిర్మాణం అప్పట్లోనే పూర్తికాగా వంతెన రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.11 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం నదిలో నిర్మించిన తాత్కాలిక రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నా రు. నదికి వరద వస్తే 30 కిలోమీటర్లు చుట్టుకుని వెళాల్సి వస్తుంది. తాడిపత్రి

# ప్రసవాలు చేయరు.. ప్రయాస తప్పదు!




అనంతపురం : ప్రతి నెలా పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం)లో సగటున పది ప్రసవాలు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్వహిస్తున్న ప్రతి సమావేశంలో ఆదేశాలు ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా సాగుతోంది. కొన్నిచోట్ల ఏడాదిలో రెండు అంకెల సంఖ్య కూడా దాటకపోవడం గమనార్హం. నామమాత్రంగా చేసి లెక్కలు చూపుదామన్నట్లు వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. స్థానికంగా ప్రసవాలు చేయకపోవటంతో గర్భిణులు వ్యయప్రయాసలకు ఓర్చి పట్టణాలకు వెళ్లి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరాల్సి వస్తోంది. ప్రతి నెలా స్థానిక పీహెచ్‌సీలలో వైద్యసేవలు పొందినప్పటికీ ప్రసవ సమయం దగ్గరపడిన సమయంలో ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి హెచ్‌డీఎస్ కింద ఏటా రూ.1.27 లక్షలు అందజేస్తోంది. కాన్పులకు అవసరమైన వైద్యసామగ్రి, మందులను ప్రతి మూడు నెలలకోసారి ఏపీఎంఐడీసీ సరఫరా చేస్తోంది. అందుబాటులో లేని మందులను కొనుగోలు చేసుకునేందుకు అనుమతులు ఉన్నాయి. ఇంత ఉన్నా కనీసం అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు.

**వైద్యులు ఉన్నా..** గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు ఉన్నారు. ఆపరేషన్ థియేటర్ సైతం ఉంది. పది నెలల్లో కేవలం నాలుగు కాన్పులే జరగడం గమనార్హం చాలా వరకు అనంతపురంకు రెఫర్ చేస్తున్నారు. రెండు స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని సిబ్బంది చెబుతున్నారు.

**నెలకు పది ప్రసవాలు చేయాల్సిందే..**డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

ప్రతి పీహెచ్‌సీలోనూ నెలకు పది ప్రసవాలు చేయాలని ఆదేశాలిచ్చాం. కొందరిలో మార్పు రావటం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పీహెచ్‌సీకు కేటాయించిన నిధులు, వినియోగం, మందుల సరఫరా తీరును పరిశీలిస్తాం. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం.

**గతంలో భళా.. తరువాత డీలా** సీకే పల్లి మండలం ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదేళ్ల క్రితం వరకు నెలకు పదికి పైగా ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం రెండు, మూడు కూడా జరగడం లేదు. అప్పట్లో గైనకాలజిస్ట్ లేకపోయినప్పటికీ వైద్య సిబ్బంది ప్రసవాలు చేసేవారు. ప్రస్తుతం వారంలో శుక్రవారం, ప్రతి నెలా 9న వైద్యురాలు అందుబాటులో ఉంటున్నప్పటికీ నిర్దేశిత ప్రసవాలు జరగడం లేదు. ఆపరేషన్ థియేటర్ తప్ప మిగతా వసతులు ఉన్నాయి.

**బీరువాలోనే సామగ్రి..** కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరగడం లేదు. ఈ కేంద్రం పరిధిలో 17 పంచాయతీలు ఉన్నాయి. మూడు నెలలకోసారి ప్రసవాలకు సంబంధించి 14 రకాల సామగ్రి సరఫరా అవుతున్నాయి. కొన్ని ఇతర వాటికి ఉపయోగిస్తున్నారు. మరికొన్ని బీరువాలోనే ఉంచారు. నెలకు సుమారు 6 నుంచి 8 మంది గర్భిణులు వస్తుంటారు. చాలా మంది కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రికి వెళుతున్నారు.

అనంతపురం జిల్లాలో మొత్తం పీహెచ్‌సీలు : 45

గతేడాది ఏప్రిల్ నుంచి ఈఏడాది జనవరి వరకు పీహెచ్‌సీలలో చేసిన ప్రసవాలు : 1011

# ఏకకాలంలో పది రైళ్ల రాకపోకలు

గుంతకల్లు : రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా వేగంగా, ఎక్కువ సంఖ్యలో ప్రయాణించే విధంగా గుంతకల్లు డివిజన్ అధికారులు డివిజన్‌లో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇలాంటి వ్యవస్థ గుంతకల్లు, విజయవాడ డివిజన్‌లో ఏర్పాటవుతోంది. ప్రస్తుతమున్న అబ్జల్యూట్ వ్యవస్థతో రైళ్లు ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు చేరుకున్నాకే మరో రైల్‌ను లైన్‌లో వదలడానికి అవకాశం ఉంది.

**కొత్త వ్యవస్థ పని తీరు ఇలా..**

అటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో రెండు స్టేషన్ల మధ్య వరుసగా 10 రైళ్లను ఒకేసారి నడపడానికి అవకాశం ఉంది. ప్రతి సిగ్నల్‌లో నాలుగు రకాల లైట్లు ఉంటాయి. పచ్చలైట్ పడితే రైళ్లను వేగంగా నడపవచ్చు. రెండు పసుపుపచ్చ సిగ్నళ్లు పడితే కొంత వేగాన్ని తగ్గించాలని, ఒక పసుపు పచ్చ లైటు వెలిగితే మరికొంత నిదానంగా వెళ్లాలని, ఎర్ర సిగ్నల్ పడితే రైలు ఆగాలని సిగ్నలింగ్ వ్యవస్థలో పొందుపరిచారు.

**రూ.700 కోట్లతో పనులు**

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కొత్త సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు రైల్వేబోర్డు రూ.700 కోట్లు కేటాయించింది. డివిజన్‌లో మొదట గుంతకల్లు-వాడి (229 కి.మీ.లు), గుంతకల్లు-రేణిగుంట (310 కి.లు) సెక్షన్లలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో



భాగంగా ప్రస్తుతం గుంతకల్లు - వాడి సెక్షన్‌లో మొదట గుంతకల్లు - మొలగవల్లి (20కి.మీ.లు) మధ్య కొత్త సిగ్నలింగ్ వ్యవస్థను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి కి.మీ.కు సిగ్నల్ ఉంటుంది. దీన్ని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన సర్క్యూట్ వ్యవస్థకు అనుసంధానం చేశారు. ఒక కి.మీ.కు సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి రైల్వేకు రూ.1.4 కోట్లు ఖర్చవుతోంది.

**ప్రయాణికుల కష్టాలు తీరినట్లే..**

కొత్త ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుతో రైల్వే ప్రయాణికుల కష్టాలు తీరుతాయి. ఎక్కువ సేపు రైళ్ల కోసం వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ఒకేసారి పది రైళ్లను నడపడానికి వీలుంటుంది. గూడ్సుల ద్వారా సరకుల రవాణా మరింత జోరందుకుంటుంది. చంద్రశేఖర్, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరు

# సుద్దంగా స్వాహా

బనగానపల్లి: కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా గనుల్లో తవ్వకాలు చేపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకున్నా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిరంతరం తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తగిన దృష్టి సారించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బనగానపల్లి గనుల శాఖ పరిధిలో వెంకటాపురం, జోలాపురం, పలుకూరు, నందవరం, బేతంచెర్ల, డోన్ ప్రాంతాల్లో సున్నపు గనులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో 200 హెక్టార్ల విస్తీర్ణంలో పలువురు లీజుకు తీసుకున్నారు. మరో 50 నుంచి 100 హెక్టార్లలో అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు చేస్తున్నారు. సున్నపు గనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు అక్రమార్కులు తవ్వకాలు జరిపి సున్నం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**అనుమతులు కొంత..**

బనగానపల్లి సమీపంలో ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూముల్లోనూ సుద్ద గనుల తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ప్రైవేటు భూముల్లో అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఒక హెక్టారు లీజు తీసుకుంటే.. మరో హెక్టారు ప్రాంతంలో లీజు లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు.



చివరికి పోరంబోకు స్థలాల్లోనూ అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

**వేబిల్లులు లేకనే..** గనుల నుంచి ఇతర ప్రాంతాలకు సున్నం తరలించాలంటే గనుల శాఖకు డీఎంఎఫ్ ఫండ్ 30 శాతం, మెరిట్ ఫండ్‌తో కలిపి టన్నుకు రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ట్రాక్టరులో 2-3 టన్నుల వరకు తరలిస్తుంటారు. ఈ లెక్కన రూ.600 వరకు చెల్లించాలి. లారీలు, టిప్పర్లలో 10-12 టన్నుల వరకు తీసుకెళ్తారు. దీనికిగాను రూ.1,800 వరకు చెల్లించాల్సి ఉంటుంది. చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లోని సిమెంటు పరిశ్రమలకు లారీల్లో సున్నం తరలిస్తుంటారు. రాత్రి వేళల్లో నిఘా లేకపోవడంతో వేబిల్లులు లేకుండా దాటించేస్తున్నారు. పలుకూరు, వెంకటాపురం నుంచి గాలేరు.. నగరి కాలువ మీదుగా లారీలు, ట్రాక్టర్లలో సున్నం తరలిపోతోంది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

**జరిమానా విధిస్తున్నాం: రాజగోపాల్, గనుల శాఖ ఏడీ**

అక్రమంగా ఖనిజాన్ని తరలించే సున్నపు లారీలు, ట్రాక్టర్లపై దాడులు చేస్తున్నాం. వేబిల్లులు లేకుండా వెళ్తే జరిమానా విధిస్తాం. భవిష్యత్తులో దాడులు ముమ్మరం చేస్తాం. అక్రమ తవ్వకాలపై నిఘా పెడతాం.

# రూకలిస్తేనే దస్త్రాల నవీకరణ

గిద్దలూరు : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న సిబ్బందికి సంబంధించి సర్వీస్ రిజిస్టర్ ఎంతో కీలకం. బదిలీలు, ఇంక్రిమెంట్లు, సంపాదిత సెలవులు, ఉద్యోగోన్నతులు వంటి వివరాలను ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని జిల్లా అధికారులు విస్మరించారు. ఈ నేపథ్యంలో వివరాలు నమోదు చేయాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇదే అదునుగా కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దారిన సంపాదనకు కక్కుర్తి పడుతున్నారు. **ఇదీ విషయం:** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పలువురు సంక్షేమ అధికారులు, వంట మనుషులు, రాత్రి కాపలాదారులు, సహాయకులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికి సంబంధించిన సర్వీస్ రిజిస్టర్లు గత నెల వరకు జిల్లా కార్యాలయంలోనే ఉండిపోయాయి. నిబంధనల ప్రకారం సిబ్బంది వాటిల్లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాల్సి ఉండగా.. గత ఆరు సంవత్సరాలుగా అధికారులు పట్టించుకోలేదు. ఈ నెల జీతాల బిల్లులకుగాను సిబ్బంది సంపాదిత సెలవుల వివరాలను నిధి పోర్టర్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆ శాఖ జిల్లా అధికారులు సదరు దస్త్రాలను గిద్దలూరు, మార్కాపురం, ఒంగోలులోని కార్యాలయాలకు పంపారు. **రూ. 5 వేలు చొప్పున వసూలు పర్వం!:** సిబ్బంది సర్వీస్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను కొందరు తమ సంపదనా మార్గంగా భావించారు. నవీకరణకు ఒక్కో ఉద్యోగి నుంచి కొందరు రూ.5 వేలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో సిబ్బంది లబోదిబోమంటున్నారు. నిర్లక్ష్యం ఒకరు వహిస్తే తమ వద్ద చేతివాటం చూపడం ఏంటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి ఎం.అంజల మాట్లాడుతూ.. సర్వీస్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయించుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అన్నారు. తాను విధులు చేపట్టినప్పటి నుంచి ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించలేదని చెప్పారు. గతంలో నమోదు చేయని విషయం తెలియదని, నగదు డిమాండ్ అడుగుతున్నట్లు తన దృష్టికి రాలేదని తెలిపారు.

# మరింత మందికి తీర్థం

చీమకుర్తి : జిల్లాలో సాగునీటి అవసరాల కోసం నిర్మితమైన రామతీర్థం జలాశయం పూర్తిగా తాగునీటి ప్రాజెక్టుగా మారిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లాలో పెరుగుతున్న నీటి ఎద్దడే దీనికి కారణమవుతోంది. దీనికితోడు జలజీవన్ లక్ష్యాలు నెరవేరాలన్నా.. వేసవిలో నీటి ఇక్కట్లకు చరమగీతం పాడాలన్నా.. జలాశయ సామర్థ్యాన్ని మరో టీఎంసీ మేర పెంచడమే తరుణోపాయమని అధికార యంత్రాంగం భావిస్తోంది. చీమకుర్తి మండలం దేవరపాలెం పంచాయతీ ఓబచెత్తపాలెం వద్ద సుమారు 1100 ఎకరాల్లో రామతీర్థం జలాశయం విస్తరించి ఉంది. చీమకుర్తి పట్టణం, ఒంగోలు నగరం, సంతనూతలపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీరు, సాగర్ ఒంగోలు బ్రాంచి కాలువ చివరి భూములుగా ఉన్న సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా 2004 సంవత్సరంలో రామతీర్థం జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు రూ.55 కోట్ల వ్యయంతో 2009లో ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేశారు.

**జల వనరుల అధికారులతో చర్చలు**

ఇటు తాగు..అటు సాగు నీటి కోసం ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవల సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ జలాశయం సామర్థ్యం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై జల వనరుల శాఖ అధికారులతో చర్చించారు. ఈ మేరకు నైరుతి మూలగా ఉన్న మెరక ప్రాంతాన్ని లోతు చేయడంతో పాటు పూడిక తీస్తే దాదాపు టీఎంసీ వరకు అదనంగా నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంటుందని వారు చెప్పారు. దీనిపై గతంలోనూ అధికారులు ఆలోచన చేశారు. ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టముందని, నీటి నిల్వ తగ్గిన తర్వాత ఆయా ప్రాంతాల్లో లెవెల్స్ తీసి పెంపు సామర్థ్యంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీన్ని కార్యరూపం దాల్చేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు. పెరుగుతున్న నీటి అవసరాలురిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.514 టీఎంసీలు కాగా, గరిష్ఠ నీటిమట్టం 85.34 మీటర్లు. కనిగిరి రక్షిత మంచినీటి పథకానికి ఇక్కడి నుంచే నీటిని ఇవ్వడం మొదలుపెట్టారు.

# వాలిన చిలకలు

విశాఖపట్నం: గ్రామాల్లో తీర్థాలు ఆరంభమయ్యాయి. సంక్రాంతి సంబరాలు ప్రతివారిని ఆనందోత్సాహాలతో నింపుతాయి. వీటిలో పల్లెవాసుల సంప్రదాయ వంటకమైన పంచదార చిలకలకు ఈ సీజన్‌లో డిమాండ్ ఎక్కువ. పిల్లల నుంచి పెద్దలవరకు వీటిని చూసి ముచ్చటపడని వారుండరు. జిల్లాలో కశింకోట, వడ్డాది, చోడవరం గ్రామాలలో వీటిని తయారుచేసే కుటుంబాలు ఉన్నాయి. కశింకోట వడ్డివీధికి చెందిన కొన్ని కుటుంబాలు దశాబ్దాలుగా పిండి వంటలు తయారుచేసి సంతల్లో, సంబరాల్లో అమ్ముతుంటారు. సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి చిలకల తయారీలో నిమగ్నమవుతారు. వీటిలో తెలుపు, గులాబీ రంగులకు గిరాకీ ఎక్కువగా ఉండటంతో వీటినే తయారు చేస్తుంటారు. వీటి తయారీకి ప్రధానంగా పంచదారను వినియోగిస్తారు. కట్టెల పొయ్యిపై పాకం తీసి అచ్చుల్లో వేసి చల్లారుస్తారు. అచ్చుల నుంచి జాగ్రత్తగా వీటిని విడదీసి బయటకు తీస్తారు. వీటిని పదిలంగా బుట్టల్లో పేర్చి అమ్మకానికి సిద్ధం చేస్తారు. కేజీ పంచదారకు పరిమాణాన్ని బట్టి 40 చిలకల వరకు తయారు చేస్తారు. ఒక్కో దాని ధర రూ.10 నుంచి రూ.100 వరకు ఉంటుంది. వివాహాలు, ఉపనయనాలు, బారసాల తదితర వేడుకలకు చిలకలను తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఏళ్ల తరబడి తమ పరిస్థితులు మారలేదని, ముడి సరకుల ధరలు పెరగడంతో ఆశించిన లాభాలు పొందలేకపోతున్నామని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రుణాలు ఇవ్వాలి: చిరు వ్యాపారులకు ఇచ్చే విధంగా మాకు కూడా రుణాలు ఇస్తే మేలు కలుగుతుంది. గిట్టుబాటు కాకపోయినా తాతల కాలం నాటి వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.
ఆకుల రమణమ్మ, చిలకల తయారీదారు రాయితీపై పంచదార అందించాలి: పెరుగుతున్న ధరలకు అనుగుణం గా ఆదాయం లేక అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నాం. ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తే కొంత భారం తగ్గుతుంది. 50 కేజీల పంచదార బస్తా కొనుగోలు చేయడానికి కూడా చేతిలో డబ్బులు లేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం సంప్రదాయ వంటలను ప్రోత్సహించేలా రాయితీపై పంచదార అందించాలి. ఆకుల లక్ష్మణరావు, కశింకోట

# ఏడీబీ రోడ్డు.. ఇక చకచకా

రంగంపేట : ప్రత్యక్ష నరకానికి నిలయంగా తయారైన ఏడీబీ రోడ్డు రూపురేఖలు చకచకా మారిపోతున్నాయి. రాజమహేంద్రవరం–కాకినాడ పట్టణాలను కలిపే ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త సహకారంతో రూ.300 కోట్ల అంచనాతో 2018లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో నిధుల విడుదలలో జాప్యంతో తరచూ పనులు నిలిచిపోతుండేవి. కూటమి ప్రభుత్వం హామీతో గుత్తేదారు సంస్థ పూర్తి చేస్తుండటంతో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షిస్తోంది.

**పనుల తీరు ఇలా..:** రాజానగరం నుంచి రంగంపేట, గండేపల్లి, పెద్దాపురం మండలాల మీదుగా సామర్లకోట వరకు ఉన్న 30 కిలోమీటర్ల రోడ్డుని నాలుగు లైన్లుగా నిర్మించడంతోపాటు మధ్యలో విభాగినిని ఏర్పాటు చేస్తున్నారు. 30 కి.మీలలో 13.71 కి.మీ. కాకినాడ జిల్లాలో ఉండగా 11.20 కి.మీ. రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. తూర్పుగోదావరి జిల్లా పనుల్లో జాప్యం జరుగుతోంది. 16.29 కి.మీ.లలో కేవలం 6.05 కి.మీ. మాత్రమే పూర్తయ్యింది. రెండు జిల్లాలకు సంబంధించి 86 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 62 పూర్తవ్వగా 10 కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి.

**స్థల సేకరణలో ఇబ్బందులు:** ఈ రోడ్డులో ఉన్న గ్రామాల వెలుపల రోడ్లు పనులు, వంతెన పనులను ప్రణాళికబద్ధంగా సాగుతున్నాయి. గ్రామాలలో మాత్రం పనులు ప్రారంభం కాలేదు. ఇకపై ఈ పనులపైనా గుత్తేదారు సంస్థ, ఆర్‌డీసీ అధికారులు దృష్టి సారించనున్నారు. ఈ రోడ్డులో బాధితులకు సంబంధించి కాకినాడ జిల్లాలో రూ.24లక్షలు,



తూర్పుగోదావరి జిల్లాలో రూ.4.03 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉండగా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆర్.అండ్.ఆర్. చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలంటూ చిరువ్యాపారులు, బాధిత రైతులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. పరిహారం పంపిణీలో భారీగా కుంభకోణం జరిగిందని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని ఇటీవల ఈ రోడ్డు పనుల పరిశీలనకు వచ్చిన జిల్లా అధికారుల దృష్టికి బాధితులు తీసుకుని వెళ్లారు. రోడ్డు పనులకు ఏ విధమైన ఆటంకం లేకుండా జిల్లా కలెక్టరు ప్రశాంతి దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు సంబంధిత అధికారులతో సమీక్షించి పనుల ప్రగతిని పర్యవేక్షిస్తున్నారు.

**ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేస్తాం..**
గతంలో పలు కారణాలతో పనుల్లో జాప్యం జరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఈ పనులన్నీ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నాయి. ఈ రోడ్డు పనులకు సంబంధించి నిధుల విడుదలలో కొంత జాప్యం జరిగినా గుత్తేదారు సంస్థకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పనులు సాగిపోతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసే విధంగా పని చేస్తున్నాం. – భాస్కర్, ఈఈ, ఆర్‌డీసీ

# సహకారం.. అవినీతే సర్వం..!



అనకాపల్లి : జిల్లా సహకార శాఖలో అవినీతి వేళ్లూనుకు పోయింది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ శాఖలో అవినీతికి అడ్డుకట్ట పడడం లేదు. విశాఖలో అత్యంత విలువైన ప్రాంతంలోని సూపర్‌బజార్ స్థలాన్నే కుదువ పెట్టి బ్యాంకు రుణం తీసుకున్నా పట్టించుకొనే నాథుడే లేదు. లోగడ అనకాపల్లి గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (ఆర్‌ఈసీఎస్)లో అనేక అక్రమాలు జరిగాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అక్కడ పనిచేసిన సహకార శాఖ అధికారులు రెచ్చిపోయారు. గతంలో ఒక హౌస్ బిల్డింగ్ సొసైటీ నుంచి ఏకంగా రూ.2 కోట్ల విలువైన స్థలం ఇవ్వాలని ఒక సహకార శాఖ అధికారి పట్టుబట్టి అనిశాకు దొరికిపోయారు. ఈ శాఖ పరిధిలో పనిచేసే పీఏసీఎస్‌లు చాలావరకు అవినీతిలో కూరుకుపోయాయి. మరొక విచిత్రమేమిటంటే పరస్పర ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులే ఒకరిపై మరొకరు విచారణ చేసుకుంటుండంతో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వెలుగులు మాటున చీకటి వ్యవహారాలు**
కశింకోట కేంద్రంగా అయిదు మండలాలకు వెలుగులు పంచిన గ్రామీణ సహకార విద్యుత్తు సంస్థ (రెస్కో)లో అనేక చీకటి వ్యవహారాలు జరిగాయి. సహకార శాఖ అధికారి ఎండీగా, పర్సన్ ఇన్‌ఛార్జులుగా ఉన్న హయాంలో వైకాపా ముఖ్యనేతలు రెస్కోలో అక్రమాలకు పాల్పడ్డారు. విద్యుత్తు ఉపకరణాల కొనుగోలు నుంచి ఉద్యోగుల నియామకాల వరకు అన్నింటా భారీగానే వెనకేసుకున్నారు. రూ.కోట్ల సొమ్ములు దారిమళ్లించారు. అప్పటి నేతల ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో సహకారశాఖ అధికారులు మిన్నకుండిపోయారు. రెస్కో అక్రమాలపై గతంలో ఒకసారి 51 విచారణ చేపట్టినా ఆ నివేదిక బయటకు రాకుండా గత పాలకులకు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రెస్కోలో అవినీతి బాగోతంపై విచారణ చేపట్టాలని శాసనసభలోనే ప్రస్తావించారు. ఇటీవల సహకార శాఖకు చెందిన ఓ అధికారిని విచారణాధికారిగా నియమించి అప్పటి పర్సన్ ఇన్‌ఛార్జి కాలంలో జరిగిన వ్యవహారాలను లోతుగా తవ్వితీస్తున్నారు. దీన్ని కొంతమంది రెస్కో సిబ్బంది కొర్రీలుపెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**బజార్.. బేజార్..**విశాఖ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్ (సూపర్ బజార్)కు చెందిన స్థలం అడ్డగోలుగా చేతులు మారిన వ్యవహారంలోనూ సహకార శాఖ అధికారి నిర్లక్ష్యం ఉందని ప్రాథమికంగా గుర్తించారు. సూపర్ బజార్‌కు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్న సంస్థ బ్యాంకులో తనఖాపెట్టినప్పుడు సదరు అధికారి ఉదాసీనంగా వ్యవహరించడంతో రూ.కోట్ల విలువైన స్థలం చేజారే పరిస్థితికి వచ్చింది. తాజాగా దీనిపై సహకార చట్టంలోని 51 సెక్షన్ విచారణ చేపడుతున్నారు. అయితే ఆర్‌ఈసీఎస్, సూపర్‌బజా ర్‌లలో అక్రమాలపై విచారణలు చేపడుతున్న అధికారులు గతంలో ఒకరి స్థానంలో ఒకరు పనిచేసినవారే కావడం గమనార్హం. వారి హయాంలో జరిగిన అడ్డగోలు వ్యవహారాల్లోనే రూ.కోట్ల సొమ్ములు పక్కదారిపట్టాయన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పుడు వారే విచారణలు జరుపుతుండడం సంబంధిత శాఖలో చర్చనీయాంశమవుతోంది.

# జేఎన్‌టీయూకేకు భారీ జరిమానా




కాకినాడ : కాకినాడకు చెందిన ఓ ఉద్యోగి జేఎన్‌టీయూకేలో పొరుగు సేవల్లో ప్రోగ్రామర్‌గా పనిచేసేవారు. నాలుగు నెలల క్రితం ఆరోగ్య సమస్యతో మృతిచెందారు. పీఎఫ్, ఈపీఎఫ్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలతో కలిపి రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలు అందాల్సి ఉంది. పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించకపోవడంతో రాలేదు.
జేఎన్‌టీయూకేలో పొరుగు సేవల్లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కంటి సమస్యతో బాధపడుతున్నారు. ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్లారు. ఈఎస్‌ఐ కట్టట్లేదని వైద్యం కుదరదని చెప్పారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.30వేలతో చికిత్స చేయించుకున్నారు.
జేఎన్‌టీయూకేకు కావాల్సిన మానవ వనరులను పొరుగు సేవల ద్వారా తీసుకుంటారు. ప్రతి రెండేళ్లకోసారి టెండర్ విధానంలో నియమిస్తారు. పొరుగు సేవల ఏజెన్సీ తరఫున 450 మందికి పైగా పనిచేస్తున్నారు. ఆ సంస్థే వారికి జీతభత్యాలు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ వంటివి చెల్లిస్తుంది. గతేడాదిగా యూనివర్సిటీలో పొరుగు సేవలను అందించే ప్రైవేటు ఏజెన్సీ నియామకం చేపట్టట్లేదు. ఈ నేపథ్యంలో వీరి నిర్వహణ తాత్కాలికంగా యూనివర్సిటీనే చూసుకుంటోంది. వీరికి జీతాలు చెల్లిస్తున్నా, ఏడాదిగా ఈపీఎఫ్, ఈఎస్‌ఐ వంటివి చెల్లించట్లేదు. దీంతో న్యాయపరంగా సిబ్బందికి అందాల్సిన సౌకర్యాలు, పరిహారాలు దక్కట్లేదు. దీనిపై ఉద్యోగ భవిష్యనిధి సంస్థ కొరడా ఝుళిపించింది. సక్రమంగా చెల్లించని కారణంగా రూ.లక్షల్లో జరిమానా విధించింది. ఇప్పుడది దాదాపు రూ.కోటి అవుతుంది. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో ఈ మొత్తాన్ని జేఎన్‌టీయూకే విద్యానిధుల నుంచి చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

**అధికారుల అలసత్వం..**
గతంలోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. సంబంధిత ఏజెన్సీ ఒప్పంద సిబ్బందికి సంబంధించిన ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటివి చెల్లించలేదు. ప్రతినెలా వారు కడుతున్నారో లేదో చూడాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ అధికారులదే. ఆ రసీదులు ఉంటేనే తర్వాతి నెలకు సంబంధించిన జీతభత్యాలు మంజూరు చేయాలి. అవేమీ పట్టించుకోకుండానే బిల్లులు మంజూరు చేసేవారు. తాజాగా యూనివర్సిటీ అధికారులే పర్యవేక్షిస్తుండగా, ఏడాదిగా చెల్లించకపోవడం గమనార్హం.

**గత అక్టోబరులోనే వేసినా..**
దీనికి సంబంధించి గతేడాది అక్టోబర్‌లోనే రూ.79,79,559 జరిమానా (పీనల్ డ్యామేజెస్) విధించారు. 60 రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. ఆ గడువు దాటిపోయినా అధికారులు మిన్నకుండటం గమనార్హం. ఇప్పుడు ఆ మొత్తం రూ.కోటి దాటుతుంది. ఈ కారణంగా ఉద్యోగులు నష్టపోతున్నారు.

# ఎస్సీ వసతి గృహాలకు మహర్దశ

అమలాపురం : ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో విద్యార్థుల సమస్యలు తీరనున్నాయి. గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వ పరిపాలనలో మరమ్మతులకు పైసా విదల్చలేదు. కరోనా సమయంలో వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. తరువాత పెరిగినా ఆ మేరకు వసతిగృహాల్లో వసతులు కల్పించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం 33కు గాను 22 ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు రూ.4.93 కోట్లు నిధులు ఇచ్చింది. ప్రధానమైన వాటికి రూ.1.19కోట్లు, మైనర్ వాటికి రూ.3.74కోట్లు ప్రకటించారు.

**సమస్యలివి..తీర్చాలి మరి...**
కొన్ని వసతిగృహాల ప్రాంగణాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. భవనాల్లో శ్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. తాగునీటి సరఫరా సక్రమంగా లేదు. గదుల్లో గచ్చులు పగిలి విద్యార్థులు నిద్రించడానికి అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు, వంటశాలల్లో బాలేవు. కిటికీలకు ఏర్పాటు చేసిన దోమతెర మెస్‌లు చినిగాయి. విద్యుదీకరణ పనులు చేయించాలి.

**ఆ ఆరు.. అక్రమాలకు అడ్డాలు**
అక్కడ ఎవరికీ ఇసుక తవ్వుకునేందుకు అనుమతి లేదు. అధికారికంగా ర్యాంపులు ఖరారు చేసింది లేదు. అయినా రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుక, మట్టి తరలిపోతూనే ఉంది. అధికారుల తనిఖీలు ఉండవు. వచ్చినా పరిశీలించనివ్వరు.. నిండు గోదావరిని తవ్వేసి అక్రమార్కులు చెలరేగిపోతున్నాయి. డి.ఎస్.పాలెం, లంకలగన్నవరం, ఊడిమూడిలంక, వై.వి.పాలెం..ఇవన్నీ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం పరిధిలోని అనధికార ర్యాంపుల ప్రాంతాలు. డి.ఎస్.పాలెంలో నిత్యం ట్రాక్టర్ల ద్వారా 300–400 ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.700 వసూలుచేస్తున్నారు. జుట్టుకూలీలకు రూ.350, బాట ఖర్చు రూ.150, ప్రైవేట్ వ్యక్తులకు రూ.50, నేతలకు రూ.150 వెళ్తోంది. లంకలగన్నవరంలో గోదావరిలోంచి ఇసుక తీస్తున్నారు. రోజూ 50–60 ట్రాక్టర్ ట్రిప్పులు వెళ్తున్నాయి. ఊడిమూడిలంక, వై.వి.పాలెంలో ఏకంగా టిప్పర్లే. ఒక్కోటి 5 యూనిట్ల ఇసుక తీసుకువెళ్తోంది. టిప్పర్‌కు రూ.10వేల నుంచి రూ.12వేలు తీసుకుంటున్నారు. ఇప్పుడు తాజాగా మానేపల్లిలంక భూముల్లోంచి లంకమట్టి, ఇసుక, తువ్వ ఇసుకను భారీఎత్తున దోచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. టిప్పర్లు



వెళ్లేలా గోదావరి నదీపాయకు అడ్డుకట్ట(బాట) వేస్తున్నారు. త్వరలో మానేపల్లి పరిధిలోనే నదీపాయకు అడ్డుకట్టవేసి వనరులను తరలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ఇది ఆరో అక్రమ ర్యాంపు అవుతుంది. మండలస్థాయి మాజీ మహిళా ప్రజాప్రతినిధి కుమారుడు దగ్గరుండి నదీపాయకు అడ్డుకట్ట వేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఇదే ప్రాంతం నుంచి వేలాది టిప్పర్లలో అనధికారికంగా వనరుల దోపిడీ జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సైతం ఇసుక రుచిమరిగినవారు దర్జాగా తరలిస్తున్నారు. మానేపల్లిలంక భూముల్లోంచి వనరులను తరలించేందుకు వైకాపా నాయకుడొకరు స్థానికులు అడ్డుతగలకుండా మధ్యవర్తిత్వం నడిపారని తెలిసింది. ఆ నేత గతంలోనూ ఇదే తరహాలో వ్యవహరించారు. అప్పట్లో భూములు నష్టపోతున్న దళితరైతులు ఆందోళన చేపట్టారు.

**నాయకుడికి తెలియకుండానే జరిగిపోతుందా..**
ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా ర్యాంపులు తెరిచి వనరులను తరలిస్తుంటే నియోజకవర్గంలో కూటమికి చెందిన ఓ ముఖ్య నేతకు తెలియకుండానే ఇదంతా జరుగుతుందా అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజులక్రితం అక్విడక్టుకు ఆవల గోదావరిలోంచి అక్రమంగా డ్రెడ్జర్‌తో ఇసుక తీశారు. రావడంతో అధికారులు ఆ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు రూ.30వేలు జరిమానా విధించారు. మానేపల్లి లంకభూముల్లోంచి మరో బాట వేసేందుకుగాను ఇదే యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

# సిట్ వచ్చేనా.. ముకుతాడు వేసేనా!

కాకినాడ: కాకినాడలో రేషన్ మాఫియాను నియంత్రించేందుకు గతేడాది డిసెంబర్ 6న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నియమించింది. ఇందులో కొందరు సభ్యుల తీరుపై ఆక్షేపణలు వ్యక్తమవడంతో.. వారిని మారుస్తూ డిసెంబర్ 31న కొత్త సిట్‌ను నియమించింది. అయితే ఇంతవరకు సిట్ జాడ లేదు. సీఐడీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని బృందం నెలన్నర గడచినా మూలాల శోధనకు కాకినాడలో అడుగు పెట్టలేదు. దీంతో అక్రమాల కట్టడి సాధ్యమేనా..? పోర్టుల ద్వారా విదేశాలకు తరలిపోతున్న పేదల బియ్యానికి అడ్డుకట్ట పడేనా..? అనే చర్చ సాగుతోంది.

**వారు వీరే.. తారుమారే..:** వైకాపా ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల వ్యవస్థ కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం కనుసన్నల్లో సాగింది. అప్పట్లో వైకాపాతో అంటకాగిన కొందరు నేతలు, అధికారులు ఇప్పుడూ పెత్తనం చెలాయిస్తూ అక్రమాలకు ఊతమందిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం ఇప్పటికే నివేదికలు తెప్పించుకున్నా చర్యలకు ఉపక్రమించలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జిల్లాలో గతేడాది జూన్ 28, 29 తేదీల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 13 గోదాముల్లో 51,427 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. 26,488.32 టన్నుల్లో పేదల బియ్యం (పీడీఎస్ కెర్నల్స్) ఉన్నట్లు తేల్చారు. ఆయా సంస్థలపై 6ఏ కేసులు పెట్టిన పౌరసరఫరాల శాఖ.. క్రిమినల్ కేసుల నమోదుకు కాకినాడ పోర్టు, సర్పవరం,



ఇంద్రపాలెం, కరప, కోరింగ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పుదుచ్చేరితో పాటు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఝార?ండ్, పశ్చిమ బెంగాల్ నుంచి రేషన్ బియ్యం కాకినాడ చేరినట్లు తేల్చారు. 137 మిల్లుల నుంచి వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. స్టెల్లా నౌకలో 1,320 టన్నులు.. బార్జిలో వెయ్యి టన్నుల పేదల బియ్యం స్వాధీనంపైనా దర్యాప్తు సాగుతోంది.

**కేసులన్నీ సిట్‌కు..:** మంత్రి తనిఖీల్లో నమోదైన 13 కేసులతోపాటు.. స్టెల్లా, బార్జిలో అక్రమ నిల్వల కేసులూ సిట్‌కు అప్పగించాలని కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ నిర్ణయించారు. చెక్‌పోస్టుల తనిఖీలు దాటి స్టెల్లా నౌక, బార్జిలోకి రేషన్ బియ్యం వెళ్లిన అంశం ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. విచారణ చేపట్టి కొందరు ఉద్యోగుల పాత్రపై స్పష్టతకు వచ్చారు. ఈ వివరాలు ప్రత్యేక దర్యాప్తు బృందం చేతికి వెళ్లనున్నాయి. రేషన్ బియ్యం సేకరించి మిల్లర్లకు చేరవేస్తున్న 137 మంది వ్యాపారులను కాకినాడ జిల్లా పోలీసులు బైండోవర్ చేశారు. మాఫియా మూలాలు సిట్ శోధించాల్సి ఉంది.

# అంతర్వేదిలో హార్బర్‌కు పచ్చజెండా

అంతర్వేది : ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న అంతర్వేది తీరంలో కేంద్ర ప్రభుత్వం డ్రెడ్జింగ్ హార్బర్, నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్మాణానికి పచ్చజెండా ఊపి రూ.1,890 కోట్లు కేటాయించడంతో స్థానికులే కాకుండా జిల్లాలోని తీరప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2016లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మించడానికి రూ.1,800 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు(ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు) దీనిని నిర్మించడానికి కృషి చేశారు. రెవెన్యూశాఖ అంతర్వేది నుంచి కేశవదాసుపాలెం వరకు తీరంలో 200 ఎకరాలు భూమిని సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీంతో ప్రజలు అంతర్వేది దశ, దిశ మారబోతుందని సంతోషం వ్యక్తం చేయడమే కాకుండా వారికి చెందిన భూములు ఎకరం రూ.కోట్లలో అమ్మకానికి పెట్టారు. ఎక్కువ రేటు రావడంతో చాలామంది విక్రయించారు. కొండలను తలపించే ఇసుక తిన్నెలను అక్రమంగా తవ్వేసి అమ్మేసుకున్నారు. ఇంతలో



2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణ సంగతి వదిలేసింది. ఐదేళ్లు పట్టించుకోలేదు. దీంతో అధిక రేటు పెట్టి భూములను కొనుగోలు చేసినవారు అయోమయ స్థితిలోకి వెళ్లిపోయారు. మరోవైపు ఇసుకను భారీగా తవ్వేయడంతో సముద్ర కెరటాలు ముందుకు వచ్చి పచ్చని భూమిని బీడుగా మార్చేశాయి. ప్రస్తుతం డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపడంతో తీర ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. **ఉపాధి అవకాశాలు మెండు** కూటమి ప్రభుత్వంలో అడ్డంకులు ఏమీ లేకుండా అంతర్వేదిలో డ్రెడ్జింగ్ హార్బర్, నైపుణ్య శిక్షణ కేంద్ర నిర్మాణా లు జరిగితే ఈ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక, పర్యాటక, మినీ ఫిషింగ్ హార్బర్, మత్స్య కేంద్రాల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా కలుగుతాయి. ఈ ప్రాంతాల నుంచే గల్ఫ్ దేశాలకు అధికంగా వెళ్తుంటారు. వారి వలసలు నివారించవచ్చు. సముద్ర కోత నివారణ జరుగుతుందని సర్వత్రా ఆశిస్తున్నారు

## పాతది పనికి రాదు..
## కొత్తది పూర్తి కాదు

హిందూపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంజీఎం క్రీడా మైదానంలో 1986లో నిర్మించిన అతిపెద్ద ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవటంతో అందులో క్రీడాకారులు శిక్షణ పొందలేక పోతున్నారు. ఇదే మైదానంలో క్రీడా వికాస్ కింద 2017లో రూ.2 కోట్ల నిధులతో తలపెట్టిన నూతన ఇండోర్ స్టేడియం దాదాపు ఎనిమిదేళ్ల నుంచి అసంపూర్తిగా ఉంది. దీని నిర్మాణం పూర్తి చేయటానికి సంబంధిత అధికారులు రూ.2.40కోట్లకు ప్రతిపాదనలు చేసినా ఇప్పటివరకు ఎలాంటి నిధులు మంజూరు లేక ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీనిపై ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే చొరవతీసుకొని నిధులు మంజూరు చేయిస్తే నూతన ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దాదాపు 6 సంవత్సరాలుగా ఇండోర్ స్టేడియం అందుబాటులో లేక క్రీడాకారులు శిక్షణ పొందేందుకు, ఆటలు ఆడేందుకు ఇబ్బందులు



పడుతున్నారు.

**ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే చర్యలు తీసుకోవాలి**

గతంలో ఉన్న ఇండోర్ స్టేడియం శిథిలావస్థకు చేరుకోవటంతో దీనిలో శిక్షణ ఇచ్చేందుకు అవకాశం లేదు. కొత్త స్టేడియం అందుబాటులోకి వస్తుందని క్రీడాకారులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. ఈ స్టేడియం దాదాపు 8 సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉంది. ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే చొరవ తీసుకొంటే స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వస్తోంది. జెమిని నాగరాజు, బ్యాడ్మింటన్ కోచ్

**నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేశాం**

అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం పూర్తిచేయటానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం. మంజూరైన వెంటనే స్టేడియం నిర్మాణం పూర్తిచేసి దీనిసేవలు క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తాం.ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీవో, పుట్టపర్తి

## చేయి తడిపితేనే పనిచేస్తాం!

చిత్తూరు: జిల్లాలో ఇద్దరు సీనియర్ తహసీల్దార్లు అవినీతిలో ఆరితేరారు. వైకాపా హయాంలో చిత్తూరు నియోజకవర్గంలో పనిచేసినప్పుడు ఇంటి పట్టాల పంపిణీకి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేయడంతోపాటు ప్రభుత్వ భూములను అప్పటి ప్రజాప్రతినిధులపరం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఎన్డీయే సర్కార్ అధికారంలోకి వచ్చాక ఒకరు పూతలపట్టు, మరొకరు పలమనేరు నియోజకవర్గాల్లో తహసీల్దార్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్ ఇచ్చేటప్పుడే 'మీపై గతంలో అనేక అవినీతి ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా తీరు మార్చుకోండి' అని ఉన్నతాధికారులు హెచ్చరించారు. అప్పటికి తలూపిన ఇద్దరు తహసీల్దార్లు మండలాలకు వెళ్లాక తమ ప్రతాపం చూపుతున్నారు. వీరిద్దరి వ్యవహారశైలి ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**ఆయన్ను నడిపించేది.. డ్రైవర్**

పూతలపట్టు నియోజకవర్గంలో పనిచేస్తోన్న తహసీల్దారు.. కుటుంబ అవసరాల రీత్యా తొలుత యాదమరి మండలంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. స్థానిక నేతలు అభ్యంతరం చెప్పడంతో మరో పెద్ద మండలానికి ఆయన్ను పంపారు. అప్పటినుంచి మ్యుటేషన్లకు పెద్దమొత్తున వసూలు చేస్తున్నారు. ఆయన తరఫున డ్రైవర్ వ్యవహారాలు చక్కబెడుతున్నారు. నగదు ఇవ్వాల్సిన మొత్తం, ప్రాంతం సదరు సారథే నిర్ణయిస్తున్నారు. డబ్బు అందించిన తహసీల్దారు ధ్రువీకరించుకున్న తర్వాత దస్త్రానికి మోక్షం లభిస్తోంది. స్థానిక వీఆర్వోలు, సిబ్బంది ఏదైనా ఫైల్ పెండింగ్‌లో ఉందని.. అర్జీదారు నుంచి ఒత్తిడి వస్తోందని తహసీల్దారుకు చెబితే ముందు మీరు నా 'డ్రైవర్'తో మాట్లాడండి అని సలహా ఇస్తున్నారు.

**డబ్బులొస్తాయా.. నేనే వెళ్తా** పలమనేరు నియోజకవర్గంలో పనిచేస్తోన్న మరో తహసీల్దారుదీ ఇదే కథ. కాకుంటే ఇక్కడ సదరు అధికారి నేరుగా రంగంలోకి దిగుతారు. ఏదైనా దస్త్రంపై సంతకం పెడితే డబ్బులొస్తాయని తెలిస్తే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తారు. ఎంత ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో అక్కడే చెప్పేస్తారు. వివాదాస్పద భూములు, హైకోర్టులో కేసులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలంటే మాత్రం సిబ్బందికి చెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు.

## వైకాపా భూచోళ్లు

చిత్తూరు:పులిచెర్ల మండలం మంగళంపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 353/2లో మూడు ఎకరాలకు 1బీ, పట్టాదారు పాసుపుస్తకం జారీ చేశారు. అసలు ఈ భూమి ఎక్కడుందో రెవెన్యూ అధికారులకే తెలియదు. సదరు నంబరుతో 1బీ గడ్డంవారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి పేరుతో జారీ కావడం గమనార్హం. గుడిపాల మండలం 190.రామాపురం రెవెన్యూలో సర్వే నంబరు 355లో ఓ వ్యక్తికి అరెకరం విస్తీర్ణం ఉండగా.. మూడు ఎకరాల భూమి ఉన్నట్లు 1బీ, పట్టాదారు పాసుపుస్తకం జారీ చేశారు.గుడిపాల మండలం నారగల్లు, 190.రామాపురం రెవెన్యూలో భూములే లేనప్పటికీ పెద్దసంఖ్యలో పలువురు వ్యక్తులపై 1బీలో నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు.

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఆ పార్టీ వైకాపా నాయకులు అడ్డగోలుగా ఆక్రమించేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో డీకేటీ పట్టాలు మంజూరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. భూముల్లేవు.. పట్టాదారు పాసు పుస్తకాలుంటాయి.. 1బీలు జారీ అవుతాయి. పులిచెర్ల, గుడిపాల, గంగాధరనెల్లూరు, యాదమరి, బంగారుపాళ్యం, వెదురుకుప్పం మండలాల్లో ఇలాంటివి కోకొల్లలుగా ఉన్నాయి.

**మాజీ మంత్రి పీఏ అండదండలతో..**

పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లెకు చెందిన ఓ వైకాపా నాయకుడు.. నాటి మంత్రి పీఏ అండదండలతో రెవెన్యూ అధికారుల సహకారంతో అసైన్డ్ భూముల్లో పేర్లు మార్పు చేయించుకున్నారు. ప్రభుత్వ భూములకు బంధువులు, స్నేహితుల పేర్లతో పట్టాలు పొందారు. కొన్నిచోట్ల అసలు భూములు లేకున్నా పాసుపుస్తకాలు, 1బీల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం సదరు నాయకుడు అధికార పార్టీలోనూ కొనసాగుతూ అదే హవా కొనసాగిస్తుండటం గమనార్హం.

**అధికారుల ప్రేక్షకపాత్ర**

పులిచెర్ల, గుడిపాల, బంగారుపాళ్యం తదితర మండలాల్లో భూముల్లేకున్నా అక్రమంగా 1బీ, పట్టాదారు పాసు పుస్తకం పొంది బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## బాల్య వివాహం.. బిడ్డల ఆరోగ్యంపై ప్రభావం



అనంతపురం : గర్భిణులకు తగిన పౌష్టికాహారం అందిస్తున్నా.. బాల్య వివాహాలను నియంత్రిస్తున్నా ఆశించిన ఫలితాలు ఒనగూరడం లేదు. లోపం.. పొరపాటు ఎక్కడ ఉందో అధికార యంత్రాంగం గుర్తించలేకపోతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు అందించడంలో క్షేత్రస్థాయి అధికారుల్లో అంకితభావం కొరవడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కారణంగా బాల్య వివాహాలు యథాప్రకారమే తెరచాటుగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో గర్భిణులకు పరిపూర్ణ పౌష్టికాహారం అందించడంలో వైఫల్యం చెందుతున్నారు. వీరి నిర్వాకం.. నిర్లక్ష్యం పుట్టబోయే బిడ్డలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పోషణ లోపం, బాల్య వివాహాల కారణంగా శిశువులు తక్కువ బరువుతో పుట్టడం (ఎల్‌బీడబ్ల్యూ), లేదా నెలల తక్కువతోనే జన్మించడం జరుగుతోంది. ఈ తరహా అధ్వాన పరిస్థితులు ఉమ్మడి అనంత జిల్లాలో ఎనిమిది ప్రాజెక్టుల్లో నెలకొనడం గమనార్హం. అనంత జిల్లాలో పదకొండు ప్రాజెక్టుల్లో ఐదు, శ్రీసత్యసాయి జిల్లాలో 12 ప్రాజెక్టుల్లో మూడు ప్రకారం ఉండటం ప్రస్తావనార్హం. తక్కువ బరువుతో పుట్టే బిడ్డల గణంకాల్లో రాష్ట్రంలో 60 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా ఇందులో ఉమ్మడి అరంతపురం జిల్లాలో ఎనిమిది ఉన్నాయి.

**ముఖ్య కార్యదర్శి సమీక్ష నేడు**

నిర్దేశిత ఎనిమిది ప్రాజెక్టుల పరిధిలో తక్కువ బరువుతో పుట్టిన బిడ్డలు, తల్లుల వివరాలను సేకరించారు. ఇలా ఎందుకు పుట్టారన్న దానిపై సమగ్ర సమీక్ష చేస్తున్నారు. ఈనెల 22న విజయవాడలో ఆశాఖ ముఖ్యకార్యదర్శి సూర్యకుమారి నిర్దేశిత 60 ప్రాజెక్టుల సీడీపీఓలను రప్పిస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రథమంగా ఈ తరహా సమీక్ష జరుగుతోంది. అనంత జిల్లాలో ఆరు నెలల్లోపు పిల్లలు 10,952, ఏడు మాసాల నుంచి మూడేళ్లలోపు పిల్లలు 75,865 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు నెలల్లోపు 6,606, మూడేళ్లలోపు 49,936 మంది చొప్పున ఉన్నారు. వీరిలోనే ఆ 12 శాతం పిల్లలు ఉన్నారు. తగిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నా అనారోగ్య రుగ్మతలు ఎందుకు తలెత్తుతున్నాయన్న విషయంపై ఆరా తీస్తారు. అనంత జిల్లా నుంచి ఐదుగురు సీడీపీఓలు ముఖ్య కార్యదర్శి సమీక్షకు వెళుతున్నారని పీడీ వనజా అక్కమ్మ తెలిపారు.

**12 శాతం శిశువుల్లో..!**

పుట్టబోయే శిశువు కనీసం 2.5 కిలోల పైగా బరువు ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లని వైద్యశాస్త్రం చెబుతోంది. ఈ బరువు కంటే తక్కువ పుట్టే బిడ్డలు జిల్లాలో సగటున 12 శాతంపైగా ఉన్నట్లు ఐసీడీఎస్ లెక్క చెబుతోంది. ఈ శాతాన్ని తీవ్రంగా పరిగణిస్తారు. గతేడాది జూన్ నుంచి నవంబరు దాకా పరిగణనలోకి తీసుకుని సగటు శాతాన్ని లెక్కించారు. ఈ ప్రకారం అనంత జిల్లాలో కణేకల్లు ప్రాజెక్టులో 17.03 శాతం మంది తక్కువ బరువుతో పుట్టినట్లు తేలింది.

## ఆదాయం.. ఆరోగ్యం



ముదిగుబ్బ : రసాయనాలు వినియోగించి పండించే పంటలతో ఆరోగ్యాలు దెబ్బతినడంతోపాటు భూమి కలుషితమవుతోంది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రకృతిసాగువైపు మొగ్గుచూపారు కొందరు మహిళలు. సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కాయగూరలను మార్కెట్లో విక్రయిస్తున్నారు. తక్కువ విస్తీర్ణం, పెట్టుబడితో ప్రకృతి పంటలు సాగుచేసి చక్కని ఆదాయం పొందుతున్నారు.

**అర ఎకరంలో.. 26 రకాల పంటలు**

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) సంస్థ గ్రామ సంఘాల పరిధిలో ఉన్న మహిళలతో నాలుగేళ్ల కిందట ప్రకృతి సాగు విధానాన్ని ప్రారంభించింది. క్లస్టర్‌వారీగా మొత్తం ఆరు గ్రామాల్లో ఈ విధానాన్ని చేపట్టి మంచి ఫలితాలు సాధిస్తోంది. కొండగట్టుపల్లి, దేవరగుడిపల్లి, సానేవారిపల్లి, ఎం.కొట్టాల, ఎన్నెస్పీ కొట్టాల, తండాలో మహిళా రైతులు సాగుచేపట్టారు. ఏటీఎం మోడల్ పద్ధతిలో ముల్లంగి, గోంగూర, అనప, కంది, చిక్కుడు, అలసంద, మొక్కజొన్న, సొరకాయి, బీర, కాకర, బెండ, మెంతులు, ఆముదం, కీరదోస, పొద్దుతిరుగుడు, పచ్చిమిర్చి, వంగ, మునగ, జామ, అరటి, అల్లం, పసుపు, పలకలాకు, కొత్తిమీర, క్యారెట్, వేరుసెనగ.. ఇలా అర ఎకరంలో మొత్తం 26 రకాల పంటలు సాగుచేశారు. ఇందులో ఒకేరమైన పంటలు వరుసగా కాకుండా దూరంగా నాటడంతో ఒకచెట్టుకు వ్యాపించే తెగుళ్లు మరో చెట్టుకు వ్యాపించకుండా ఉంటాయి. ఒకసారి నాటిన స్థానంలో మరో రకం మొక్క నాటడంతో భూమి మరింత సారవంతంగా మారుతోంది. ఏటీఎం పద్ధతిలో సాగుచేయడంతో దిగుబడి బాగా రావడంతో రోజువారీ ఆదాయం పొందుతున్నారు. సొంతంగానే జీవామృతం తయారు చేసుకుని ప్రతి పదిహేనురోజులకోసారి పంటపై పిచికారీ చేస్తున్నారు. ఇలా చేయడంతో తెగుళ్లు రావని, వచ్చినా నివారించవచ్చని మహిళలు చెబుతున్నారు.

**రూ.90 వేల ఆదాయం**

ఐదు ఎకరాల్లో చీనీ సాగులో ఉంది. అందులో అర ఎకరంలో ప్రకృతిసాగు చేపట్టాను. కోతకొచ్చిన ఉత్పత్తులను గురువారం ముదిగుబ్బలో జరిగే మార్కెట్‌కు తరలిస్తున్నా. నాలుగు నెలల్లో ఇప్పటికే రూ.90 వేలకుపైగా ఆదాయం వచ్చింది. దీంతోపాటు నాలుగు ఆవులు పెంచుకోవడంతో పాలదిగుబడితో మరింత ఆదాయం వస్తోంది. నాగేశ్వరి, ఎన్నెస్పీ కొట్టాల

## కంది కొనుగోలుకు క్వింటాకు రూ.7,550
## మద్ధతు ధర ప్రభుత్వం పచ్చజెండా



అనంతపురం : కంది రైతుల కష్టాలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఆర్థిక అనుమతులను మంజూరు చేసింది. దీంతో మరో రెండు, మూడు రోజుల్లో అన్ని మండలాల్లో రైతుల నుంచి పంటను కొనేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా మండలాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీవో), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్‌లు) ద్వారా కొనుగోళ్లు చేయనున్నారు. ఈ మేరకు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. క్వింటాకు రూ.7,550 చెల్లించనున్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో క్షేత్రస్థాయిలో వ్యాపారులు ధరలు తగ్గించి రైతుల నుంచి కంది కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.6,800 మించి ఇవ్వడం లేదు. దీంతో చాలామంది కర్ణాటకలోకి రాయచూర్‌కు తీసుకెళుతున్నారు. రవాణా ఖర్చులకు భయపడి చాలామంది స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుండటంతో వేలాదిమంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

**రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే..**

ఉమ్మడి జిల్లాలో 1.14 లక్షల ఎకరాల్లో కందిపంట సాగుచేశారు. 93 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గతేడాది డిసెంబరులోనే రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలుపెట్టారు. డిసెంబరు మొదటివారంలో కంది ధర రూ.9 వేల వరకు పలికింది. తర్వాత రూ.7 వేలకు పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మద్దతు ధర లభించనుంది. ప్రతి మండలానికి ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి కందులు కొనుగోలు చేసే బాధ్యతను ఎఫ్‌పీవోలు, పీఏసీఎస్‌లకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 13 వేల గోనెసంచులు సిద్ధం చేసి ఉంచారు. ముందుగా ఆర్ఎస్‌కే (రైతుసేవా కేంద్రాలు)ల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో రైతులు వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. తేమ 12 శాతానికి మించకుండా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

## ఉక్కు విశ్రాంత
## ఉద్యోగులపై పిడుగుపాటు

విశాఖపట్నం: విశాఖ స్టీలు ప్లాంటు యాజమాన్య నిర్ణయాలు విశ్రాంత ఉద్యోగుల్లో కలవరం రేపుతున్నాయి. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) 'మెడికల్ స్కీం'లో భారీ కోతలకు ప్రతిపాదనలు చేసింది. ఆమోదం దీనిపై త్వరలో నిర్ణయం వెలువడ నుంది.

**ప్రస్తుత విధానం ఇదీ:** విశ్రాంత ఉద్యోగులకు గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీం (జీఎంఎస్) అందిస్తున్నారు. ఈ పథకంలో దంపతులకు రూ.6 లక్షల వరకూ వైద్య బీమా అందుతుంది. దంపతులిద్దరూ రూ.2,600 ఏటా చెల్లించాలి. మిగిలిన నగదు ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం భరిస్తుంది. దీంతోపాటు ఏటా ఓపీడీ (అవుట్ సైడ్ పర్చేజ్ రీయింబర్స్‌మెంట్) ఇద్దరికి రూ.16వేలు ఇస్తారు. ఆర్ఐఎన్ఎల్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుంటే ఉచితం. బయట ఎక్కడ పరీక్షలు చేయించుకున్నా, మందులు కొనుగోలు చేసినా ఓపీడీ నగదు రీయింబర్స్‌మెంట్ చేస్తారు.

ఉద్యోగులే 30 శాతం చెల్లించాలని: పాలసీ సంస్థలకు చెల్లించాల్సిన నగదులో ఇకపై విశ్రాంత ఉద్యోగులు 30 శాతం కట్టాలని, కంపెనీ 70 శాతం చెల్లిస్తుందని తాజాగా ప్రతిపాదన చేశారు. ఓపీడీ సదుపాయం రూ.16 వేలలోనూ సగానికి కోత పెట్టారు. ఇప్పటి వరకు దాదాపు 10 వేల మందికి బీమా నిమిత్తం ఏటా రూ.30 కోట్లు కడుతున్నారు. ఇకపై 30 శాతం... సుమారు సుమారు రూ.9 కోట్లు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు భరించాల్సి ఉంటుంది.



2015-17లో పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులకు నెలకు రూ.1200-1500 పింఛను వస్తుంది. వైద్య బీమాకు కంపెనీలు కోట్ చేసిన ప్రకారం భార్య, భర్తలకు కలిపి ఏటా రూ.18-20 వేలు కట్టాల్సి వస్తే వాళ్లు ఎలా బతకాలి? అంటూ కార్మిక, ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. విశ్రాంత ఉద్యోగుల్లో నిర్వాసిత కుటుంబాల సభ్యులే ఎక్కువ మంది. 'ఉక్కు'కు భూమి ఇచ్చినా కనీస ఆరోగ్య భద్రత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా సిబ్బంది తగ్గింపు**

విశాఖ స్టీలు ప్లాంటులో భద్రతా సిబ్బందిని తాజాగా మళ్లీ తగ్గించారు. ప్రధాన గేటు వద్ద ఉండే సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని 22వ తేదీ నుంచి తగ్గిస్తున్నట్లు సీజీఎం (వర్క్స్)కు సీనియర్ కమాండెంట్ లేఖ రాశారు. సాధారణ షిఫ్టుల్లో లోపలికి, బయటకు వచ్చే సమయంలో వాహనాల తనిఖీలు చేసే సిబ్బందిని కుదించనున్నారు. దీంతో 10-12 మంది ఉండే సీఐఎస్ఎఫ్ సిబ్బంది నలుగురైదుగురు మాత్రమే పనిచేయనున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉండే సిబ్బందికి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు సహకరించాలని పేర్కొన్నారు. సాధారణంగా ప్రధాన గేటు నుంచి ఉద్యోగులు, కార్మికులు 15 నిమిషాల్లో తనిఖీలు పూర్తయి బయటకు వస్తారు. భద్రత సిబ్బంది తగ్గింపుతో మరింత జాప్యమయ్యే అవకాశాలున్నాయి. అలాగే ప్లాంటు భద్రతపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

## వ్యాధి నిర్ధారణలో
## మరింత కచ్చితత్వం

నర్సీపట్నం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్‌రేకు ఏళ్ల తరబడి పాత యంత్రాలే వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఆధునిక ఎక్స్‌రేలను అమర్చాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో జిల్లాల్లోని ఆసుపత్రుల్లో 300 మెగా యాంప్స్ సామర్థ్యంతో కూడిన ఎక్స్‌రే యంత్రాల ఏర్పాటుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు వినియోగిస్తున్న పాత వాటితో నివేదికలకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తోంది. కొత్తవి కేవలం 15 నిముషాల్లోనే ఫలితాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఇవి రోగాన్ని, లోపాన్ని ఎంతో నిశితంగా గుర్తించి నివేదికలు ఇస్తాయని చెబుతున్నారు. దీని వల్ల రోగాలను త్వరితగతిన నయం చేసేందుకు వీలుంటుంది. న్యూమోనియా, మూత్రపిండాల్లో రాళ్లు, గుండె సంబంధిత సమస్యలు వీటితో స్పష్టంగా గుర్తించవచ్చని అంటున్నారు. వీటికోసం ప్రైవేటు కేంద్రాల్లో రూ. 1800 వరకు వెచ్చించాల్సి వస్తోంది. వీటి సేవలను ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే పొందవచ్చు.

కొత్త యంత్రాల కిరణాలు తీవ్రత మరింత అధికంగా ఉంటుందని చెబుతున్నారు. దీని రేడియేషన్ ప్రభావం హానికరం కావడంతో ఆసుపత్రుల్లోని ఎక్స్‌రే గదుల్లో గాలి సైతం ప్రవేశించని విధంగా వాటిని కట్టుదిట్టం చేసే పనులు ఇప్పటికే చేపట్టారు. ముఖ్యంగా వీటికి లెడ్ తలుపులను ఏర్పాటు చేసి రోగి ఒక్కరు మాత్రమే లోపల ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాల్లో అనకాపల్లి, నర్సీపట్నం ప్రభుత్వ వైద్యాలయాలు,



ఎలమంచిలి, నక్కపల్లి, కోటపాడు, అగనంపూడి ఆసుపత్రులో కొత్తవి సమకూరనున్నాయి. ఒక్కోదాని ఖరీదు రూ. 18 లక్షల వరకు ఉంటుంది. వీటిని గదుల్లో బిగించడానికి ముందుగా పూర్తి చేయాల్సిన పనులను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్లు చేపడుతున్నారు.నర్సీపట్నంలో ముందస్తు పనులు పూర్తి: ఆధునిక ఎక్స్‌రే మిషన్లు అమర్చడానికి ముందుగా చేపట్టాల్సిన పనులను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రులో పూర్తి చేశాం. వీటికి రూ.రెండు న్నర లక్షలు ఖర్చు అయింది. ఎలమంచిలి, కె.కోటపాడుల్లోనూ ఈ పనులు ముగిశాయి. ఇక్కడ త్వరలోనే యంత్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.నాయుడు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ


అత్యుత్తమంగా ఎక్స్‌రే సేవలు: ఆధునిక ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటైతే రోగులకు మరింత అత్యుత్తమ సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో వెన్నుపూసలోని సమస్యలు, లోపాలను సైతం సులువుగా ఎంతో స్పష్టంగా గుర్తించే వెసులుబాటు ఉంది. అన్ని ఆసుపత్రుల్లో లెడ్ తలుపుల ఏర్పాటు పనులు పూర్తయిన తరవాత వీటిని అమర్చనున్నారు.
శ్రీనివాస్, జిల్లా వైద్య విధాన పరిషత్తు సమన్వయకర్త

చురకలు



## మెగా డాటర్.. మణిరత్నం హీరోయిన్ గా మారిపోయిందా?

మెగా డాటర్ నిహారిక కొణిదెల గురించి అందరికీ తెలిసిందే. మెగా ఫ్యామిలీ నుంచి వన్ అండ్ ఓన్లీ హీరోయిన్ గా వచ్చిన ఆమె.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. కొంత కాలం క్రితం.. భర్తతో విడాకులు తీసుకున్న ఆమె.. కెరీర్ విషయంలో ఆచి తూచి అడుగులు వేస్తోంది. ఇండస్ట్రీలో మెల్లగా బిజీగా అవుతుంది అమ్మడు. అయితే నిహారిక ఇప్పటికే నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది కమిటీ కుర్రోళ్ళు మూవీతో మంచి హిట్ అందుకుంది మెగా డాటర్. ఐదు కోట్ల బడ్జెట్ తో రూపొందిన ఆ మూవీ.. రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. కామెడీ డ్రామా జోనర్ లో వచ్చిన ఆ మూవీ ఇరవై కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. దీంతో నిర్మాతగా నిహారికకు మంచి లాభాలు వచ్చాయని చెప్పాలి. కమిటీ కుర్రోళ్లు తర్వాత తన సొంత బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పై కొన్ని సినిమాలు, వెబ్‌సిరీసులు నిర్మిస్తోంది నిహారిక. అదే సమయంలో రెండు సినిమాల్లో ఆణె నటిస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్.. కోలీవుడ్ లో చెరో సినిమాలో యాక్ట్ చేస్తోంది. తెలుగులో వాట్ ది ఫిష్ మూవీలో నటిస్తున్న నిహారిక ఫస్ట్ లుక్ ను మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. అదే సమయంలో తమిళ మూవీ మద్రాస్ కారణ్ లో నటిస్తుండగా.. మలయాళ నటుడు



షేన్ నిగమ్ హీరోగా కనిపించనున్నారు. రొమాంటిక్ యాక్షన్ జోనర్ లో వస్తున్న ఆ మూవీని వాలి మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. అయితే రీసెంట్ గా నిహారిక ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేసిన వీడియో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో మణిరత్నం సినిమాలో ఎప్పటికీ జీవించడం అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ఆ సమయంలో పర్పుల్ శారీ వేసుకున్న నిహారిక.. ఓపెన్ హెయిర్ తో కనిపించింది. బ్యాక్ గ్రౌండ్ లో సాంగ్ ఉండగా.. వీడియోకు మంచి రెస్పాన్స్ వచ్చింది. వీడియోలో కాఫీ తాగుతూ.. తన ఎక్స్ప్రెషన్స్ తో అందరినీ మెప్పించింది నిహారిక. దీంతో నెటిజన్లు ఫుల్ గా స్పందిస్తున్నారు. మణిరత్నం హీరోయిన్ లా మారిపోయిందని కామెంట్లు పెడుతున్నారు. పెర్ఫెక్ట్ గా సెట్ అయిందని అంటున్నారు. వాస్తవానికి.. నిహారికకు దర్శకుల్లో మణిరత్నం అంటే చాలా ఇష్టమన్న విషయం తెలిసిందే. దీంతో ఇప్పుడు ఆమె లుక్స్, చూపు, నవ్వు చూస్తుంటే మణిరత్నం హీరోయిన్ గానే అనిపిస్తోందని అంటున్నారు. ఆయన సినిమాలో ఛాన్స్ దక్కించుకుంటే తిరుగులేదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే మణిరత్నం సఖి మూవీలోని కాయ్ లవ్ చెడుగుడు పాటను మద్రాక్ కారణ్ మూవీ మేకర్స్ రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. అలా ఆ సాంగ్ తో ఆయన దృష్టిలో పడుతుందేమో వేచి చూడాలి.

## ఈ సారి బుట్టబొమ్మ 'కావాలయ్యా' అంటుందా!

జైలర్ లో కావాలయ్య అంటూ ఐటమ్ సాంగ్ లో మిల్కీబ్యూటీ తమన్నా? ఏ రేంజులో మురింపించిందో తెలిసిందే. కావాలయ్యా కావాలయ్యా అంటూ కుర్రాళ్లను ఓ ఊపేసింది. చాలా గ్యాప్ తర్వాత తమన్నా విసిరిన హాట్ పంచ్ సినిమాలో బాగా వర్కౌట్ అయింది. అయితే ఈసారి ఆ ఛాన్స్ బుట్టబొమ్మ పూజాహెగ్డే తీసుకునేలా కనిపిస్తుంది. ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శక త్వంలో కూలీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో రజనీ కాంత్ గోల్డ్ స్మగ్లర్ పాత్రలో నటిస్తు న్నారు. గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ లో సాగే చిత్రమిది. ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. అయితే ఈసినిమా ఓ మాంచి



హాట్ ఐటం నెంబర్ ఒకటి లోకేష్ కనగరాజ్ ప్లాన్ చేస్తున్నాడుట. ఆ పాటలో పూజాహెగ్డే నటిస్తే బాగుంటదని భావిస్తున్నాడుట. దీనిలో భాగంగా ఆమెని అప్రోచ్ అవ్వడం.. పూజా అంగీకరించడం కూడా జరిగిందని సమాచారం. సాధారణంగా లోకేష్ సినిమాలో పాటలుండవు..ఐటం పాటలైతే అసలే కనిపించవు. కానీ కూలీ లో ఇలాంటి పాట ఒకటి పెడితే? ప్రేక్షకుడికి కాస్త రిలీఫ్ ఇచ్చినట్లు ఉ ంటుందని పాట ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్యాంగ్ స్టర్ స్టోరీల్లో ఐటం పాటలుంటే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఐటం భామని మరింత బోల్డ్ గానూ చూపించే అవకాశం ఉంటుంది. ఆ విషయంలో పూజాహెగ్డే ఎక్కడా తగ్గే పెర్ఫార్మర్ కాదు. ఇప్పటికే ఐటం సాంగ్స్ చేసిన అనుభవం కూడా ఉంది. ప్రస్తుతం అవకాశాలు కూడా అంతంత మాత్రంగా వస్తోన్న నేపథ్యంలో పూజా కిది మంచి అవకాశమే. సినిమా హిట్ అయితే పాన్ ఇండియాలోనే ఐడెంటిటీ దక్కుతుంది. ప్రస్తుతం సూర్య హీరోగా నటిస్తోన్న రెట్రోలో హీరోయిన్గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే విజయ్ 69వ చిత్రంలోనూ పూజాహెగ్డే నటిస్తోంది.




## హిందీలో 'విశ్వంభర'కి భారీ రేటు.. ఎంతో తెలుసా!



బాహుబలి, కేజీఎఫ్, సలార్, పుష్ప సినిమాలతో పాటు మరికొన్ని సౌత్ సినిమాలు బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా పుష్ప 2, బాహుబలి 2, కేజీఎఫ్ 2 సినిమాలు బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద హిందీ సినిమాలను మించి వసూళ్లు రాబట్టాయి. పుష్ప 2 హిందీ వర్షన్ రూ.1000 కోట్ల వసూళు రాబట్టింది. అందుకే సౌత్ సినిమాల విషయంలో బాలీవుడ్ డిస్ట్రిబ్యూటర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. కంటెంట్ బాగుంటే సౌత్‌లో కంటే నార్త్ లో ఎక్కువ వసూళ్లు రాబట్టిన తెలుగు సినిమాలు ఉ న్నాయి. అందుకే మెగాస్టార్ విశ్వంభర సినిమాను హిందీలో భారీ రేటుకు కొనుగోలు చేశారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర సినిమాకి హిందీ డబ్బింగ్ రైట్స్ రూపంలో భారీ బిజినెస్ జరిగింది.

విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రముఖ బాలీవుడ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ విశ్వంభర సినిమాను రూ.38 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రూ.50 కోట్ల వసూళ్లు సాధిస్తుందనే నమ్మకంతో అంత భారీ మొత్తానికి కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి సౌత్ ఇండియాలోనే కాకుండా నార్త్ ఇండియాలోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన సోషియో ఫాంటసీ సినిమా అంటే కచ్చితంగా ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. మినిమం కంటెంట్ ఉంటుంది. బింబిసార సినిమాతో వశిష్ట కమర్షియల్ సక్సెస్‌ను అందుకున్నాడు. అందుకే ఈ సినిమా సైతం ఆయన అన్ని వర్గాల వారిని అలరించే విధంగా రూపొందిస్తాడనే నమ్మకం ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు భారీ ఎత్తున బిజినెస్‌కి అవకాశాలు ఉన్నాయి. సినిమాను విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా టీజర్ విడుదలైన తర్వాత అంచనాలు పెరిగాయి. కొందరు విమర్శలు చేసినా ఎక్కువ శాతం మంది కంటెంట్ విషయంలో చాలా నమ్మకంగా ఉన్నారు. సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని భావించినా వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో రాజీ పడటం లేదు. అందుకే సినిమా విడుదల వాయిదా వేశారు. అంతర్జాతీయ స్థాయి వీఎఫ్ఎక్స్ టీం ఈ సినిమాకు వర్క్ చేస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ సినిమాలకు వర్క్ చేసిన వీఎఫ్ఎక్స్ ఎక్స్‌పర్ట్స్ ఈ సినిమాకు గాను వర్క్ చేస్తున్నారని సమాచారం అందుతోంది. సినిమాలోని వీఎఫ్ఎక్స్ షాట్స్ కోసం ప్రత్యేకంగా షూట్ చేశారు. వాటికి సంబంధించిన వర్క్ గత కొన్ని నెలలుగా జరుగుతుంది. మే నెలలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం అవుతున్న కారణంగా మే నెలలోనూ సినిమా విడుదల అయ్యేనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు విశ్వంభర సినిమా విడుదల తేదీ విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. త్వరలో రిలీజ్ డేట్‌పై క్లారిటీ వస్తుందేమో చూడాలి.

## 'ఛావా' కి సరస్వతి శిశు మందిర్ సెల్యూట్!



ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన –'ఛావా' ఇటీవల రిలీజ్ అయి గ్రాండ్ విక్టరీ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద 200 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. హిందీతో పాటు ఏక కాలంలో తెలుగు లో కూడా రిలీజ్ అయితే బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలు నమోదు చేసేది. హిందీలో రిలీజ్ అయినా తెలుగు ఆడియన్స్ కి ఎంతగానో కనెక్ట్ అయింది. ఇప్పటికే సినిమా చూసిన తెలుగు ఆడియన్స్ అంతా హిందువులంతా చూడాల్సిన సినిమా అని చాటి చెబుతున్నారు. ఇలాంటి గొప్ప సినిమాని తెలుగు భాషలోకి విడుదల చేయాలి అన్న డిమాండ్ కూడా పెరుగుతోంది. శంభాజీ మహారాజ్ పాత్రలో విక్కీ కౌశల్..ఏసుబాయి పాత్రలో రష్మిక మందన్న ఆకట్టుకున్న తీరుకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఇలాంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తాయని..తప్పక చూడాల్సిన చిత్రమని స్వచ్ఛందంగా ప్రమోట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాని తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి లోని సరస్వతీ శిశు మందిర్ విద్యార్థినీ, విద్యార్థులు కూడా ఛావానీ వీక్షించారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ పట్ల తమ ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు. థియేటర్లో శంభాజీని గౌరవిస్తూ స్టాండిగ్ ఓవేషన్ ఇచ్చారు. దానికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. థియేటర్ అంతా ఆ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బుక్ చేసుకున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా సినిమాని వీక్షించారు. ఇలాంటి గొప్ప గౌరవం కొన్ని సినిమాలకు మాత్రమే దక్కుతుంది. అందులో ఛావా కూడా నిలిచింది. చారిత్రాత్మక నేపథ్యంగల సినిమాలు ప్రేక్షకు లకు కొత్తేం కాదు. కానీ ఆ చరిత్ర ఎంతో గొప్పగా ఉంటే తప్ప! ఇలాంటి గౌరవ మర్యాదలు దక్కవు. ఆ రకంగా ఛావా ఓ రికార్డు సృష్టించింది.

## సీకే దేవత దెబ్బకు నగరంలో కర్ఫ్యూ

ప్రఖ్యాత కెల్విన్ క్లెయిన్ బ్రాండ్ అంబాసిడర్ గా దిశా పటానీ యూత్ గుండెల్లో నిదురిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా టీనేజీ, కాలేజీ బోయ్స్ నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ ఏజ్ తో సంబంధం లేకుండా అందరికీ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడమెలానో దిశాకు బాగా తెలుసు. అందుకే సీకే కంపెనీ ఈ భామను ఎప్పటికీ విడిచిపెట్టడం లేదు. 2020 కరోనా క్రైసిస్ కి ముందు నుంచే సీకే బ్రాండ్ కి దిశా పటానీ ప్రచారం చేస్తోంది. నాలుగేళ్లుగా ఈ బ్రాండ్ ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన ఘనత నిరభ్యంతరంగా దిశాకే చెందు తుంది. లోదుస్తుల కంపెనీ లాభాల్ని స్కైలోకి చేర్చిన దిశా పటానీ, తాజాగా మరోసారి సీకే బ్రాండ్ లోదుస్తుల్లో విజృంభించింది. రకరకాల ఇన్నర్ దుస్తుల్లో దిశా పటానీ ఫోజులు ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్



చేస్తున్నాయి. "మీ రోజువారీ భ్రమణం ఇలా మొదలవ్వాలి! అంటూ దిశా పటానీతో సీకే బ్రాండ్ ప్రచారం చేయిస్తోంది. కాల్విన్ క్లైన్ లోదుస్తులతో దిశా సీజన్‌ను ప్రారంభిస్తుంది. ఐకానిక్ కంఫర్ట్ లుక్ ఇదిగో అంటూ యూత్ ని టీజ్ చేసింది. ఇన్‌స్టాలో దిశా పటానీ సీకే లోదుస్తుల్లో ఒంపుసొంపులు ప్రదర్శించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. ఇవన్నీ అంతర్జాలంలో క్షణాల్లో వైరల్ అయ్యాయి. గూగుల్ లో ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ ట్రెండింగ్ లో ఉన్నాయి. సీకే దేవత దిశా మరోసారి చెలరేగిపోయింది! అంటూ బోయ్స్ జోరుగా కామెంట్లు చేస్తున్నారు. సీకే దేవత దెబ్బకు నగరంలో కర్ఫ్యూ విధించారంటూ ఒక అభిమాని సరదాగా వ్యాఖ్యానించాడు.

దిశా పటానీ కెరీర్ మ్యాటర్ కి వస్తే... ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు పడుతున్నాయి. ఒక హిట్టు రెండు ఫ్లాపులతో అలా ముందుకు సాగుతోంది. అయితే జయాపజయాలతో సంబంధం లేకుండా ఈ హాలి బ్యూటీ అవకాశాలు అందుకుంటోంది. ఇటీవల కల్కి 2898 ఏడి చిత్రంలో కనిపించిన దిశా పటానీ తదుపరి సీక్వెల్ లోను కనిపించనుంది. మరోవైపు 'వెల్ కం టు ది జంగిల్' లాంటి భారీ మల్టీస్టారర్ చిత్రంలోను దిశా నటిస్తోంది.

## బాలీవుడ్‌లో శ్రీలీలకి అంత తక్కువా..?

టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా సినిమాలు చేస్తున్న శ్రీలీల ఇటీవలే కోలీవుడ్ సినిమాల్లోనూ అవకాశాలు దక్కించుకుంది. ఈమధ్య కాలంలో శ్రీలీల జోరు మామూలుగా లేదు. ఈ అమ్మడు చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం సక్సెస్ రేటు ఉండటంతో లక్కీ బ్యూటీ అనే పేరును సొంతం చేసుకుంది. అల్లు అర్జున్‌తో కలిసి పుష్ప 2 లో వేసిన కిస్సిక్ డాన్స్‌తో ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి డాన్సర్‌గా ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కడంతో మరిన్ని సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి. అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు చేస్తున్న సినిమాల సంఖ్య చాలా ఉన్నాయి. తాజాగా బాలీవుడ్‌లోనూ ఈ అమ్మడు అడుగు పెట్టేందుకు రెడీ అయింది. బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ హీరోగా రూపొందబోతున్న ఒక సినిమాలో శ్రీలీలను ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి. మొదట ఆ పాత్రకు యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రిని ఎంపిక చేశారు. కానీ ఆ పాత్రలో త్రిప్తి కంటే శ్రీలీల అయితే బాగుంటుంది అనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయానికి వచ్చారు అంటూ హిందీ సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తున్న



ఎంతో మంది హీరోయిన్స్ బాలీవుడ్‌లో ఒక్క అవకాశం అంటూ ఎదురు చూస్తూ ఉంటారు. అలాంటిది శ్రీలీల వెయిట్ చేయకుండానే బాలీవుడ్‌లో నటించే అవకాశం దక్కింది. ముందు ముందు బాలీవుడ్‌లో ఈ అమ్మడు ఫుల్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. శ్రీలీల బాలీవు డ్‌లో మొదటి సారి నటించబోతున్న నేపథ్యంలో ఆమె పారితోషికం గురించి ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. పుష్ప 2 సినిమాలో కిస్సిక్ సాంగ్‌ను చేసేందుకు గాను శ్రీలీల ఏకంగా రూ.2 కోట్ల పారితోషికం తీసుకుంది. అలాంటిది బాలీవుడ్‌లో సినిమాకు రూ.4 కోట్ల పారితోషికం అందుకుంటూ ఉంటుందని అంతా భావిస్తున్నారు. కానీ విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం శ్రీలీల తన మొదటి హిందీ సినిమాకు గాను కేవలం రూ.1.75 కోట్లను మాత్రమే పారితోషికంగా అందుకుంటుందట. మొదటి హిందీ సినిమా కావడంతో ఈ అమ్మడికి పారితోషికం తక్కువ ఇస్తున్నారని టాక్ విని పిస్తుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో రెండు కోట్లకు తగ్గకుండా పారితోషికం తీసుకుంటూ సినిమాలు చేస్తున్న శ్రీలీల బాలీవుడ్‌లో మాత్రం ఎందుకు తక్కువకు సినిమాలు చేసేందుకు ఒప్పుకుంటుంది అంటూ కొందరు ఆమె ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్తీక్ ఆర్యన్‌తో చేస్తున్న సినిమా హిట్ కొడితే వెంటనే శ్రీలీల తన పారితోషికంను డబుల్ చేసే అవకాశాలు ఉన్నాయని, ఆ ఉద్దేశంతోనే శ్రీలీల ఈ నిర్ణయం తీసుకుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సినిమాలతో టాప్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో నిలిచిన శ్రీలీల త్వరలో కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ సక్సెస్‌లతో తన సత్తా చాటేనా చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536